www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
మంగళవారం
01-10-2024
సంపుటి : 01 | సంచిక : 149 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




# సెలవు రోజుల్లో కూల్చివేతలెందుకు?

- ఎమ్మార్వో చెప్తే చార్మినార్, హైకోర్టునూ కూలుస్తారా?
- పొలిటికల్ బాసుల మెప్పుకోసం పనిచేస్తే ఇంటికెళ్తారు
- స్టేలను పట్టించుకోకుంటే సుమోటోగా తీసుకుని విచారిస్తాం
- హైడ్రాపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

**విశ్వంభర, హైదరాబాద్**

ఎమ్మార్వో అడిగితే చార్మినార్, హైకోర్టును కూడా కూల్చేస్తారా ? శని, ఆదివారాలు సాయంత్రం కూల్చివేతలు ఎందుకు చేపడుతున్నారు, సెలవుల్లో నోటీసులు ఇచ్చి అత్యవసరంగా ఎందుకు కూలుస్తున్నారు? ఇల్లు కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఇస్తున్నారా?...ఇలా పలు ప్రశ్నలు సంధిస్తూ హైడ్రాపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా చర్యలు ఇదే విధంగా...

మిగతా2లో...




## దేవుడినైనా రాజకీయాలకు
# దూరంగా ఉంచాలి

* కల్తీ నెయ్యి కలిపారని ఎలా చెబుతారు?
* ఆరోపణలపై సమగ్రమైన ఆధారాలు లేవు
* సీఎం చంద్రబాబు పబ్లిక్ గా ఎలా ప్రకటన చేశారు?
* తిరుమల లడ్డూ ప్రసాదంపై సుప్రీం కీలక వ్యాఖ్యలు



మతాన్ని, రాజకీయాలను కలపవద్దు అని, కనీసం దేవుళ్లను రాజకీయాలకు దూరంగా పెట్టాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. తిరుమల లడ్డూ వివాదంపై దాఖలైన పిటీషన్లపై సోమవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. లడ్డూలో జంతు కొవ్వు వాడినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ అంశాన్ని అత్యున్నత న్యాయస్థానం విచారించింది. జస్టిస్ బీఆర్ గవాయి, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఆ పిటీషన్లపై వాదనలు చేపట్టింది. తిరుమల లడ్డూ తయారీలో జంతు నెయ్యిని వాడినట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్రమైన రీతిలో ఆధారాలు లేవని కోర్టు చెప్పింది. అలాంటి సందర్భంలో సీఎం చంద్రబాబు ఎలా పబ్లిక్‌గా ప్రకటన చేశారని కోర్టు ప్రశ్నించింది.

(పూర్తి వివరాలు 10లో)

# మిథున్ చక్రవర్తికి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

* సినీరంగంలో చేసిన విశేష సేవలకుగాను పురస్కారం
* అక్టోబర్ 8న ప్రదానం..
* శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని
* విభిన్న నటనతో ఎన్నోతరాలు అలరించారని కితాబు



2

# మెట్రో రైళ్లలో ఆఫర్లు పొడిగింపు

- మార్చి 31 వరకు కొనసాగుతాయి
- ఎండీ కేవీబీ రెడ్డి ప్రకటన



2







## వంద నియోజకవర్గాల్లో
# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్

- 20 నుంచి 25 ఎకరాల్లో...ఒక్కోటి రూ.100 కోట్లతో ఏర్పాటు
- విద్యార్థుల సమగ్ర వికాసానికే ఈ నిర్ణయం
- పేదలకు మంచి విద్య అందించడమే మా విధానం..
- ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియ...
- ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం కాదు.. భావోద్వేగం..
- డీఎస్సీ ఫలితాల ప్రకటన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 9న ఎల్‌బీ స్టేడియంలో నియామక ప్రతాలు అందజేస్తామని ప్రకటన

**విశ్వంభర, హైదరాబాద్**

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా తెలంగాణవ్యాప్తంగా వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు వేర్వేరుగా ఉండడంతో పిల్లల్లో ఆత్మనూన్యత భావం ఏర్పడేదని..దానిని తొలగించి వారి సమగ్ర వికాసానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం వివరించారు. ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో.. రూ.వంద కోట్లతో ఒక్కో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని సీఎం తెలిపారు. ఇప్పటికే కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైందని, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డీఎస్సీ2024 ఫలితాలను రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం...

మిగతా2లో...

# పకడ్బందీగా పైలట్ ప్రాజెక్టు

- కుటుంబ డిజిటల్ కార్డులపై... ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు క్షేత్ర స్థాయి పరిశీలన
- 238 ప్రాంతాల్లో 5 రోజుల పాటు సాగనున్న ప్రక్రియ
- పట్టణ/నగర ప్రాంతాల్లో జనాభా ఆధారంగా ఎక్కువ బృందాలు
- కుటుంబ సభ్యులు అంగీకరిస్తేనే ఫొటో తీసుకోండి
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు

2

## హామీలు నెరవేర్చే వరకు
# పోరాటం ఆగదు

- వెయ్యిమందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు: ఏలేటి
- రైతు రుణమాఫీ వివరాలను ప్రజాపోర్టల్‌లో పెట్టండి
- బీజేపీ నేతల హెచ్చరిక
- ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద రైతు దీక్ష

2



## కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై
# కేసు నమోదు చేసిన ఈడీ

- మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్లతో ఈసీఐఆర్ దాఖలు
- నిందితులకు సమన్లు జారీ చేసి ప్రశ్నించే అవకాశం



**బెంగళూరు:** కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం చర్యలు చేపట్టింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కుంభకోణం ఆరోపణల పై మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. సీఎం సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి, ఆయనకు భూమిని అమ్మిన దేవరాజుపై సెప్టెంబర్ 27న మైసూరు లోకాయుక్త నమోదు చేసిన కేసును ఈసీ పరిగణనలోకి తీసుకున్నది. ఈ నేపథ్యంలో వారిపై ఈడీ కేసు నమోదుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు సమాచార నివేదిక (ఈసీఐఆర్) ను దాఖలు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ)లోని సెక్షన్లను ఈసీఐఆర్‌లో పేర్కొంది. ఈ నేపథ్యంలో నిందితులకు ఈడీ సమన్లు జారీ చేసి ప్రశ్నించడంతోపాటు వారి ఆస్తులను అటాచ్ చేసే అవకాశం ఉంది.

కాగా, సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి ఆమె సోదరుడు బహుమతిగా ఇచ్చిన భూమిని ముడా సంస్థ స్వాధీనం చేసుకున్నది. ఆ భూమికి బదులుగా కోట్ల విలువైన 14 ప్లాట్లను ఆమెకు కేటాయించింది. ఇందులో భారీగా అవినీతి, అక్రమాలు జరిగినట్లు కర్ణాటకలోని ప్రతిపక్షమైన బీజేపీ ఆరోపించింది. దీంతో సీఎం సిద్ధరామయ్యపై విచారణ జరిపేందుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అనుమతి ఇచ్చారు. మరోవైపు గవర్నర్ నిర్ణయాన్ని కర్ణాటక హైకోర్టు సమర్థించింది. అనంతరం లోకాయుక్త పోలీసుల విచారణకు బెంగళూరులోని ప్రత్యేక కోర్టు కూడా గత వారం ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య, ఆయన భార్య, బావమరిది, భూమిని అమ్మిన వ్యక్తిపై లోకాయుక్త పోలీసులు కేసు నమోదు చేశారు. దీని ఆధారంగా ఈడీ కూడా సోమవారం కేసు నమోదు చేసింది.

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి




## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 115 | ₹ 137 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 199 | ₹ 226 |

# హరీశ్‌రావు X అనిల్ కుమార్

- ఓ కన్వెన్షన్‌లో హరీశ్‌రావుకు వాటాలు : అనిల్ కుమార్ యాదవ్ ఆరోపణ
- ఖండించిన హరీశ్ రావు... అనిల్‌కు లీగల్ నోటీసులు
- ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం




2

## మహిళలను వ్యక్తిగతంగా
# అవమానించడం సరికాదు

- పోస్ట్ చూశాక అన్నం తినలేదు..నిద్రకూడా పోలేకపోయా...
- కవిత పట్ల ఎవరైనా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కేటీఆర్ సమర్థిస్తారా
- మీడియా సమావేశంలో కన్నీటి పర్యంతమైన మంత్రి కొండా సురేఖ
- బీఆర్ఎస్ నాయకులారా.. ఖబడ్దార్ అంటూ హెచ్చరిక

**విశ్వంభర, హైదరాబాద్**

మహిళల పై బీఆర్ఎస్ పార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తల వైఖరి జుగుప్సాకరంగా ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఎస్టీ మహిళ అయిన సీతక్క, మేయర్ గద్వాల విజయలక్ష్మిల పై బిఆర్ఎస్ సోషల్ మీడియా అవమానకరమైన పోస్టులను మరువక ముందే తనను, మరో నేతను కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ వ్యవహారంతో ముడిపెట్టి, హేయమైన చర్యలకు పాల్పడ్డారని మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం అభ్యంతరకర రీతిలో పోస్టులు చేస్తూ తన ప్రతిష్టను దిగజార్చేలా ట్రోలింగ్స్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గాంధీభవన్ లో మీడియా సమావేశం లో మంత్రి మాట్లాడుతూ..



## సెలవు రోజుల్లో కూల్చివేతలెందుకు?

### హైడ్రాపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ఉంటే, స్టే ఇవ్వాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించింది. పొలిటికల్ బాసుల మెప్పు కోసం యత్నిస్తూ, అధికారులు చట్ట వ్యతిరేకంగా పని చేస్తే ఇంటికెళ్తారు జాగ్రత్త అంటూ మందలించింది. కోర్టు స్టేలను కూడా పట్టించుకోకుండా కూల్చివేతలు చేపడితే, ధిక్కరణ కింద సుమోటోగా తీసుకోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది.

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో కూల్చివేతలపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా హైడ్రాపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వర్చువల్‌గా హాజరైన కమిషనర్ రంగనాథ్‌ను, నేరుగా హాజరైన అమీన్‌పూర్ తహసీల్దార్‌ను ఉద్దేశించి పలు అంశాలను ప్రస్తావించింది. హైడ్రా ఏర్పాటు ఎంతో ప్రశంసనీయమని, కానీ నిబంధనలు పాటించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తిగా ఉన్నామంది. ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా అంటూ రంగనాథ్‌ను ఉద్దేశించి హైకోర్టు ప్రశ్నించింది. ఎమ్మార్వో విజ్ఞప్తి మేరకు చర్యలు తీసుకున్నామని రంగనాథ్ చెప్పడంతో, ఎమ్మార్వో అడిగితే గుడ్డిగా చర్యలు తీసుకుంటారా అంటూ మందలించింది. ఎమ్మార్వో అడిగితే చార్మినార్, హైకోర్టు కూడా కూల్చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా, రంగనాథ్ పనితీరుపై తాము సంతృప్తికరంగా లేమని, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అంటే కూల్చివేతలేనా అంటూ వ్యాఖ్యానించింది. హైడ్రా కేవలం కూల్చివేతలపైనే ఫోకస్ పెట్టినట్టు కనిపిస్తోందని పేర్కొంది. కోర్టు స్టేలను కూడా పట్టించుకోకుండా కూల్చివేతలు చేపడితే, ధిక్కరణ కింద సుమోటోగా స్వీకరించాల్సి వస్తుందని మందలించింది. రాజకీయ నేతలు, పాలక వర్గాల మెప్పు కోసం నిబంధనలు ఉల్లంఘించడం తగదంటూ హితవు పలికింది.

#### కూల్చివేతలపైనే దృష్టి ఎందుకు?

జీవో ప్రకారం హైడ్రాకు ఎన్నో విధులు ఉన్నాయని, మిగతావి పట్టించుకోకుండా కూల్చివేతలపైనే దృష్టి ఎందుకు పెడుతున్నారని నిలదీసింది. ట్రాఫిక్ సమస్యపైనా హైడ్రాకు బాధ్యత ఉందని గుర్తు చేసింది. ట్రాఫిక్ గురించి ఏమాత్రం పట్టించుకోవట్లేదని వ్యాఖ్యానించింది. మాదాపూర్‌లో ప్రయాణానికి ఎంత సమయం పడుతుందో తెలుసు కదా అంటూ గుర్తు చేసింది.

#### శాఖల సమన్వయ లోపంతో సామాన్యులు నష్టపోవాలా?

సబ్ రిజిస్ట్రార్, స్థానిక సంస్థలు అనుమతి ఇస్తేనే ఇళ్లు నిర్మించుకుంటున్నారని, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపంతో సామాన్యులు నష్టపోవాల్సి వస్తోందని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. అడిగిన ప్రశ్నలను దాటవేయకుండా సమాధానం ఇవ్వాలని రంగనాథ్‌కు సూచించింది. కోర్టులను ఎంతో గౌరవిస్తున్నామని, న్యాయమూర్తికి రంగనాథ్ తెలిపారు. మూసీపై కూడా 20 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయని హైకోర్టు గుర్తు చేసింది. చట్ట ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అమీన్‌పూర్ తహసీల్దార్‌ను హైకోర్టు హెచ్చరించింది.

#### ఇల్లు కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఇచ్చారా?

నేతలు, అధికారులు చెప్పినంత మాత్రాన అక్రమంగా ముందుకెళ్లొద్దని స్పష్టం చేసింది. ఇల్లు కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఏమైనా ఇచ్చారా?, చనిపోయే వ్యక్తిని కూడా చివరి కోరిక ఏంటని అడుగుతారని హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురి చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా ఇదే విధంగా ముందుకు వెళ్తే జీవో 99పై స్టే ఇవ్వాల్సి వస్తుందని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

#### అత్యవసరంగా కూల్చాల్సిన అవసరమేంటి?

శని, ఆదివారాలు సాయంత్రం కూల్చివేతలు ఎందుకు చేపడుతున్నారు,సెలవుల్లో నోటీసులు ఇచ్చి అత్యవసరంగా ఎందుకు కూలుస్తున్నారని రంగనాథ్‌ను హైకోర్టు నిలదీసింది. శని, ఆదివారాల్లో కూల్చవద్దని గతంలో తీర్పులున్నాయని, కోర్టు తీర్పుల విషయం తెలియదా అని తహసీల్దార్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఖాళీ చేయకపోతే అత్యవసరంగా కూల్చాల్సిన అవసరమేంటని నిలదీసింది. ఆదివారం మీరు ఎందుకు పని చేయాలని అధికారులను ప్రశ్నించిన హైకోర్టు, పై అధికారులను మెప్పించేందుకు చట్ట విరుద్ధంగా పని చేయవద్దని సూటిగా చెప్పింది.పొలిటికల్ బాస్‌లను సంతృప్తి పరిచేందుకు పని చేయొద్దు, అధికారులు చట్ట వ్యతిరేకంగా పని చేస్తే ఇంటికెళ్తారు జాగ్రత్త అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. అమీన్‌పూర్ కూల్చివేతలపై విచారణ వచ్చే నెల 15కు వాయిదా వేసిన ధర్మాసనం, అప్పటి వరకు హైడ్రా, అమీన్‌పూర్ తహసీల్దార్‌కు యథాతథస్థితి కొనసాగించాలని ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది.

## హామీలు నెరవేర్చే వరకు పోరాటం ఆగదు

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చాక వెయ్యి మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.రైతు హామీల సాధన దీక్ష పేరుతో బీజేపీ ప్రజా ప్రతినిధులు హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద చేపట్టిన దీక్ష 24 గంటల దీక్షలో ఆయన మాట్లాడారు. పలువురు బీజేపీ నేతలు ఈ సందర్భంగా ప్రసంగించారు. రైతు రుణమాఫీ వివరాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పోర్టల్‌లో పెట్టాలని వారు డిమాండ్ చేశారు. రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే రుణమాఫీ ఎంత చేశారో ప్రజా పోర్టల్‌లో పెట్టాలని ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. అధికారం పదేళ్లలో బీఆర్ఎస్ ఎంత అపఖ్యాతి మూటకట్టుకుందో పది నెలల్లో కాంగ్రెస్ అంతే మూటకట్టుకుందని ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. "రేవంత్ రెడ్డికి దమ్ముంటే రుణమాఫీ ఎంత చేశారో ప్రజా పోర్టర్‌లో పెట్టాలి. రుణమాఫీ పూర్తిగా సాధ్యం కాదని తెలిసి కూడా హామీలు ఇచ్చారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తి చేసే సత్తా కాంగ్రెస్‌కు లేదు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మాత్రమే పూర్తిగా అమలు చేశారు.మాట ఇస్తే తప్పని వ్యక్తి ప్రధాని మోదీ మాత్రమే" అని బీజేపీ నేతలు ఈ సందర్భంగా అన్నారు. మంగళవారం ఉదయం 11 గంటల వరకు బీజేపీ ప్రజాప్రతినిధుల నిరసన దీక్ష కొనసాగనుంది. దీక్షకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఆ పార్టీ నాయకులు తరలి వచ్చి సంఘీభావం తెలిపారు. ఆ పార్టీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే.అరుణ, రఘునందన్ రావు, ధర్మపురి అర్వింద్, గోడెం నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, పాల్వాయి హరీశ్ బాబులు దీక్షలో కూర్చున్నారు. కాగా బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్ , పార్టీకి సంబంధించిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకటరమణారెడ్డి, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌లు నిరసన దీక్షకు హాజరుకాలేదు.

## మహిళలను వ్యక్తిగతంగా అవమానించడం సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

తనపై బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం అభ్యంతరకర రీతిలో పోస్టులు పెట్టడం పట్ల తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఈ పోస్టును చూశాక తాను నిన్నటి నుంచి అన్నం తినలేదని, నిద్రకూడా పోలేకపోయానన్నారు. ఈ పోస్టు పెట్టిన వారి ఇంట్లో కూడా అక్కా, చెల్లె, తల్లి ఉన్నారని, వారింట్లో ఆడపిల్లలు ఉన్నారని గుర్తించాలన్నారు.

తెలంగాణతో పాటు పక్క రాష్ట్రానికి వెళ్ళినా అన్ని పార్టీల వాళ్లు తనను అక్కా అని, తన భర్త కొండా మురళిని బావ ఎంతో గౌరవంగా పిలుస్తారని అన్నారు. ఓడిపోయామన్న అసహనంతో, నిరాశావాదంతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులు వెనుకుండి సోషల్ మీడియాను పావుగా వాడుకుంటూ ఈ తతంగాన్ని నడిపిస్తున్నారని మంత్రి సురేఖ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మహిళలు, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని పోస్టులు పెడుతూ, ట్రోలింగ్స్ చేస్తూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం రాక్షసానందం పొందుతోందని పేర్కొన్నారు . చేనేతలను అవమానించే విధంగా బీఆర్ఎస్ పార్టీ ప్రవర్తించిందని మంత్రి సురేఖ పేర్కొన్నారు. చేనేతలకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేకపోగా ఇంకా ఇలా అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . కవిత పట్ల ఎవరైనా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కేటీఆర్ సమర్థిస్తారా అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాల పరంగా ఎలా విమర్శించినా భరిస్తాం కానీ వ్యక్తిగత ప్రతిష్ట దిగజారేలా ప్రవర్తిస్తే తీవ్రమైన ప్రతిచర్యలుంటాయని ఆమె హెచ్చరించారు. “నీ ఇంట్లో చెల్లిని ఇలాగే అంటే ఊరుకుంటారా? పశువుల కంటే హీనంగా ప్రవర్తిస్తున్నారు” అని కొండా సురేఖ నిప్పులు చెరిగారు. ఇలాంటి వారిని సమర్థిస్తున్న కేటీఆర్‌కు ఇప్పటికైనా బుద్ధి రావాలని అన్నారు. కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే.. ‘బట్టలిప్పి ఉరికిస్తాం’ అని సురేఖ వార్నింగ్ ఇచ్చారు.

## వంద నియోజకవర్గాల్లో..

# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి అనేది ఉద్యోగం కాదని భావోద్వేగమని పేర్కొన్నారు. నిరుద్యోగమనేది తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉందని, నియామకాలే లక్ష్యంగా తెలంగాణ ఉద్యమం సాగిందన్నారు. తమ ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు.



#### దసరాకు ముందే పండుగ వాతావరణం

కేసీఆర్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో కేవలం ఒకసారి డీఎస్సీ నిర్వహించి 7,857 పోస్టులు భర్తీ చేస్తే, తమ ప్రజా ప్రభుత్వం పది నెలల్లోనే 11,062 పోస్టులకు డీఎస్సీ నిర్వహించిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి పోస్టుకు 1:3 నిష్పత్తిలో ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు అక్టోబరు 9న ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలు అందజేస్తామని, ఆయా అభ్యర్థుల కుటుంబాల్లో దసరా పండగకు ముందే పండగ వాతావరణం నెలకొనేలా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత టెట్ నిర్వహించాలని నిరుద్యోగుల నుంచి విజ్ఞప్తి వస్తే మరోసారి టెట్ నిర్వహించగా డీఎస్సీ రాసేందుకు అదనంగా 1,09,168 మంది అభ్యర్థులు అర్హత సాధించారని ముఖ్యమంత్రి చెప్పారు. డీఎస్సీ రాత పరీక్షలను జులై 18వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు 26 సెషన్లలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించినట్లు సీఎం తెలిపారు. డీఎస్సీ, టెట్ నిర్వహణలో సమర్థంగా వ్యవహరించారని, బాగా కష్టపడ్డారని విద్యా శాఖ అధికారులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు.

#### విద్యపై పెట్టేది ఖర్చు కాదు..పెట్టుబడి

పేదలకు విద్యను అందించాలనే ఆలోచన గత కేసీఆర్ ప్రభుత్వానికి లేదని, అందుకనే పదేళ్లలో కేవలం ఒక్క డీఎస్సీ మాత్రమే వేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. విద్యకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే డీఎస్సీ నిర్వహణకు నిర్ణయం తీసుకున్నామని, తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శమని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వం విద్యా శాఖను నిర్లక్ష్యం చేసిందని, బడ్జెట్ కేటాయింపులు తక్కువగా చేసేదని, తాము అధికారంలోకి వచ్చాక విద్యా శాఖకు నిధుల కేటాయింపు పెంచామని, భవిష్యత్‌లో నిధులు మరింతగా కేటాయిస్తామని సీఎం అన్నారు. గత ప్రభుత్వం కోళ్ల షెడ్లు, అద్దె గృహాల్లో వసతి గృహాలు ఏర్పాటు చేసిందని, కనీస మౌలిక వసతులు కల్పించలేదన్నారు. ప్రస్తుతం ఆయా వసతిగృహాల్లో ఎదురవుతున్న సమస్యలపై కొన్ని పార్టీలకు చెందిన మీడియాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, పదేళ్లు ప్రభుత్వంలో ఉన్నవాళ్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతోనే ఆ సమస్యలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పుడు ఆయా పాఠశాలల్లో వసతులు లేవంటూ తమపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. అందుకే తమ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం ఏళ్ల తరబడి టీచర్ల ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టలేదని సీఎం విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఎటువంటి వివాదాలకు తావు లేకుండా బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టామని ఆయన తెలిపారు. విద్యపై పెట్టేది ఖర్చు కాదని.. పెట్టుబడి అని తాము భావిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థుల సంఖ్యతో ప్రమేయం లేకుండా ప్రభుత్వ పాఠశాలలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

#### ఉద్యోగా నియామకాలే లక్ష్యంగా....

నిరుద్యోగులకు అండగా నిలవడం, ఉద్యోగ నియామకాలే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే 30వేల ఉద్యోగాల నియామక పత్రాలు అందించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. గ్రూప్ 1, 2, 3 పోస్టులను అంగడీ సరకుల్లా మార్చిన టీజీ పీఎస్సీని ప్రక్షాళన చేశామన్నారు. ఎటువంటి లోపాలు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మొత్తంగా మొదటి ఏడాదిలోనే 60వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తున్నామని సీఎం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనరసింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, విద్యా శాఖ కమిషనర్ ఈవీ నరసింహారెడ్డి, అదనపు డైరెక్టర్ కె.లింగయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పైలట్ ప్రాజెక్టు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పైలట్ ప్రాజెక్టును సమర్థంగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఒక వేళ పూర్తిగా పట్టణ/నగర నియోజకవర్గమైతే రెండు వార్డులు/ డివిజన్లు, పూర్తిగా గ్రామీణ నియోజకవర్గమైతే రెండు గ్రామాల్లో మొత్తంగా 238 ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టాలని సూచించారు. వార్డులు/ డివిజన్లలో జనాభా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిశీలన బృందాల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలట్ ప్రాజెక్టు, సేకరించే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్న గ్రామాలు, వార్డులు/ డివిజన్ల ఎంపిక పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. పైలట్ ప్రాజెక్టును ఎన్ని రోజుల పాటు చేపడతారని సీఎం ప్రశ్నించారు. అక్టోబరు మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకు అయిదు రోజుల పాటు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంతా సమ్మతిస్తేనే కుటుంబం ఫొటో తీయాలని, అదో అప్షనల్ గా ఉండాలన్నారు. కుటుంబం సమ్మతి లేకుంటే ఆ ఫొటో తీసుకోవాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు సంబంధించి ఉమ్మడి జిల్లాలకు ఉన్న నోడల్ అధికారులు కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయాలని.. అప్పుడే పకడ్బందీగా కార్యక్రమం కొనసాగుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

#### వివరాల నమోదులో జాగ్రత్తలు తీసుకోండి

ప్రభుత్వం వద్దనున్న రేషన్ కార్డు, పించనుస్వయం సహాయక సంఘాలు, రైతు భరోసా, రుణమాఫీ, బీమా, ఆరోగ్య శ్రీ, కంటి వెలుగు తదితర డేటాల ఆధారంగా ఇప్పటికే కుటుంబాల గుర్తింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, పైలట్ ప్రాజెక్టులో దానిని నిర్ధారించుకోవడంతో పాటు కొత్త సభ్యులను జత చేయడం, మృతి చెందిన వారిని తొలగించడం చేస్తామని అధికారులు వివరించారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదు, మార్పులుచేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వవద్దని హెచ్చరించారు. పైలట్ ప్రాజెక్టుతో బయటకు వచ్చిన సానుకూలతలు, ఎదురైన ఇబ్బందులతో నివేదిక తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆ నివేదికపై చర్చించి లోపాలను పరిహరించిన అనంతర పూర్తి స్థాయి క్షేత్ర స్థాయి పరిశీలన చేపడదామని ముఖ్యమంత్రి తెలిపారు. సమీక్షలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శులు సంగీత సత్యనారాయణ, మాణిక్ రాజ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మిథున్ చక్రవర్తికి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

**దిల్లీ:** మన దేశంలో సినీ రంగానికి సంబంధించి ప్రతిష్టాత్మకంగా భావించే అవార్డుల్లో 'దాదా సాహెబ్ ఫాల్కే' ప్రధానమైనది. ఈ ఏడాది ఈ అవార్డుకు ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి ఎంపికైనట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది.అక్టోబర్ 8న జరగనున్న జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కేంద్ర, సమాచార మంత్రి అశ్విని వైష్ణవ్ పోస్ట్ పెట్టారు. "మిథున్ చక్రవర్తి అద్భుతమైన సినీ ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలు గుర్తించి ఈ ఏడాది దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం ఆయనకు అందించాలని జ్యూరీ నిర్ణయించింది" అని పేర్కొన్నారు.

ప్రధాని మోదీ.. మిథున్ చక్రవర్తికి శుభాకాంక్షలు తెలిపారు. "భారతీయ చలన చిత్ర రంగానికి ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి చేసిన అపారమైన సేవలను గుర్తించి ఆయనకు ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం ఆనందంగా ఉంది. విభిన్నమైన నటనతో ఆయన ఎన్నో తరాలను అలరించారు. ఎంతోమంది అభిమానాన్ని పొందారు. ఆయనకు నా అభినందనలు” అని ప్రధాని పేర్కొన్నారు.

#### విభిన్న నటనతో ఎన్నోతరాలు అలరించారు: ప్రధాని

ప్రధాని మోదీ.. మిథున్ చక్రవర్తికి శుభాకాంక్షలు తెలిపారు. "భారతీయ చలన చిత్ర రంగానికి ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి చేసిన అపారమైన సేవలను గుర్తించి ఆయనకు ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం ఆనందంగా ఉంది. విభిన్నమైన నటనతో ఆయన ఎన్నో తరాలను అలరించారు. ఎంతోమంది అభిమానాన్ని పొందారు. ఆయనకు నా అభినందనలు” అని ప్రధాని పేర్కొన్నారు.

#### మాటలు రావడం లేదు : మిథున్ చక్రవర్తి

ఈ పురస్కారానికి తాను ఎంపిక కావడంపై మిథున్ ఆనందం వ్యక్తంచేశారు. "మాటలు రావడం లేదు. ఇలాంటి గొప్ప విజయాన్ని నేను అస్సలు ఊహించలేదు. చాలా సంతోషంగా ఉన్నా. నా కుటుంబానికి, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానులకు దీనిని అంకితం చేస్తున్నా" అని తెలిపారు.



#### విభిన్నపాత్రలలో విలక్షణ నటుడిగా..

పశ్చిమబెంగాల్‌కు చెందిన మిథున్ చక్రవర్తి.. బాలీవుడ్లో ఎన్నో చిత్రాల్లో యాక్ట్ చేసి పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు. హీరోగానే కాకుండా సహాయనటుడు, విలన్‌గా కూడా ఆయన ఎంతోమంది స్టార్ హీరోల చిత్రాల్లో నటించారు. 1976లో 'మృగాయ'తో నటుడిగా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు. 'ముక్తి', 'బన్సారీ','ప్రేమ్ వివాహ్', 'భయానక్, 'కస్తూరి', 'కిస్మత్, 'మే ఔర్ మేరా సాథీ', 'సాహస్', 'వాంటెడ్', 'బాక్సర్', 'త్రినేత్ర', 'దుష్మన్', 'దలాల్, 'భీష్మ', 'సుల్తాన్', 'గురు', 'కిక్, 'బాస్', డిస్కోడాన్సర్ వంటి చిత్రాలు ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. హిందీ, బెంగాలీ చిత్రాలతోపాటు కన్నడ, తెలుగు, ఒరియా, భోజ్పురి చిత్రాల్లోనూ ఆయన నటించారు. 'గోపాల గోపాల'తో తెలుగు వారికి సుపరిచితమయ్యారు. ఇందులో ఆయన ప్రతినాయకుడిగా కనిపించారు. అనంతరం 'మలుపు' అనే టాలీవుడ్ మూవీలోనూ ఆయన యాక్ట్ చేశారు. "ఐ యామే డిస్కో డాన్సర్' అన్న పాటతో దేశవిదేశాల్లో గుర్తింపు తెచ్చుకొన్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఆయనకు పద్మభూషణ్ అవార్డును కేంద్రం అందజేసింది.

## మెట్రో రైళ్లలో ఆఫర్లు పొడిగింపు



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రో రైలులో ప్రయాణికుల సౌకర్యార్థం ఆఫర్లను పొడిగిస్తున్నట్లు ఎల్ అండ్ టీ మెట్రో యాజమాన్యం ప్రకటించింది. మెట్రో రైలులో సూపర్ సేవర్ 59, స్టూడెంట్ పాస్, సూపర్ సేవర్ ఆఫ్ పీక్ అవర్ ఆఫర్లను 2025 మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు హైదరాబాద్ మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి తెలిపారు. సెలవు రోజుల్లో కేవలం రూ.59కే అపరిమిత ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు 20 ట్రిప్పులకు చెల్లించి 30 ట్రిప్పులు పొందే ఆఫర్ స్టూడెంట్ పాస్ ఆఫర్ కొనసాగుతుందన్నారు. అలాగే రద్దీ లేని సమయాల్లో స్మార్ట్ కార్డులపై 10 శాతం తగ్గింపుతో ప్రయాణించే పీక్ ఆఫర్ కూడా పొడిగిస్తున్నట్లు ఎల్ అండ్ టీ ప్రకటించింది. ఈ పొడిగింపు మెట్రో ప్రయాణికుల్లో మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని ఎండీ కేవీబీ రెడ్డి తెలిపారు. అక్టోబరు 6 నుంచి నాగోలు, మియాపూర్ మెట్రో స్టేషన్లలో నామ మాత్రపు చెల్లింపులతో పార్కింగ్ ఫీజు వసూలు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రయాణికుల సౌలభ్యం, భద్రత కోసం నామ మాత్రం రుసుము వసూలు చేస్తున్నట్లు కేవీబీ రెడ్డి వెల్లడించారు.

అక్టోబరు నుంచి నాగోలు, మియాపూర్ మెట్రో స్టేషన్లలో పార్కింగ్ ఫీజు

సూపర్ సేవర్, స్టూడెంట్ పాస్‌ల విషయంలో గుడ్ న్యూస్ చెప్పిన మెట్రో పార్కింగ్ ఫీజు విషయంలో షాకిచ్చింది. అక్టోబరు 6 నుంచి నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్లలో పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లు తెలిపింది. ఆగస్టు నెలలో నాగోల్ , మియాపూర్ మెట్రో స్టేషన్ల వద్ద వాహనాల పార్కింగ్ ఫీజు వసూళ్లపై వాహనదారులు ధర్నా చేసిన సంగతి తెలిసిందే. వారి నిరసనల నేపథ్యంలో ఎల్అండ్‌టీ మెట్రో సంస్థ కూడా వెనక్కి తగ్గిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పెయిడ్ పార్కింగ్ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ఇప్పుడు మళ్లీ అక్టోబరు నుంచి నాగోలు, మియాపూర్ మెట్రో స్టేషన్లలో నామ మాత్రపు చెల్లింపులతో పార్కింగ్ ఫీజు వసూలు చేయనున్నామని సోమవారం మెట్రో ఎండీ తెలిపారు. మరి ప్రయాణికుల స్పందన ఎలా ఉంటుందో చూడాలి.

## హరీశ్‌రావు X అనిల్ కుమార్

విశ్వంభర ,తెలంగాణ బ్యూరో : హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలతో పాటు మూసీ ప్రక్షాళన అంశం ఇప్పుడు రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఓవైపు బుల్డోజర్లు తమ పని తాము చేసుకుంటూ పోతుంటే.. ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే.. బీఆర్ఎస్ తరపున హరీశ్ రావు సహ పలువురు నాయకులు బాధితులకు అండగా నిలబడుతున్నారు. ఈ నేపథ్యంలో.. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈమేరకు ట్విట్టర్ వేదికగా అనిల్ కుమార్ యాదవ్ వర్సెస్ హరీశ్ రావు మాటల యుద్ధం నడుస్తోంది. "మూసీ పర్యటన, హైడ్రా సమావేశాల పేరుతో హరీశ్ రావు , సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి చేస్తున్న రాజకీయ డ్రామాలు ఎందుకో తెలుసా..? హిమాయత్ సాగర్ ఎఫ్టీఎల్ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఆనంద కన్వెన్షన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు వాటాలు ఉన్నాయి. తను అక్రమంగా నిర్మించిన వందల కోట్ల విలువ గల ఆనంద కన్వెన్ష న్ ను కాపాడుకునేందుకు హరీష్ రావు డ్రామాలు చేస్తున్నారు."అంటూ అనిల్ కుమార్ యాదవ్ ట్వీట్ చేశారు.

"నువ్వు అక్రమంగా సంపాదించిన వందల కోట్ల విలువైన ఆస్తులను కాపాడుకునేందుకు సామాన్య ప్రజలను అడ్డుపెట్టుకుంటున్న అగ్గిపెట్టె హరీశ్ రావు ఖబర్దార్. ఎవరెన్ని కుట్రలు చేసినా, చెరువులు, నాలా భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాల కూల్చివేత ఆగదు అనే విషయాన్ని గుర్తు పెట్టుకుంటే మంచిది. చెరువులు, నాలాలు, మూసీ నది పరివాహక ప్రాంతాలను కాపాడి భవిష్యత్ తరాలకు భరోసా అందించేందుకు కృషి చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజానీకం మద్దతుగా నిలుస్తోంది." అంటూ ఘాటు ట్వీట్ చేశారు అనిల్ కుమార్ యాదవ్.

గోల్కొడ, చార్మినార్‌లో కూడా వాటా ఉందంటారేమో..?

అనిల్ కుమార్ యాదవ్ చేసిన ట్వీట్‌పై స్పందించిన హరీశ్ రావు కూడా అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. "ప్రజా సమస్యలపై పోరాడుతున్న తనపై బురద చల్లే వికృత రాజకీయాలకి తెరలేపినట్లు ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికి గోబెల్స్ ప్రచారాల్ని ఆశ్రయిస్తున్నట్లు ఉన్నారు. గోల్కొండ కోట, చార్మినార్‌లో కూడా హరీశ్ రావుకు వాటాలు ఉన్నాయి అని అంటారేమో? అబ్బద్ధపు ప్రచారాలు చేస్తున్నందుకు గాను లీగల్ నోటీస్ పంపుతున్నా.. బహిరంగ క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని అనిల్ కుమార్ యాదవ్‌ను హెచ్చరిస్తున్నా " అంటూ అనిల్ కుమార్ యాదవ్‌కు హెచ్చరికలు చేశారు. హరీశ్ రావు స్పందనపై కూడా అనిల్ కుమార్ యాదవ్ తనదైన శైలిలో మరో ట్వీట్ చేశారు. "హరీశ్‌రావు .. మీ ట్వీట్ చూశాను. గోబెల్స్ ప్రచారం అంటున్నారే కానీ. నేను చేసిన ఆరోపణలపై వివరణ మాత్రం ఇవ్వలేదు. ఇంతకీ దాంట్లో మీకు వాటా ఉందా..? లేదో చెప్పలేదు. దాస్తున్నారు అంటే.. నిప్పు లేనిదే పొగ రాదు అనుకోవాలా..?" అంటూ అనిల్ మరో ట్వీట్ వదిలారు. మరి ఈ ట్వీట్ల యుద్ధం ఎంతవరకు వెళ్తుందో చూడాలి.

# ముందుకు సాగని మూసీ నిర్వాసితుల తరలింపు

- కోర్టు స్టే తెచ్చుకున్న చైతన్యపురి ఫణిగిరి నగర్ వాసులు
- తరలింపులో అడుగడుగునా అడ్డంకులు
- వెళ్లేందుకు ససేమిరా అంటున్న బహుళ అంతస్తుల భవనాల యజమానులు
- తరలింపునకు మరోసారి గడువు పెంచిన సర్కారు



**విశ్వంభర, హైదరాబాద్ :** మూసీ నది సుందరీకరణ, ప్రక్షాళనలో భాగంగా సర్కారు చేపట్టిన మూసీ నిర్వాసితుల తరలింపు ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో సుమారు 2166 మంది నిర్వాసితులు రివర్ బెడ్ లో ఉన్నట్లు గుర్తించి, మార్కింగ్ ప్రక్రియ చేపట్టారు. నిర్వాసితులందర్నీ కేవలం మూడురోజుల వ్యవధిలో తరలించాలంటూ సంబంధిత జిల్లా కలెక్టర్లు సర్కారు లక్ష్యాన్నిచ్చింది. టార్గెట్ ఇచ్చి సుమారు వారం రోజులు గడుస్తున్నా, ఇప్పటి వరకుమూడు జిల్లాల రెవెన్య అధికారులు కనీసం ఇరవై శాతం నిర్వాసితులను కూడా తరలించకపొవటంతో మరోసారి సర్కారు తరలింపునకు తప్పని పరిస్థితుల్లో గడువు పెంచాల్సి వచ్చింది. ఇందుకు ప్రధాన కారణం వివిధ శాఖలకు సంబంధించిన అధికారుల సమన్వయ లోపం. నిర్వాసితుల పట్ల వారు వ్యవహరిస్తున్న తీరు మరో కారణమైంది. దశాబ్దాలుగా కుటుంబ సభ్యులతో కలిసి జీవించిన ఇంటిని కూల్చేస్తారంటూ నిర్వాహితుల్లో ఆందోళన ఉంటుందన్న విషయాన్ని అధికారులు గుర్తించి, సంయమనం పాటించకపోవటంతో పరిస్థితిలు అధికారులపై దాడులకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా మూసీ తీరాన దశాబ్దాలుగా నివాసం ఏర్పాటు చేసుకున్న నిర్వాసితులు పైసా పైసా కూడబెట్టుకుని, బహుళ అంతస్తు భవనాలను నిర్మించుకున్నారు. గతంలో ఒక కుటుంబంగా నివాసమేర్పర్చుకున్న వారు క్రమంగా మూడు నుంచి నాలుగు కుటుంబాలకు పెరగటంతో వారంత శ్రమపడి దశాబ్దాల కాలంగా బహుళ అంతస్తు భవనాలను నిర్మించుకున్నారు. ఇలాంటి భవనాలకు రెవెన్యూ అధికారులు ఒకే కుటుంబంగా పరిగణిస్తూ ఒక డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ను కేటాయించటం పట్ల తరలి వెళ్లేందుకు నిర్వాసితులు ససేమిరా అంటున్నట్లు సమాచారం. ఇప్పటికే రివర్ బెడ్ గా మార్కింగ్ చేసిన ఫణినగర్ వాసులు ఎట్టకేలకు కోర్టు నుంచి స్టే తెచ్చుకుని రెవెన్యూ సిబ్బంది చేసిన మార్కింగ్ ను చెరిపేస్తున్నారు. ఇక బహుళ అంతస్తు భవనాలు నిర్మించుకున్న మూసా నగర్, వినాయక్ నగర్ వాసులు తమ ఇళ్లను వదిలి వెళ్లేందుకు ససేమిరా అంటుండటంతో వారి తరలింపు అధికారులకు తల నొప్పిగా మారింది. మీకు మెరుగైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయిస్తూ సర్కారు ఆదేశాలు జారీ చేసిందని, మీమ్మల్ని డబుల్ బెడ్ రూమ్ లలోకి షిఫ్ట్ చేసిన తర్వాతే ఇక్కడున్న మీ ఇంటిని కూల్చేస్తామని చెప్పటంతో చైతన్యపురిలోని స్థానికులు అధికారులతో తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగారు. దశాబ్దాలుగా తాము కష్టపడి ఒకటి, రెండు, మూడు అంతస్తులుగా నిర్మించుకున్న ఈ ఇళ్లను ఏ రూల్ తో కూల్చుతారంటూ నిలదీశారు. మూడు బృందాలుగా వచ్చిన రెవెన్యూ అధికారులు మిగిలిన రెండు బృందాలు సత్య నగర్, న్యూ మారుతీ నగర్ చేరుకుని నిర్వాసితులను ఇండ్లు ఖాళీ చేసి, సామానులతో తమతో రావాలని సూచించటంతో నిర్వాసితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎట్టకేలకు తీవ్ర ఉద్రిక్తతల మధ్య అధికారులు తొమ్మిది కుటుంబాలను అధికారులు వనస్థలిపురంలోని జై భవానీ కాలనీకి తరలించారు. తొలి రోజైన గురువారం మరో 11 కుటుంబాలను, ఆ తర్వాత శుక్రవారం నుంచి ఆదివారం సాయంత్రం వరకు మరో 50 కుటుంబాలను మలక్ పేట, పిల్లి గుడిసెలు, ఎల్బీ నగర్ ప్రాంతాల్లోని తబుల్ ఇళ్లకు తరలించినట్లు సమాచారం. మూసీ నిర్వాసితులకు ప్రత్యామ్నాయ పునరావాస కల్పనపై ప్రజల్లో అవగాహన పెంచి, వారిని చైతన్య వంతులను చేసేందుకు జీహెచ్ఎంసీ ఏడుగురు అధికారులను నియమించిన ప్రక్రియ ఏ మేరకు ఫలితాలనిస్తుందో వేచి చూడాలి.

## బల్దియా యూనియన్ గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి

- సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసిన ఐఎన్టీయూసీ నేతల బృందం

**విశ్వంభర, హైదరాబాద్ :** జీహెచ్ఎంసీలో వెంటనే యూనియన్ల గుర్తింపు ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలివ్వాలని ఐఎన్టీయూసీ గుర్తింపు పొందిన మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ నేతల బృందం సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసి కోరింది. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో నేతల బృందం సోమవారం ఆయనకు లిఖితపూర్వకమైన వినతి పత్రాన్ని కూడా సమర్పించింది. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ 2018 నుంచి బల్దియాలో గుర్తింపు యూనియన్ లేదని, ఫలితంగా ఉద్యోగులు, కార్మికులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పర్మినెంట్ ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కూడా లేదని, వెంటనే హెల్త్ కార్డులు జారీ చేయటంతో పాటు ప్రతి పర్మినెంట్ ఉద్యోగులకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని ఆయన వివరించారు. ఏళ్ల తరబడి నామమాత్రపు జీతాలతో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ఎంటమాలజీ, వెటర్నరీ, స్వీపింగ్ కార్మికులకు వెంటనే జీతాలను పెంచాలని కోరారు. ఇప్పటి వరకు పర్మినెంట్ ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్ లో ఉన్నాయని వివరించారు. వినతిని పరిశీలించిన తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు యూనియన్ నేతలు తెలిపారు. సీఎం సలహాదాను కలిసిన వారిలో యూనియన్ నేతలు , ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ యాదవ్, సంగారెడ్డి జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు నర్సింహారెడ్డి తదితరులున్నారు.

## వివాదానికి ఫుల్‌స్టాఫ్ పెట్టండి..

- సాగదీస్తే లాయర్లకే లాభం
- సీజేఐ కీలక వ్యాఖ్యలు



**ఢిల్లీ:** వైవాహిక బంధంలో వివాదాలకు సంబంధించిన ఓ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంలో సుదీర్ఘ న్యాయపోరాటం వల్ల అది న్యాయవాదులకే ప్రయోజనంగా మారుతుందని అన్నారు. అందువల్ల పరస్పర సమ్మతితో విడాకుల కు అంగీకరించాలని ఆ దంపతులకు సూచించారు.తమ జంట మధ్య వివాదానికి సంబంధించిన కేసును మరో కోర్టుకు బదిలీ చేయాలంటూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈసందర్భంగా సదరు మహిళ విద్యార్హతలను చీఫ్ జస్టిస్ అడిగారు. తాను ఎంటెక్ పూర్తిచేసి, అమెరికా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు ఆమె సమాధానమిచ్చారు. అయితే, ప్రస్తుతానికి తానేమీ ఉద్యోగం చేయట్లేదని పేర్కొన్నారు. దీనికి సీజేఐ జస్టిస్ డి.వై చంద్రచూడ్ స్పందిస్తూ.."మీరు విద్యావంతులు. ముందు మంచి ఉద్యోగం సంపాదించండి. ఈ కేసులో మీరు 10 ఏళ్లయినా న్యాయపోరాటం చేయగలరేమో..! కానీ దానివల్ల కేవలం న్యాయవాదులకే ప్రయోజనం కలుగుతుంది. మీరెందుకు పరస్పర సమ్మతితో విడాకులు తీసుకునేందుకు అంగీకరించకూడదు? మీరు అందుకు అంగీకరిస్తే కేసును మూసేస్తాం. మీరు వైవాహిక బంధాన్ని తిరిగి కొనసాగించే పరిస్థితుల్లో లేరని స్పష్టమవుతోంది. మీరు నిరక్షరాస్యులైతే కేసు వేరేగా ఉండొచ్చు కానీ మీరు చదువుకున్నవారు.. ఉద్యోగం సంపాదించగలరని ఆ మహిళకు సూచించారు.


## ఢిల్లీకి బయల్దేరిన సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఢిల్లీ పర్యటనకు బయల్దేరారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అస్వస్థతకు గురవడంతో ఆయనను పరామర్శించనున్నారు. జమ్ము కశ్మీర్ ఎన్నికల ప్రచారంలో ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి కాంగ్రెస్ అధిష్ఠాన నేతలను కలవనున్నారు. రాష్ట్రంలో పరిస్థితుల పై వారితో చర్చించనున్నారు.



## మూసీ సుందరీకరిస్తే ఎవరి బతుకులు బాగుపడతాయి..

### సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు




**విశ్వంభర, సిద్దిపేట :** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు అతీగతీ లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. 1.5 లక్షల కోట్లు పెట్టి మూసీ సుందరీకరణ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని.. దీనికోసం 25 వేల ఇండ్లు కూల్చేందుకు సిద్ధమయ్యారని అన్నారు. ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆటో కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆటో కార్మికులకు ఖాకీ యూనిఫాంలను హరీశ్‌రావు అందజేశారు.

అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా అక్కడ నివసిస్తున్న ప్రజల ఇండ్లు కూల్చేస్తుండటంతో ప్రజలు కన్నీరు మున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి గుండె కరగడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేల కుటుంబాలను ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. పేదల బతుకు ముఖ్యమా? సుందరీకరణ ముఖ్యమా అని ప్రశ్నించారు. సీఎం నిర్ణయంతో లక్షల మంది రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

హైడ్రా పేరిట చేస్తున్న డ్రామాలను ఆపేయాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు హితవు పలికారు. రేవంత్ రెడ్డికి కూల్చడం తప్ప నిర్మించడం రాదని ఎద్దేవా చేశారు. మూసీని సుందరీకరిస్తే ఎవరి బతుకులు బాగుపడతాయని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణ, హైడ్రా కాదు.. ముందు గ్రామాల్లో అభివృద్ధి చూడాలని హితవు పలికారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో 56 మంది ఆటో కార్మికులు చనిపోతే ఒక్క కుటుంబాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పరామర్శించలేదని హరీశ్ రావు అన్నారు. ఒక్క కుటుంబాన్ని కూడా ఆదుకోలేదని పేర్కొన్నారు. ఎన్నికల ముందు చెప్పిన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని నిలదీశారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటివరకు ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని అన్నారు. రైతుబంధు ఏమైంది? కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఏమైంది? నిరుద్యోగ భృతి ఏమైంది? అని ప్రశ్నించారు. రుణమాఫీ సంగతేంటని నిలదీశారు. సగం మందికి కూడా రుణమాఫీ కాలేదు.. కానీ అందరికీ రుణమాఫీ చేశామని చెప్పుకుంటున్నారని మండిపడ్డారు.

సిద్దిపేట ఆటో సొసైటీ దేశానికే ఆదర్శమని హరీశ్‌రావు కొనియాడారు. ఈ సొసైటీ కింద ఆటో డ్రైవర్లకు 2 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తున్నామని.. ఆర్థిక అవసరాలు ఉన్న వారికి తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు సొసైటీ కింద రూ.2.10 కోట్ల రుణాలను ఇచ్చామని తెలిపారు. 26 మంది ఆటో కార్మికులు చనిపోతే వారి కుటుంబాలకు 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇచ్చామని పేర్కొన్నారు. మద్యం, గుట్కా అలవాట్లను మానుకోవాలని, కుటుంబాలను బాగా చూసుకోవాలని ఆటో డ్రైవర్లకు హరీశ్‌రావు సూచించారు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి మరీ ఆటో డ్రైవర్లకు న్యాయం జరిగే విధంగా కొట్లాడతానని తెలిపారు. సిద్దిపేట ఆటో కార్మికుల కోసం పెట్రోల్ బంక్ మంజూరు చేయిస్తానని చెప్పారు.










# అజరామరాలు... చందమామ శంకర్ చిత్రాలు

మన తెలుగు సంస్కృతికి ప్రతీక, భారతీయ సనాతన సంప్రదాయానికి పతాక, చక్రపాణి మానస పుత్రిక బి. నాగిరెడ్డి పిల్లల పత్రిక... చందమామ. దాదాపు ఆరున్నర దశాబ్దాల క్రితం, 1947 జూలై నెలలో తొలి సారిగా 'చందమామ' ఆవిష్కృతం అయింది. సరళమైన భాష, చక్కటి శైలి, చిన్న చిన్న పదాలు, అర్ధవంత మైన భాష, ఆకర్షణీయ మైన బొమ్మలతో అలరించేది.. చందమామ అనిర్వచనీయ కథలన్నీ ఆ బాల గోపాలాన్నీ మరో ప్రపంచానికి తీసుకెళ్ళే వశీకరణ రూపాలే. చందమామ గురించి కవిసమ్రాట్, 'నా చేత కూడా చందమామ చదివిస్తున్నారు. పత్రిక రావడం ఆలస్యమైతే కొట్టువాడితో దెబ్బలాడతా' అని ఒక సందర్భంలో అన్నారంటే చందమామ ఎంత ప్రసిద్ధి పొందిందో, పిల్లల, పెద్దల మనసులో ఎంత స్థానం సంపాదించుకుందో అర్థం చేసుకోవచ్చు.





### భేతాళ కథ చిత్రంతో గుర్తింపు

చందమామతో ప్రత్యేక సంబంధం అనుబంధం కలిగిన అసమాన చిత్రకారుడు శంకర్. చందమామ తాతయ్యగా గుర్తింపు పొందిన శంకర్ పేరు తీయగానే గుర్తొచ్చేవి భేతాళ కథలు. ప్రతినెలా శవంలోకి భేతాళుడు ప్రవేశించి కథచెప్పి, ప్రశ్నలడిగి, హెచ్చరించి, విక్రమార్కుడికి మౌనభంగం చేసి, అతను వచ్చిన పని కాకుండా చేసేవాడు. బాలల పత్రిక చందమామలో చిత్ర కారునిగా "విక్రం, భేతాళ" కథలలో చిత్రాలు వేయడం ద్వారా శంకర్ గుర్తింపు పొందారు. ఆయన వేసిన బొమ్మలు అన్నీ ఒక ఎత్తు, భేతాళ కథలకు శీర్షిక బొమ్మగా వేసిన బొమ్మ ఒక ఎత్తు. భేతాళ కథలకు ప్రత్యేక శీర్షిక బొమ్మగా విక్ర మార్కుడు చేతిలో కరవాలం భుజాన శవాన్ని మోసుకుంటూ వెడుతూ ఉంటే, శవంలోని భేతాళుడు కథ చెప్తున్నట్లు ఆయన వేసిన బొమ్మ ప్రపంచ ప్రసిద్ధి పొందింది. తెలుగు పత్రికా చరిత్రలో అతి ఎక్కువకాలం ధారావాహికగా కొన సాగిన శీర్షిక చందమామలో భేతాళ కథలే. చందమామలో చివరివరకూ ఆయన వేసిన బొమ్మనే కొనసాగించారు.

### వడ్డాదిపాపయ్య, వీరరాఘవన్‌లతో కలిసి...

చందమామ పత్రికతో 60ఏళ్లకు పైగా మమేకమై, మొట్ట మొదట పనిచేసిన చిత్రకారు లైన వడ్డాది పాపయ్య, తోడా వీర రాఘవన్ (చిత్రా) లతో పాటు కలిసి పని చేశారు. 1955లో చక్రపాణి, కుటుంబ రావు తెలుగులో భేతాళ కథలకు అప్పటివరకు వస్తున్నవాటిని మార్చి కొద్దిగా మార్పులు చేర్పులు చేసి బొమ్మలు గీయమని సూచించగా, 2012 చివరి వరకు ఆయన చిత్రాలు గీస్తూనే వచ్చారు. చందమామలో శంకర్ బొమ్మలు వాటిని అనుసరించిన పిల్లలకు పౌరాణిక పాత్రలు ఇలా ఉంటాయని చెరగని ముద్రలు వేసిన గొప్ప దనం శంకర్ కే దక్కింది. చందమామలో వచ్చిన రామాయణం, మహా భారతం సీరియల్స్‌కి వేసిన బొమ్మలతో పౌరాణిక పాత్రలకు దివ్యత్వం కలిగించిన గొప్ప ఆర్టిస్టు శంకర్. పురాణాల పాత్రలను పిల్లలకే కాదు పెద్దలకు కూడా కళ్ళకు కట్టిన ఘనత ఆయనది.



### ఉపధ్యాయుడి ప్రోత్సాహంతో..

సుపరిచితుడైన చిత్రకారుడైన కరతొలువు చంద్రశేఖరన్ శివ శంకరన్ (కె.సి.శివశంకరన్) "శంకర్" గా 1924 జూలై 19న తమిళనాడు లోని ఈరోడ్ సమీపంలోని గ్రామంలో జన్మించారు. శంకర్ తన బాల్యం నుండే కళ పట్ల మక్కువ పెంచుకున్నారు. తన చరిత్ర పరీక్షలలో అతను చారిత్రక పాత్రల చిత్రాలను గీసేవారు. నాగిరెడ్డి కూడా చదువుకుంటున్న కుతియాల్ పేట్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ ఉపాధ్యాయుడు శంకర్ లోని ప్రతిభను గుర్తించారు. ఆదివారాలలో అతని వద్దకు వచ్చేటట్లు చేసారు. అక్కడ శంకర్ ఇతర విద్యార్థులు గీసిన చిత్రాలను సదిదిద్దడం ద్వారా తన డ్రాయింగ్ ఉపాధ్యాయునికి సహాయం చేస్తూ అందుకు బదులుగా చిత్రలేఖనానికి ఆవసరమైన సామాగ్రి అయిన డ్రాయింగ్ పుస్తకాలు, పెన్సిల్స్, ఎరేజర్లను సంపాదిం చారు.1946లో తమిళ పత్రిక కలైమగై లో చిత్రకారునిగా నెలకు 85 రూపాయల వేతనంతో చేరారు. 1952 లో అతని సంపాదన 150 రూపాయలు. తన పెద్ద కుటుంబానికి పోషించడానికి సరిపోని స్థితిలో ఆయన మరొక 150 సంపాదించడానికి ఇతర పత్రికలను ఆశ్రయించారు. ఆ సంవత్సరం నాగిరెడ్డి చందమామ పత్రికలో చిత్రకారునిగా 350 రూపాయల నెల జీతంతో నియమించారు. చిత్రా, శంకర్ లు ప్రత్యర్థులుగా వృత్తి జీవితంలో ఉన్నా, 1978లో చిత్రా మరణించే వరకు మంచి స్నేహితులుగా ఉన్నారు. నాగిరెడ్డి ఒక సందర్భంలో చిత్రా, నాగిరెడ్డి చందమామ పత్రికకు రెండు ఎద్దులు. రెండూ లేకుండా ఎద్దుల బండి గ్రామానికి చేరుకోలేదు అని వ్యాఖ్యానించారు. చందమామ పత్రికలో శంకర్‌తో పాటు రాజి, వడ్డాది పాపయ్య కూడా కలిసి పని చేశారు. శంకర్ 2020, సెప్టెంబరు 29న చెన్నై సమీపం లోని పోరూర్ లోని స్వగృహంలో మరణించారు.



- రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

## చురకలు

కుశలప్రశ్నలు వేసే మనిషి లో
కుటిల బుద్ధియెంతో తెలుసుకో
ఎవరూ లేరనే దిగులేందుకు
ఎన్నేళ్లయినా నీడ నీ తోడు

స్పర్ధ ఈర్ష్య గా మారే చోట
కీర్తి అపకీర్తి గా రూపు మారు
స్ఫూర్తి లేని నాడు గెలుపు
వుండబోదు కలకాలం

జీవితమంటే సాఫీగా సాగదులే
దారిలో ఎన్నెన్నో ముళ్లు
గాయమయిందనీ ఆగావా
అవే నీకు సంకెళ్ళు

స్వర్ణం లాంటి నరుల నోట సైతం
కఱుకు మాటలు కవనంలా ప్రవహించు
చురుకు లాంటి కిరణాలు తాకినప్పుడే గదా
పంట పైర్లు మెండుగా వికసించు

గడియారం లో ముల్లు
గునపం లా గుండెల్లో దిగకముందే
శ్రమయనే ఆయుధం ధరించు చూడు
కాలం నీ కవచమై నిలుచు

దారి పొడుగునా ధీరులేననీ
శిరసు ఎవరికీ వంచకు
మొండిధైర్యం అండగా నీకుంటే
మండు వేసవిలో సైతం వసంతం విరియు

ఖర్చు ఏముందనీ ఎందుకీ తడబాటు
చిరునవ్వు తో పలకరించిన చాలు
శత్రువు రుధిరం లో సైతం
చిరు స్నేహం చిగురించు

అరికాళ్లు కందనీ నడకతో
ఎంత దూరం సాగేను పయనం
పిరికితనానికీ చిహ్నంలా వెనకడుగేందుకు
మురికి పనులు వీడినప్పుడే మనసు చెరకు

కాయం కరగనీ కష్టమున్నప్పుడు
కాలం సంధించు అస్త్రాలకు సమాధానమెక్కడిదీ
హస్తం గీతలు చెదరని క్రియలున్నప్పుడు
నుదుటి రాతలో సౌఖ్యమెక్కడిదీ

ఐ.చిదానందం

# ఆధునిక భారతదేశ రూపశిల్పి మీనన్

ముగ్గురు వైస్రాయ్‌లకు వారి రాజ్యాంగ సలహాదారుగా సేవలందించిన ప్రతిభా శాలి, సమర్థ అధికారి. స్వతంత్ర భారత దేశంలో, అధికార బదిలీల కీలక పాత్ర ధారిగా, కొత్తగా ఏర్పడిన రాష్ట్రాల శాఖ కార్యదర్శిగా, తరువాత ఒడిశా గవర్నర్‌గా పని చేశాడు. దేశం లోని ఒక చిన్న గ్రామంలో జన్మించిన ఆయన అసమాన ప్రతిభతో అత్యున్నత స్థాయి భారతీయ అధికారిగా ఎదిగాడు. ఆయనే ఆధునిక భారతదేశానికి రూపశిల్పి వి. పి. మీనన్.వప్పల పంగుణ్ణి మీనన్ (1893 సెప్టెంబరు 30 1965 డిసెంబరు 31) భారతీయ సివిల్ సర్వీసెస్ అధికారి. ఆయన భారత దేశపు చిట్ట చివరి లిన్లిత్‌గో, వేవెల్, మౌంట్ బాటన్ అనే చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు రాజ్యాంగ సలహాదారు అయ్యాడు. రాజ్యాంగ సలహాదారుగా, రాజకీయ సంస్కరణల కమిషనర్ గానూ పని చేశాడు. బ్రిటీష్ ప్రభుత్వం నుంచి బ్రిటీష్ ఇండియాకు స్వతంత్రం రావడం లో అత్యంత కీలకమైన అధికార బదిలీలోని భారత విభజన, భారత స్వాతంత్ర్య చట్టం, భారతదేశ ఏకీకరణ, భారత రాజ్యాంగ రచన వంటి అంశాల్లో బ్రిటీష్ ప్రభు త్వానికి, కొత్తగా ఏర్పడిన భారత ప్రభుత్వానికి సహకరిస్తూ కీలక బాధ్యతలు నిర్వర్తించాడు.



### సామాన్య కుటుంబం నుంచి వచ్చి..

బ్రిటీష్, భారతీయ అధికారుల విశ్వాసం పొందిన మీనన్ ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చాడు. ఒట్టప్పలం లోని పనమన్న వద్ద 1893 సెప్టెంబరు 30న జన్మించాడు. 13 సంవత్సరాల వయస్సులో, నిర్మాణ కార్మికుడిగా, బొగ్గు గని కార్మికు డిగా, ఫ్యాక్టరీలో వరుసగా పని చేయడానికి పాఠశాలను విడిచి పెట్టాడు. 8వ తరగతి వరకు మాత్రమే చదివిన మీనన్, రెండు వేళ్లతో టైప్ చేయడం నేర్చిన తరువాత, 1929లో సిమ్లాలో భారత పరిపాలనలో హోం శాఖలో గుమాస్తాగా ఉద్యోగం లో చేరాడు.1947 నాటికి, మీనన్ వైస్రాయ్ సిబ్బందిలో అత్యంత సీనియర్ పోస్టుకు ఎదిగాడు, మౌంట్ బాటన్ విశ్వాసాన్ని, ప్రేమను పొందాడు.స్వాతంత్ర్యానికి ముందు భారత గవర్నర్ జనరల్‌కు రాజ్యాంగ సలహాదారుగా మారారు. అంతకు ముందు, బ్రిటిష్ వలస రాజ్యాల సంస్కరణ కార్యాల యంలో అనేక ముఖ్యమైన పదవులను నిర్వహించాడు. 194247 మధ్య సంస్కరణల కమిషనర్‌గా పనిచేశాడు. 1946లో బ్రిటిష్ వైస్రాయ్‌కు రాజకీయ సంస్కరణల కమిషనర్‌గా నియమితు డయ్యాడు.194751 సంవత్స రాలలో రాష్ట్ర మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా నియమించ బడ్డాడు. మౌంట్ బాటన్ ప్రణాళికకు ప్రత్యామ్నాయంగా దేశ విభజనకు సంబంధించి ఆయన రూపొందించిన ముసాయిదా, ముఖ్యంగా ముగ్గురు ప్రముఖులు...నెహ్రూ, పటేల్, మౌంట్ బాటన్ల ఏకకాల ఆమోదం పొందింది. భారత బ్రిటీష్ ప్రభుత్వానికి రాజ్యాంగ సలహాదారుగా, స్వాతంత్ర్యం అనంతరం, అధికార మార్పిడి, రాష్ట్రం యొక్క రాజ్యాంగ విషయాలు, ప్రధానంగా సార్వ భౌమాధికారం, పాలన, ఫెడరల్ యూనియన్, యూనిట్ల మధ్య అధికార పంపిణీకి సంబంధించిన విధానాలపై మీనన్ చేసిన కృషి అనన్య సామాన్యం.

భారత దేశానికి స్వాతంత్ర్యానికి దారితీసిన ప్రసిద్ధ ప్రణాళికను సిద్ధం చేసింది మీనన్. తన పుస్తకం 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పవర్ ఇన్ ఇండియా'లో, ప్రత్యామ్నా య ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేయడానికి తనకు రెండు లేదా మూడు గంటలు మాత్రమే సమయం ఎలా పట్టిందో గ్రంథస్థం చేశాడు. ఆయన ప్రణాళికను పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మహమ్మద్ అలీ జిన్నా అంగీక రించారు.

### సంస్థానాల విలీనం విషయంలో పటేల్‌కు సాయం

మీనన్ సర్దార్ పటేల్‌తో కలిసి 500 కంటే ఎక్కువ రాచరిక రాష్ట్రాలను యూనియన్ ఆఫ్ ఇండియాలో విలీనం చేయడం పై పనిచేశాడు. ఈ విషయంలో మీనన్ చేసిన కృషి చాలా ఎక్కువ. మంత్రిత్వ శాఖ, వివిధ భారతీయ రాచరిక పాలనల మధ్య మంచి సంబంధాన్ని పెంపొందించడానికి దౌత్యాన్ని ఉపయోగించాడు. పటేల్ రాయబారిగా వ్యవహరించాడు. భావి భారత స్వతంత్ర దేశానికి ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించడానికి అయిష్టంగా ఉన్న రాజులు, పాలకులతో ఒప్పందాలు కుదుర్చు కున్నాడు. మీనన్ తన రచనలైన రెండు సంపుటాలలో స్వతంత్ర భారతదేశం, పాకిస్తాన్ రెండు సార్వభౌమ రాజ్యాల ఆవిర్భావానికి దారి తీసిన సంఘటనల చారిత్రక నేపథ్యం వివరించారు. 500 పైగా సంస్థానాలను స్వతంత్ర భారత దేశంలో విలీనం చేయడంలో ఉక్కు మనిషి సర్దార్ పటేల్ కు సహాయం చేసిన ఘనత వహించిన మీనన్‌కు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు. ఆయన పేరు మీద ఒక్క జీవిత చరిత్ర పుస్తకం లేదు. పాఠశాల సిలబస్‌లో ఆయన రచనల ప్రస్తావన లేదు. ఆయన స్థాపించిన విపి మీనన్ అవార్డు మాత్రమే గుర్తుగా ఉంది. బ్రిటీష్, స్వతంత్ర భారత దేశ సమర్థ అధికారి, డిసెంబర్ 31, 1965న 72 సంవత్సరాల వయస్సులో బెంగళూరులోని కంటోన్మెంట్ లోని కుక్ టౌన్‌లో మరణించాడు.

# ద్వైత సిద్ధాంత కర్త శ్రీ మధ్వాచార్యులు

సనాతన హైందవ ధర్మంలో ద్వైతసిద్ధాంతాన్ని శ్రీ మధ్వాచార్యులు ప్రవచించారు. ఆ సిద్ధాంతాన్ని అనుసరించి జీవుడు వేరు. దేవుడు వేరు. జడమైన జగత్తు, జీవుడు నిత్యం కాదు. ఆ దేవుడు ఎంత సత్యమో ఈ జగత్తు కూడా అంతే సత్యం. అని మధ్వాచార్యులు ఉడిపిలోని అనంతేశ్వరాలయంలో భక్తులందరి సమక్షంలో నూ ఐతరేయోపనిషత్తు భాష్యాన్ని చెబుతూ పూలవాన మధ్యన అంతర్థానమయ్యారు. అదే భాద్రపద బహుళ అష్టమి ఆరాధన మహోత్సవం.

మధ్వ సంప్రదాయంలో హరియే శ్రేష్టుడు. జగత్తు సత్యం అనేతత్వాన్ని అనుసరించి భేదాలు ఏర్పడతాయి. జీవగణాలన్నీ ఆ హరి అనుచరులే. అయితే వారిలో హెచ్చుతగ్గులు ఉంటాయి.ముక్తి అంటే స్వచ్ఛమైన సుఖానుభవమే. దానికి సాధనం భక్తి.అన్నింటికీ మోక్షాది త్రితయమేప్రమాణం. ప్రత్యక్షాది న్యాయప్రమాణాల ద్వారా హరిని తెలుసుకోగలుగుతాం. జ్ఞానం అంటే తెలియజేసేది. జ్ఞేయం అంటే తెలుసుకోదగింది. జ్ఞాత మంటే తెలిసినవాడు. ఈ మూడు భిన్నమైనవే. కానీ ఎప్పటికీ ఒక్కటికావు. జ్ఞేయం పరబ్రహ్మం. జ్ఞాతజీవాత్మ. జ్ఞానం భక్తి. ఈ త్రిపుటీ సంచారమే పూర్ణ ప్రజ్ఞ దర్శనం. జీవులందరూ ఒకే విధంగా ఉండరు. నీచ, ఉచ్ఛ భావ గతులై ఉంటారు. ఉన్నతభావాలు గలవారు భగవద్భక్తితోనూ, ధార్మిక ప్రవృత్తి తోనూ, ముక్తిని పొందుతారు. అందరి కంటే అధములు సంసారంలో చిక్కుకొని ఎప్పటికీ ముక్తిని పొందలేరు. నీచులైన మూడో వర్గం వారు భగవంతుని మీద విరోధంతో నరకాన్ని పొందుతారు

ఉత్పత్తి స్థితి సంహారా; నియతిః జ్ఞానమావృతిః। బంధమోక్షాచ పురుషాత్; తస్మాత్ సహరిరేకరాట్॥ ఉత్పత్తి,స్థితి, సంహార నియమాలకు సంబంధించిన జ్ఞానం బంధమోక్షాలు ఇవన్నీ ఒకరి నుండే వెలువడుతూ ఉంటాయి. అతడే ఏకైక సమ్రాట్ హరి. అందువల్ల భగవంతునితో విరోధం పనికిరాదు. అది శాశ్వతమైన నరకానికి కారణమవుతుంది.జీవాత్మ ముక్తికి మధ్వ దర్శనం సప్త (ఏడు) సూత్రాలను ప్రతిపా
దిస్తోంది.



### సప్త సూత్ర ప్రతిపాదన:

1) సర్వ దేవతల్లో హరియే సర్వోత్తముడు. పూజనీయుడు. మిగిలిన దేవతలు తరతమాలతో పూజార్హులు. హరి లక్ష్మి, బ్రహ్మసరస్వతి, శివుడుపార్వతి,సూర్యచంద్రులు, ఇంద్రుడు, శేషుడు, గరుత్మంతుడు,
మన్మధుడు, గురు, వరుణ,అగ్ని, మను, యమ, కుబేర, విఘ్నేశ్వరులు వరుసగా పూజనీయులు.

2) జీవ దేవాది పంచ భేదాలు కలిగి ఉన్నందున ఈ జగత్తును ప్రపంచమని పిలుస్తున్నారు. ప్రపంచం అనగా వ్యాప్తి చెందినదిఅనే అర్థము కూడా ఉంది.

3) ఈ జగత్తు ప్రవహించే నదివంటిది. నీరు నిత్యం కాకపోయినా ప్రవాహత నిత్యం. ఇప్పుడు మనం చూసిన నీరు మరుక్షణంలో అక్కడ ఉండదు. అయినా నీరు ఉంటుంది. ఇంతకుముందున్న నీరు ఇప్పుడు లేదు. కనుక అది అసత్యం కాదు. మనంచూసినప్పుడు ఉన్న నీరు అప్పటికి సత్యం.

4) జీవుడు పరబ్రహ్మమైన హరికన్నా భిన్నుడే. అస్వతంత్రుడే. జీవుడు దేవుడు ఎన్నటికీ ఒక్కటికాబోరు. హరి సేవ వల్ల ముక్తినిపొందుతారు. తానెవరో తెలుసుకున్న సుఖానుభూతియే ముక్తి.

5) ముక్తి కి సద్భక్తే ముఖ్య సాధనం హరి భక్తి యే ముక్తికి ముఖ్య సోపానం.

6) ప్రత్యక్షం, అనుమానం,ఆగమం (వేదోపనిషత్తులు) అనేప్రమాణాలతో న్యాయ శాస్త్రానుసారం ద్వైతశదర్శనం ఏర్పడింది.

7) వేదోపనిషత్తులు హరి సర్వోత్తమత్వాన్ని ప్రతిపాదిస్తున్నాయి.

### నిరహంకారం,నిర్మలత్వం, నిశ్చలత్వంతోకూడిన హరి భక్తిని బోధించిన శ్రీమధ్వాచార్యులు

కర్ణాటక రాష్ట్రం ఉడిపి దగ్గరున్న పాజక గ్రామంలో 1238వసంవత్సరంలో విజయదశమినాడు జన్మించారు. పూర్ణ ప్రజ్ఞ,ఆనంద తీర్థ, మధ్వాచార్య నామాలతో ద్వైత మతాచార్యులయ్యారు. మధ్వాచార్యుడు వాయుదేవుని అవతారంగామధ్వలు భావిస్తారు. భక్తి యోగాన్ని, హరి భక్తిని, నిరహంకారతను, నిర్మలత్వాన్ని, నిశ్చలతత్వాన్ని ఈ లోకానికి బోధించడం ద్వారా ప్రామాణికమైన మతంగా ద్వై
తాన్ని ప్రతిపాదించారు శ్రీమధ్వాచార్యులు. ఉపనిషత్తులకు భగవద్గీతకు బ్రహ్మసూత్రాలకు భాష్యా
లు రచించి ద్వైత మతాన్ని స్థాపించి స్థిరీకరించిన మహానుభావుడు శ్రీ మధ్వాచార్యుడు.



"సాహిత్య కళా విభూషణ"
చౌదూరి నరసింహారావు
ఆధ్యాత్మిక, సామాజిక విశ్లేషకులు

# జర్నలిస్టుల సంక్షేమం కోసం పని చేస్తాం



**విశ్వంభర,ఎల్బీనగర్:** జర్నలిస్టుల సంక్షేమమమే ద్యేయంగా టీయుడబ్ల్యూజే(ఐ జెయు) పని చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో సోమవారం రంగారెడ్డి జిల్లా టియుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కటకం సుభాష్ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జర్నలిస్టు ఇంటి స్థలాల దరఖాస్తు పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం గత పది సంవత్సరాలుగా యూనియన్ అనేక పోరాటాలు చేసిందని అన్నారు. ప్రస్తుతం ఇండ్ల స్థలాల కోసం చేపడుతున్నటువంటి విలేకరుల వివరాల సేకరణ అనంతరం నియోజకవర్గాల వారీగా లిస్టులను తయారుచేసి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి అందజేస్తామని స్పష్టం చేశారు. ఆయన నుంచి ప్రభుత్వానికి నివేదిక అందజేసేందుకు రాష్ట్ర యూనియన్ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. సంఘాల కతీతంగా నియోజకవర్గంలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల వివరాలను సేకరించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు అసలు ఎవరు కొసరు ఎవరు అనేది తేల్చాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అర్హులైన జర్నలిస్టులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటి స్థలాలతో పాటు ఆరోగ్య భీమా కల్పన తదితర అంశాలపై పెద్ద ఏత్తున కసరత్తు జరుగుతుందని అన్నారు .త్వరలో జిల్లా కేంద్రంగా రాష్ట్ర స్థాయి పాత్రికేయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి మన సమస్యలు పరిష్కరించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఆత్మీయ సమ్మేళనం విజయ వంతం చేయవలసిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సంరెడ్డి శశి పాల్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, సోలిపురం రజనీకాంత్ రెడ్డి, వర్దెల్లి దశరథ, రచ్చ శేఖర్, శ్యాం ప్రసాద్, జంగయ్య, చెప్పల శ్రీనివాస్, మేకల రవీందర్ రెడ్డి, చెరుకు వెంకట్ స్వామి గౌడ్, మధు, రమేష్, శ్రీనివాసరావు, రాజు, మహేష్, మట్ట అశోక్ గౌడ్, రాజేంద్ర నగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, సూర్య నారాయణ, ప్రేమ్ ,చందు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడి నడ్డి విరుస్తున్న నిత్యావసర ధరలు



**విశ్వంభర,ఘట్కేసర్:** పొట్ట చేత పట్టుకొని బ్రతుకుదెరువు కోసం పట్టణాలకు వలస వచ్చిన పేదకుటుంబాలు కూటి కోసం కోటి తిప్పలు' అన్నట్లు పట్టణాల్లో నివాసముంటున్నారు. కొందరు రోజువారి పనుల్లో చేరితే, మరికొందరు నెలవారి డబ్బులతో పనులకు వెళుతున్నారు. చాలీచాలని డబ్బులతో వలస వచ్చిన పేదల బతుకులు బరువెక్కుతున్నాయి. ఈ తరుణంలో చిన్నాచితక పనిలో రూ. 10-15 వేల అరకొర జీతంతో కుటుంబాన్ని ముందుకు నడుపుతున్న వేళ కూరగాయల, నిత్యావసరాల ధరలు పెరగటంతో పరిస్థితి మరింత తీవ్ర రూపం దాల్చింది. మరోవైపు ఇంటి రెంట్, పిల్లల చదువులు, దవాఖాన ఖర్చులు ఇలా నెలా ఖరుకు చేతిలో చిల్లిగవ్వ మిగలడంలేదని సగటు వ్యక్తి ఆవేదన చెందుతున్నారు. కొందరు నాన్‌వెజ్ ప్రియులకు ముక్కలేనిదే ముక్క దిగదు. ఆది వారం వచ్చిందంటే చాలు ఇంట్లో నీచు ఉండాల్సిందే. ఇక తెలంగాణలో అయితే.. ప్రతి చిన్న కార్యానికి కూడా ఏమాత్రం వెనకాడకుండా మాసంతోనే భోజనాలు పెడుతుండారు. అయితే మాంసం ప్రియులకు ఇది నిజంగా బ్యాడ్‌న్యూసే. ఎందుకంటే చికెన్ ధరలు మళ్లీ భారీగా పెరుగుతున్నాయి. గత కొంతకాలం వరకు తక్కువగా ఉన్న చికెన్ ధరలు ఇక కూరగాయలు నిత్యవసర సరుకుల ధరలు కూడా ఆకాశన్నంటుతున్నాయి. నూనె ధరలు విపరీతంగా పెరిగాయి. కేజీ సన్ ఫ్లవర్ ఆయిల్ పది రోజుల క్రితం రూ.115 వరకు ఉండగా.. ప్రస్తుతం రిటైల్ మార్కెట్ లో కేజీ రు. 160-170 మధ్య అమ్ముతున్నారు. దిగుమతి సుంకం పెంచటంతో నూనెల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఇక కూరగాయల ధరలు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. కేజీ టమాట ప్రస్తుతం రూ. 50 వరకు పలుకుతోంది. ఉల్లి ధర కేజీ రూ.60 వరకు ఉంది. గత రెండు వారాల క్రితం అది రూ.200 మార్క్ దాటింది. గత వారం కేజీ చికెన్ రూ.230 పైగా ఉండగా.. ప్రస్తుతం కేజీ చికెన్ స్కిన్‌లెస్ రేట్ రూ.240 పైనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో రూ. 250 పైగా కూడా అమ్ముతున్నారు. దసరా పండుగ నేపథ్యంలో రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చికెన్ రేట్లు మరింత పెరిగితే ఈసారి పండగ కష్టమేనని నాన్ వెజ్ ప్రియులు అంటున్నారు. ఇప్పటికే మాంసం ప్రియులు చికెన్ కొనలేక.. తినలేక తమ జిహ్వాచాపల్యాన్ని చంపుకుంటున్నారు. పండక్కి కూడా ఇదే ధరలు ఉంటే ఇబ్బందే అని చెబుతున్నారు.

## కేఎల్ఆర్‌కు ఘన స్వాగతం



**విశ్వంభర, మహేశ్వరం:** అమెరిక టూర్ ముగించుకుని వచ్చిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్, సహా సభ్యులు ఘనంగా సన్మానించారు. సమస్యలను కేఎల్ఆర్ దృష్టికి తెచ్చేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. సమస్యలపై వెంటనే స్పందిన కేఎల్ ఆర్ అధికారులు నాయకులతో మాట్లాడి వెంటనే పరిష్కరించారు. సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, బొక్క జంగారెడ్డి సహా అధ్యక్షులు, మైనార్టీ మోర్చా సభ్యులుపాల్గొన్నారు.

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



**విశ్వంభర, వికారాబాద్:** జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఇప్పట వరకు జిల్లాకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. ప్రజావాణి సమావేశం హాలు నందు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్ రెవిన్యూ లింగ్యా నాయక్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సుధీర్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులందరూ పరిధిలో ఇప్పటి వరకు ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు.

## జర్నలిస్టుల ఇంటి స్థలాలకు హద్దులు చూపించాలి

**విశ్వంభర, భూపాలపల్లి:** మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని వర్కింగ్ జర్నలిస్టులకు రెవెన్యూశాఖ పట్టాలు ఇచ్చిన ఇంటి స్థలాలకు హద్దులు చూపించాలని కాళేశ్వరం జర్నలిస్టులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేశారు. కాళేశ్వరం శివారులోని 119/1లో 12 మంది వర్కింగ్ జర్నలిస్టులకు ఒక్కొక్కరికీ 121 గజాల ఇంటి స్థలాన్ని పట్టాలు అందజేసినట్లు తెలిపారు. ఆ ఇంటి స్థలంలో అటవీశాఖ అధికారులు రిజర్వ్ ఫారె స్టుకు చెందిన భూమి అని అడ్డుకుంటున్నారని తెలిపారు. రెవెన్యూ, అటవీశాఖలు సంయుక్తంగా సర్వే చేసి తమకు పట్టాలు ఇచ్చిన భూమికి హద్దులు చూపించాలని కాళేశ్వరం ప్రెస్ క్లబ్ సభ్యులు ఏల్పుల వెంకటేష్, షేక్ దీన్ మహ్మద్ వినతి పత్రం అందజేసి కోరారు.

## దైవచింతనతో జీవనం సాగించాలి



**విశ్వంభర, షాద్‌నగర్ :** ఆసియాలో పెద్ద చర్చిలలో ఒకటైన క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరం కర్ణపుర్ చర్చికి నియోజకవర్గ పరిధిలోని చర్చి ఫాదర్ లు ,వారి కుటుంబ సభ్యులతో బైబిల్ విజ్ఞాన యాత్రకు బయలుదేరి వెళ్తున్న సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మానవాళి జీవితం ఎల్లవేళలా సుఖశాంతులతో, దైవ చింతనతో జీవనం సాగించాలని కోరారు. వరంగల్, మెదక్ జిల్లాల్లో ఉన్న ప్రముఖ చేర్చిలను సందర్శించనున్నట్లు చర్చ్ ఫాదర్ జోసఫ్ తెలిపారు. స్వామి దాస్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది ఈ యాత్రకు వెళ్తున్నారు. యాత్రకు వెళ్తున్న వారిలో చించొడు గ్రామ చర్చి పాస్టర్ దేవయ్య,కొందుర్గు మండలం పాస్టర్ రవి కుమార్,కేశంపేట్ మండలం కృష్ణయ్య పాస్టర్, కొత్తూరు మండలం ఈశ్వర్య పాస్టర్, నందిగామ మండలం పీటర్ ఫాదర్, చౌదరి గూడెం మండలంలోని మాణిక్యం ఫాస్టర్, చిన్న రవి తేజ,అనంతం తదితరులు ఉన్నారు.

## పేదల పాలిట వరం.. సీఎం రిలీఫ్ ఫండ్



**విశ్వంభర, తలకొండపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా పేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతోగానో తోడ్పాటునందిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇటీవల తలకొండపల్లి మండలం రావిచేడు గ్రామనికి చెందిన అంజనమ్మ అనారోగ్యానికి గురై నేమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. వారి కుటుంబ సభ్యులు గోలి శ్రీనివాస్ రెడ్డినీ కలవడంతో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఇరవై ఎనిమిది వేల ఐదు వందల రూపాయలు) 28,500 రూపాయల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్ గౌడ్, మున్సిపల్ కో ఆప్షన్ నెంబర్ మనోహర్ రెడ్డి, నాయకులు గిరి నాయక్, డొక్క లింగం, వట్టేపు కిషోర్, రమేష్, సతీష్, సుమన్ నాయక్ తదితరులు ఉన్నారు.

## క్రీడల పట్ల దృష్టి సారించాలి



**విశ్వంభర, జగిత్యాల:** జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను కోరుట్ల మినీ స్టేడియంలో మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య అనిల్, డాక్టర్ నడికట్ల సంతోష్ కుమార్ లు సంయుక్తంగా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి క్రీడల పట్ల దృష్టి సారించాలని కోరారు. డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ దేశానికి పేరు తెచ్చేది, క్రీడాకారులేనని క్రీడల వల్ల దృఢత్వం మానసిక ఉల్లాసం పెంపొందుతాయని స్నేహభావం ఏర్పడుతాయని అన్నారు. జిల్లా అథ్లెటిక్ సెక్రెటరీ ఏలేటి ముత్తయ్య రెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామాల క్రీడాకారుల ను వెలికి తీసే ఉద్దేశంతో ఈ క్రీడలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ క్రీడా పోటీలకు 820 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారులకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్, మెడల్స్, సర్టిఫికెట్స్, పార్టీసిపెంట్స్ సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల స్పోర్ట్స్ క్లబ్ ద్వారా నిర్వహించడం జరిగిందని జిల్లా కోచ్ ఏలేటి ముత్యంరెడ్డి తెలిపారు.

## విద్యార్థులకు ఆటల పోటీలు



**విశ్వంభర, షాద్‌నగర్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న షాద్‌నగర్ తాలూకా 68వ ఆటల పోటీలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. మండల ఎంఈఓ మనోహర్ నియోజకవర్గం లోని వివిధ మండలాల నుండి ఎంపిక కాబడిన విద్యార్థులు, ఈ ఆటల పోటీలలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు.

## ప్రజల సమస్యలు చిత్త శుద్ధితో పరిష్కరించాలి

**విశ్వంభర,భూపాలపల్లి:** ప్రజల పిర్యాదులను చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివాస్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 16 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసు కొని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు సమర్పించాలని ఆదేశించారు.

# షీటీమ్స్, టీసేఫ్ యాప్‌లపై అవగాహన సదస్సు

**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లా ఎస్పీ సుధీర్ ర్గాంనాథ్ కేకన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య ఆధ్వరంలో మహబూబాబాద్ షీ టీం ఎస్ఐ సునంద పట్టణంలోని పులిపాటి ప్రసాద్ వొకేషనల్ జూనియర్ కాలేజ్ నందు విద్యార్థినీ విద్యార్థులకు షీ టీమ్స్, మహిళల భద్రత ,రక్షణ ర్యాగింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, డ్రగ్స్ మత్తు పదార్థాలపై, భరోసా యొక్క విధులు అది ఏ విధంగా పనిచేస్తుందని అన్నారు. ఎవరైనా ఈవిటిజంకి గురైనప్పుడు షీ టీం ని ఎలా సంప్రదించాలి పిటిషన్ ఏ విధంగా ఇవ్వాలి మొదలగు వాటి గురించి ఈ కార్యక్రమం నందు అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా టి -సేఫ్ యాప్ గురించి వివరిస్తూ దీనినే క్లుప్తంగా ట్రావెల్ సేఫ్ అని పిలుస్తారని, ఈ యాప్ ను ప్రతి ఒక్కరు డౌన్లోడ్ చేసుకొని ఉపయోగించుకోవాలని వివరించారు. యాప్‌ని డౌన్లోడ్ చేసుకొని లాగిన్ అవ్వగానే - మానిటరింగ్, డయల్ 100 ఆప్షన్లు కనిపిస్తాయి అని అన్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్నవాళ్లు ఈ యొక్క ట్రావెల్ సేఫ్ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని సేవలను వినియోగించుకోవాలని సూచించారు. నందు షీ టీమ్స్ సిబ్బంది ఏఎస్ఐ ఆనందం, అరుణ, పార్వతి రమేష్, భరోసా సెంటర్ లీగల్ అడ్వైజర్ సాహితీ మేడం, భరోసా సపోర్టు పర్సన్ బేబీ, యాంటీ హ్యూమన్



ట్రాఫికింగ్ యూనిట్ సుప్రజ, పులిపాటి ప్రసాద్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ అధ్యాపక సిబ్బంది, జరీనా, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరేందుకు 10 మంది ఎమ్మెల్యేలు సిద్ధం: దానం

**విశ్వంభర, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీ లో చేరేందుకు 10 మంది ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారని, తమ కేసు బూచి చూపెట్టి కాంగ్రెస్‌లోకి రావలనుకుంటున్న ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ పెద్దలు ఆపుతున్నారని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. కాస్త ఆలస్యం అయినా మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక పక్కాగా ఉంటుందని.. సీఎం రేవంత్ రెడ్డిని అసభ్య పదజాలంతో బీఆర్ఎస్, బీజేపీ నేతలు తిట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌరవప్రదంగా ఉండే హరీష్ రావు కూడా గాడి తప్పారని, బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారని, ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టి కి తీసుకెళ్ళానని ఎమ్మెల్యే దానం నాగేందర్ చెప్పారు.

**ప్రజల్లో అవగాహన కల్పించాల్సింది:** కూలగొట్టే ముందు హైడ్రా అక్కడి వాస్తవ పరిస్థితులు ప్రజలకు తెలియజేస్తే ఇంత ఇబ్బంది అయ్యేది కాదని ఎమ్మెల్యే దానం నాగేందర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. చిన్న చిన్న ఘటనలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నాయన్నారు. ఒక చిన్నారి తన పుస్తకాలు ఇంట్లో ఉన్నాయని బోరున ఎడ్చిందని... ఈ ఘటన తనకు చాలా బాధ అనిపించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇలాంటి పనులు చేసినప్పుడు ఎవరూ మాట్లాడలేదని అన్నారు.

**నిజనిర్ధారణ కమిటీ వేయాలి:** హైడ్రా కూల్చివేతలపై నిజనిర్ధారణ కమిటీ వేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతానని, హైడ్రా కాస్త ముందే మెల్కొంటే ప్రజల్లో అభద్రతా భావం వచ్చేది కాదని ఎమ్మెల్యే దానం నాగేందర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. మూసీలో ఆక్రమణలు ఉన్నాయని మంత్రిగా కేటీఆర్ చెప్పలేదా అని ప్రశ్నించారు. అక్రమకట్టడాలను కూల్చేస్తామని కేసీఆర్ ప్రకటించిన విషయాన్ని మర్చిపోయారా అని నిలదీశారు. అక్రమ కట్టడాలకు బీఆర్ఎస్ హాయాంలో విచ్చలవిడిగా పర్మిషన్ ఇచ్చారని, కూల్చివేతలపై కాంగ్రెస్ పార్టీ కూడా మరింత లోతుగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు.


**పేదల ఇళ్లను కూల్చకూడదు:** మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చడం సరికాదని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మురికివాడల జోలికి వెళ్లొద్దని ముందే చెప్పానని జలవిహార్, ఐమాక్స్ లాంటివి చాలా ఉన్నాయన్నారు. మూసీ నిర్వాసితులకు కౌన్సిలింగ్ ఇచ్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల తర్వాత ఖాళీ చేయించాల్సిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇళ్లకు రెడ్‌మార్క్ చేయడం కచ్చితంగా తొందరపాటు చర్యే అన్నారు. కూల్చిన ఇళ్లకు అక్కడే నివాసాలు కల్పిస్తే మంచిదని, ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళతానని దానం నాగేందర్ అన్నారు.

# పోలీస్ యాక్ట్ అమలు



**విశ్వంభర, సంగారెడ్డి:** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు అక్టోబర్ 1వ తేది నుండి 31 వరకు 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రూపేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించ రాదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు



**విశ్వంభర, మహబూబాబాద్:** గూడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్ ఎక్సరే మిషన్ ను నూతనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్రే సెంటర్ లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ నర్సంపేట గాని మహబూబాబాద్‌కి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడడంతో వెంటనే ఆసుపత్రి యొక్క యజమాన్యం వారు ప్రైవేట్ సంస్థల వారితో సంప్రదింపులు జరిపి చివరిగా నెక్కొండ వాస్తవ్యులు అయినటువంటి సంపత్ రెడ్డి, శేశ్య రెడ్డి వారి సహకారంతో డిజిటల్ ఎక్సరే మిషన్ ప్రభుత్వ ఆసుపత్రికి అందించారు. ప్రజల గురించి గొప్ప మనసుతో సహృదయంతో ఆలోచించి వారి కష్టాలను అర్థం చేసుకొని వారి ఈ యొక్క డిజిటల్ ఎక్స్ రే మిషన్ ఇప్పించినందుకు సంపత్ రెడ్డికి అలాగే షేశ్య రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సంపత్ రెడ్డికి ఎమ్మెల్యే శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గూడూరు మండల అధ్యక్షులు గూడూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా నాయకులు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మండల యూత్ అధ్యక్షులు పలు గ్రామాల మాజీ సర్పంచులు ఎంపీటీసీలు మాజీ జడ్పిటిసిలు, మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ కార్యకర్తలు పార్టీ శ్రేణులుపాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు




**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ మున్సిపాలిటీలోని మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవ - 2024లో భాగంగా మున్సిపల్ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో సఫాయి మిత్ర సురక్ష ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణి చేశారు. మున్సిపల్ కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే మున్సిపాలిటీ పరిశుభ్రంగా ఉంటుందని కమీషనర్ అన్నారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు లక్ష్మణ్, ప్రభుత్వ వైద్యాధికారి డా. పరీక్షిత్ నరేంద్ర, హెచ్ఇఓ డాక్టర్ తిరుపతిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది మోయిన్, రామకృష్ణ, మనిషా సిబ్బంది పాల్గొన్నారు.

# షరతులు లేకుండా రైతు రుణమాఫీ




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన రైతు ధర్నా కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ చిరుమర్తి లింగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఏ చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ, ఋణమాఫీకి 18 వేల కోట్లు ఇచ్చినాము, ఇంకా 13 వేలకోట్లు ఇవ్వాల్సి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రకటించారు. మిగిలిన రైతులకు డబ్బులు సమకూరే వెసులు బాటును బట్టి తేదీ ఇస్తాం అంటున్నారు. ఋణ మాఫీపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ చేశాం అని మాయ మాటలు చెప్తున్నారు. ఒక్కో మంత్రి ఒక్కో రకంగా పొంతన లేకుండా సమాధానం చెప్తూ రైతులను మోసం చేస్తున్నారు. అర్హులైన రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఎటువంటి నిబంధలను లేకుండా రెండు లక్షల రూపాయల ఋణ మాఫీ చేయాలన్నారు. ఆరు గ్యారంటీ లు అమలు చేయలేక హైడ్రా పేరుతో అమాయకుల ఇళ్లను పడగొడుతూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో రామన్నపేట బి.ఆర్.ఎస్ మండల పార్టీ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించాలి

## అదనపు కలెక్టర్ కదిరవన్

### కలెక్టరేట్ ప్రజావాణిలో 181 ఆర్జీల స్వీకరణ

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి లో స్వీకరించిన ఆర్జీలను ఏ మాత్రం జాప్యం చేయకుండా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకవాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు కదిరవన్, వెంకటాచారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 181 మంది నుంచి ఆయన ఆర్జీలను స్వీకరించారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఆర్డీఓ దశరథ్ సింగ్, జిల్లా అధికారులు జి ఆశన్న, పెరిక యాదయ్య, ఆర్ కోటాజి, పవన్ కుమార్, డాక్టర్ సురేందర్, ఆర్.రోహిణి, ఏ.వందన తదితరులు పాల్గొన్నారు. **ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజావాణి: బల్దియా కమిషనర్ ఆమ్రపాలి:** ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆమె ప్రజల నుండి ఫిర్యాదులు, ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి, ఆర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్లు నళిని పద్మావతి, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, అడిషనల్ చీఫ్ సిటీ ప్లానర్లు ప్రదీప్ కుమార్, గంగాధర్, జాయింట్ కమిషనర్ మహేష్ కులకర్ణి, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు



పాల్గొన్నారు. ప్రజావాణి, ట్విట్టర్, ఆన్ లైన్ జీ హెచ్ ఎం సీయాప్‌లో వచ్చిన సమస్యల ను కూడా పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహించొద్దని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యం

## ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**విశ్వంభర, దేవరకద్ర:** మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం మూసాపేట మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి తో కలిసి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు సామాజికంగా ఆర్థికంగా అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా శక్తి పథకం ప్రవేశపెట్టిందని అన్నారు. మిల్క్ ఫారాల నిర్వహణ బాధితులను తమ ప్రభుత్వం ఐకెపికి అప్పగించిందని ఆయన తెలిపారు. అంతేకాక పాఠశాలలో అభివృద్ధి చెందేందుకు తలపెట్టిన అమ్మ అదర్శ పాఠశాల కమిటీల ను సైతం డ్వాక్రా సంఘాలకే ప్రభుత్వం అప్పగించిందన్నారు. అనంతరం మూసాపేటలో అడ్డాకుల, మూసాపేట మండలం చెందిన మహిళలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా 500 గ్యాస్ సిలిండర్ ధ్రువపత్రాలను అందజేశారు. అలాగే రైతు బీమా, ముఖ్యమంత్రి సహాయ నిధి



కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి శేఖర్, అడ్డాకుల మండల అధ్యక్షుడు శ్రీహరి ,మాజీ ఎంపీపీలు భగీ కృష్ణయ్య, నాగార్జున రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు రామన్ గౌడ్ ,బాల నరసింహులు,మండల నాయకులు నల్ల తిరుపతయ్య గౌడ్, బండ రాజేందర్రెడ్డి, కృష్ణయ్య, రామచంద్ర ,సత్యనారాయణ ,రాధిక ,సంతోష, మండల అధికారులు, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు ,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం

**విశ్వంభర. మహేశ్వరం:** తుక్కు గూడలో కేఎల్ ఆర్ కార్యాలయంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు మాజీ శాసన సభ్యులు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టి పి సి సి.ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి లను మర్యాద పూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్స్ బండి మధుసూదన్ రావ్, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, జిన్నాం వెంకటేష్, గుప్త మచ్చేందర్ రెడ్డి ఈ సందర్భంగా కే ఎల్ ఆర్ .డి బి ఆర్. గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ పాలక మండలి సభ్యులకు అభినందనలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బండి మధుసూదన్ రావు మాట్లాడుతూ నియామకానికి కృషిచేసిన కే ఎల్ ఆర్. డి బిఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కేఎల్ఆర్ మాట్లాడుతూ మధుసూదన్ రావు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి వారికి పదవి వరించిందనీ, రాబోయే రోజులలో కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందని తెలియజేశారు. ఆర్ కె పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు లు పున్న గణేష్ నేత, రాష్ట్ర కాంగ్రెస్ నాయ కులు చిలుక ఉపేందర్ రెడ్డి, నల్లెంకి ధనరాజ్ గౌడ్, గట్ల రవీంద్ర, హైటెక్ రామ్, పెద్దవూర సైదులు, ఎన్ ఎస్ యు ఎల్ శివ, పగిళ్ళ భూపాల్ రెడ్డి, లింగస్వామి గౌడ్, వంగూరి యాదవ రెడ్డి, కళ్యాణ్, జెల్ల జగన్నాథం, నాభీ, పగడాల ఎల్లన్న, దుర్గ ప్రసాద్, శ్యామ్ సుందర్ గౌడ్, జంగారెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఈత వనాలను పెంచాలని వినతి



**విశ్వంభర, దేవరకద్ర నియోజకవర్గం:** మహబూబ్ నగర్ జిల్లా,మూసాపేట మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా ఈత వనాలను పెంచాలని మండల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ సంఘం నాయకులు సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అక్కడే ఉన్న కలెక్టర్ తో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఈత వనాలు పెంచేలా చూడాలని ఆయన కోరడంతో స్పందించిన కలెక్టర్ సంబంధిత డిఆర్డీఏ పిడి ఆదేశాలకు జారి చేశారు. మొదటి విడతలో భాగంగా ఈ రెండు రోజుల్లో దాదాపు 3000 ఈత మొక్కలను నాటేలా చూస్తానని డిఆర్డీఏ పిడి చెప్పారు. ఈతవ నాలను పెంచడం వల్ల గ్రామంలో కల్తీ లేని కల్లును విక్రయిం చడానికి వీలవుతుందని మండల గౌడ సంఘ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రభుత్వం ద్వారా 3000 మొక్కలను అందిస్తున్నందుకు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి మండల గౌడ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

## మండల విద్యాధికారికి ఆత్మీయ సన్మానం



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపూర్** : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద నూతనంగా మండల విద్యాధికారిగా నియమించబడిన గోలి శ్రీనివాసులుకు ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అభినందనలు తెలుపుతూ ఆత్మీయ సన్మానం చేసారు. మండల విద్యాధికారి గోలి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయు లందరూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు బోయ రాములు, ఉన్నత పాఠశాల పుట్టపాక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. హనుమంతు,ఉన్నత పాఠశాల జనగాం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కత్తులు ఉదయ, మండల ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గంటెపాక యాదగిరి, ఎన్. చిన్న ఎల్లయ్య,ఎం. రాజేశ్వరి, కె.విజయరాణి, డీ.ఉమామహేశ్వరి, బి. కిష్టయ్య, సిహెచ్. సునీత, ఎం.గణేష్,బి.మంజుల, దశరథ పాల్గొన్నారు.

## విద్యా వాలంటీర్‌కు గౌరవ వేతనం అందజేత



**విశ్వంభర,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో సోమవారం రోజు శశిధర్ రెడ్డి ఫౌండేషన్ చైర్పర్సన్ కంది చంద్రకళ వెంకట్ రాంరెడ్డి నాంచారి పేట గ్రామానికి చెందిన గంధమల్ల మౌనిక విద్యా వాలంటరీకి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.రజిత ఆధ్వర్యంలో గౌరవ వేతనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సమావేశంలో ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులు 70 మంది ఉన్నారని టీచర్స్ ఇద్దరమే కాబట్టి మాకు కొంచెం విద్యావాలంటరీని ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే స్పందించిన ఫౌండేషన్ వారు విద్యా వాలంటరీ పెట్టుకోమని మా ఫౌండేషన్ నుంచి 6 నెలల విద్యా వాలంటరీ వేతనాన్ని అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి కవి రచయిత గాయకుడు చేయూత ఫౌండేషన్ చైర్మన్ వాకిటి రాంరెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గఫర్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎం సుభద్ర, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బొడిగె శాంతమ్మ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్రినిటీ విద్యాసంస్థలో బతుకమ్మ వేడుకలు

### ముఖ్య అతిథిగా కోమటిరెడ్డి లక్ష్మి



**విశ్వంభర, చౌటుప్పల్:** త్రినిటీ విద్యాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డులో అక్టోబర్ ఒకటవ తేదీన ఉదయం పదిన్నర గంటలకు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడం జరుగుతున్నదని విద్య సంస్థ సభ్యులు తెలియజేసారు. ముఖ్యఅతిథిగా మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సతీమణి లక్ష్మి పాల్గొంటారని అన్నారు. మహిళలం దరూ పెద్ద ఎత్తున పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్ళినదుండగుడు



**విశ్వంభర,ఎల్బీనగర్:** మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును లాక్కెళ్ళిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్కాపురి రోడ్ నెంబర్8లో నివాసముండే లక్ష్మీ సుజాత కిరాణా షాప్‌కు అని వెళ్ళింది. ద్విచక్ర వాహనంపై ఆమెకు ఎదురుగా వచ్చిన వ్యక్తి మెడలో నుంచి మూడు తులాల (నను గొలుసు) లాక్కెళ్ళినట్లు తెలిపారు. సమీపం లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సంఘటన స్థలానికి ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య, చైతన్యపురి ఇన్స్పెక్టర్ వెంకటే శ్వర్లు వెళ్లి వృద్ధురాలని మరిన్ని వివరాల్ అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మార్కెట్ కమిటీలలో యువజన కాంగ్రెస్ నాయకులకు అవకాశం కల్పించాలి



**విశ్వంభర, హైదరాబాద్** : ఆమనగల్, కల్వకుర్తి నూతన మార్కెట్ కమిటీలలో యువజన కాంగ్రెస్ నాయకులకు అవకాశం కల్పించాలని కల్వకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి వినతి పత్రం అందజేశారు. యువజన కాంగ్రెస్ తాలూకా అధ్యక్షులు అనిల్ గౌడ్ మాట్లాడుతూ గత పదేళ్లుగా యువజన కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటూ అనేక పోరాట కార్యక్రమాలు చేశామని మమ్మల్ని గుర్తించి మార్కెట్ కమిటీలలో ఆయా మండలాల్లో ఉన్నటువంటి యువజన కాంగ్రెస్ నాయకులకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇచ్చినట్టు తెలిపారు. యువజన కాంగ్రెస్ కల్వకుర్తి మండల అధ్యక్షులు, బాలరాజు, ఆమనగల్ మండల అధ్యక్షులు రాజశేఖర్, వస్పుల శ్రీకాంత్, జావేద్, పాల్గొన్నారు.

# పాఠశాలలో ఉచితంగా ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

**విశ్వంభర, యాదాద్రి భువనగిరి:** రాజాపేట మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొందుగులలో భువనగిరి పట్టణానికి చెందిన ప్రవాస భారతీయులు (ఎన్ ఆర్ ఐ) జడల మాధుర్, తొడుపునూరి శ్రీనివాస్ ల సహకారం తో ప్లేట్స్, గ్లాసులు విద్యార్థులకు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెల్లా ప్రభాకర్ మాట్లాడుతు పాఠశాల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రవాస భారతీయులు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన, వారి మిత్రుడు బేగంపేట పాఠశాల ఉపాధ్యాయుడు కె.ప్రదీప్ కన్నా ఎన్నారైలను సమన్వయ పరుస్తున్న గుండ శ్రవన్ కు ధన్యవాదాలు తెలిపారు. మండల విద్యాధికా అధికారి చందా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు




మరిన్ని సహాయ సహకారాలు అందించాలని ఎన్ ఆర్ ఐ లను కోరారు. ఈ కార్యక్రమంలో కురారం ప్రధానోపాధ్యాయులు కోటిరెడ్డి ఉపాధ్యాయులు మాధవి, జయశీల ,రజనీ, పరమేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి



**విశ్వంభర, మహబూబాబాద్** : కేసముద్రం మండలం కల్వల టి.ఎస్ మోడల్ స్కూల్ నందు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి పాల్గొని బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శాలువాతో సన్మానం చేసి నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను ఆహ్వానించి పాఠశాలకు ఏలోటు వచ్చిన, నేనున్నాను మీకు అని ప్రసంగించారు. ఇట్టి కార్యక్రమంలో బదిలీపై వెళుతున్న ప్రిన్సిపాల్ రవినీ , పదవి చేపట్టిన నవీన్ కుమార్ శాలువా తో సన్మానం చేసారు. అనంతరం పాఠశాల మాజీ ఎస్ఎంసి చైర్మన్ లింగాల పిచ్చయ్య మాట్లాడుతూ పాఠశాలకు ఎలాంటి సౌకర్యాలు కావాలన్నా నేను అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో గండి శీను, బాలకృష్ణారెడ్డి, పదకొండు రవి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు



**విశ్వంభర, జగిత్యాల:** మెట్పల్లి పట్టణంలోనీ వాసవి గార్డెన్ ఫంక్షన్ హాల్లో బీసీల కుల గణన రౌండ్ టేబుల్ సమావేశం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీసీల ఐక్యత కోసం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్ ఉంటే భారతదేశంలోని అత్యధిక మెజారిటీ గల బీసీలకు అన్యాయం జరుగుతుందని బీసీలకు ఎంత రావాలో అంత ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బీసీలలో ఐకమత్యం లేకనే అగ్రవర్ణాల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్నామని దేశవ్యాప్తంగా కులగలను జరిగితే మనమేంతో మనకు అంత అనే విధంగా రిజర్వేషన్లు వర్తిస్తాయని కులగణన కోసం బీసీ లందరూ ఐతామత్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ కామారెడ్డి సభలో బీసీలకు కుల గణన ద్వారా 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పి ఇంతవరకు ఎలాంటి లబ్ధి చేకూరాలేదని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఐకమత్యమే మహాబలముగా బీసీ కుల వర్గాలు ఏకతాటిపై నిల్చండి 42% రిజర్వేషన్లు సాధించేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి బిసి సంక్షేమ సంఘం సభ్యులు, మెట్ పల్లి పట్టణ బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు

## కుక్కల వృద్ధి నియంత్రణకు శస్త్ర చికిత్స కేంద్రం



**విశ్వంభర, భూపాలపల్లి:** కుక్కల వృద్ధి నియంత్రణకు శస్త్ర చికిత్స కేంద్రం తక్షణ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మున్సిపల్ కమీషనర్ కు ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో కుక్కల వృద్ధి నియంత్రణకు శస్త్ర చికిత్సల కేంద్రం ఏర్పాటుపై మున్సిపల్, పశు సంవర్ధక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వీధి కుక్కల సంఖ్య పెరుగుతుండటంతో పాటు వాటి ద్వారా ఎదురవుతున్న సమస్యలు, ప్రజలు కుక్కకాటుకు గురవుతున్న సందర్భంగా ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని వృద్ధి నియంత్రణ కు శస్త్ర చికిత్సలు చేసేందుకు కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం చేపట్టడం ద్వారా కుక్కల వృద్ధి నియంత్రణతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, జంతు సంక్షేమానికి తోడ్పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పశు సంవర్ధక శాఖ అధికారి డా కుమార స్వామి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

## మహిళా శక్తి క్యాంటీన్‌ల నిర్వహణకు శిక్షణ

**విశ్వంభర, భూపాలపల్లి :** మహిళా శక్తి క్యాంటీన్‌ల నిర్వహణలో మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో మహిళా శక్తి కాంటీన్లు ఏర్పాటులో శిక్షణ పూర్తి చేసుకున్న మండల సమాఖ్య సభ్యులకు, ఈవెంట్ మేనేజ్మెంట్ పూర్తిచేసిన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి క్యాంటీన్ లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డీఓ అవినాష్, ఏపీడీ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## గీతా కార్మికులకు సేఫ్టీ కిట్ల పంపిణీ

**విశ్వంభర, ఆమనగల్లు:** ప్రొహిబిషన్ఎ, క్సైజ్ స్టేషన్ ఆమనగల్లు పరిధిలోని కడ్తాల్ మండలం చరికొండ గ్రామంలో తాటి చెట్లు ఎక్కే గీత కార్మికుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన కాటమయ్య రక్ష కవచం సేఫ్టీ కిట్ ను బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ కలిసి కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమనగల్లు పరిధిలోని నాలుగు మండలలాకు మొదటి విడతగా 75 కాటమయ్య రక్షణ కిట్లను మంజూరు చేశారని తెలిపారు. ఎలా వాడుకోవాలో గీత కార్మికులందరికీ శిక్షణానిచ్చారు. ఈ కిట్ల వల్ల గీత కార్మికులకు ప్రాణహాని జరక్కుండా తాటి చెట్టు మీద నుండి కింద పడకుండా ఉండడానికి ఉపయోగపడుతుందని మిగిలిన కార్మికులకి విడతలవారీగా ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని ఎవరికైతే టిఎఫ్టి లైసెన్స్ , సొసైటీలో మెంబర్షిప్ ఉంటుందో వాళ్లకు మాత్రమే కాటమయ్య రక్షణ కిట్లను అందజేస్తామని సీఐ బైద్యనాథ్ చోహన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కృష్ణ ప్రసాద్, బీసీ వెల్ఫేర్ మాధవరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రవీందర్, స్టేట్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, గీతా కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీత్ రెడ్డికి ఎమ్మెల్యే కసిరెడ్డి నివాళులు

**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం వీరన్నపల్లి గ్రామంలో బెక్కిరి గోవర్ధన్ రెడ్డి కుమారుడు బెక్కిరి సుప్రిత్ రెడ్డి భావి సంపులో పడి మృతి చెందారు. ఆయన దశదిన కర్మ వీరన్న పల్లి గ్రామంలో సోమవారం నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణరెడ్డి పాల్గొని



వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెల్దండ మాజీ సర్పం చ్ భూపతి రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రేణు రెడ్డి, మాజీ సర్పంచ్ నాగమణి లింగంగౌడ్, మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ సర్పంచ్ జంగమ్మ, మైసయ్య, పవన్ వాల్మీకి, రఘుపతి రెడ్డి, సాయి రెడ్డి, రామ లక్ష్మణ్, వెంకటయ్య రమేష్ గణేష్ వెంకటేష్,పాల్గొన్నారు.

# హైడ్రాపై బీఆర్ఎస్, బీజేపీ నాటకాలు



## టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్

**విశ్వంభర, హైద్రాబాద్:** చెరువులు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు నాలాలు, మూసీ ప్రక్షాళనపై బిఆర్ఎస్, బీజేపీ వైఖరేంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నామని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని గతంలోనే సర్వోన్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు తీర్పులున్నాయని, అందువల్ల దానిపై ఎవరు మాట్లాడినా కోర్టు ధిక్కరం కింద సుమోటోగా కేసులు నమోదు చేయాలని కోరుతున్నామని అన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్ రూల్స్ ప్రకారంగా ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్, రోడ్డు విస్తరణలో ప్రజా ప్రయోజల కోసం విధి విధానాలు ఖరారు చేస్తూ జి.వో యం.ఎస్ నెం 168 విడుదల చేయడం జరిగిందని, దాని ప్రకారంగా ఎఫ్ టిఎల్, బఫర్ జోన్లలో ఎవరిదైనా పట్ట భూమి ఉన్నా ఎటువంటి నిర్మాణాలు చేయవద్దని నిభందనలు చెబుతున్నాయని పేర్కొన్నారు. పట్టా భూములు కోల్పోయిన వారికి నష్ట పరిహారం ఇచ్చే ఆలోచన ప్రభుత్వంలో ఉందని, అలాంటి వారికి గతంలో టిడిఆర్ బాండ్లు ఇచ్చారు. కొంత మంది ఆక్రమణ దారులు, భూ భకాసురుల ధన దాహానికి చెరువులు, నాలాలు ఆక్రమించి నిర్మాణాలు చేస్తే.. తెలిసి తెలియక అందులోని ఇళ్ళను కొనుగోలుచేశారని తెలిపారు. అలా నష్టపోయిన వారికి డబుల్ బెడ్రూం ఇళ్ళు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు . ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇళ్ళు నిర్మించుకున్నవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇళ్లు ఇచ్చే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని ఆయన తెలిపారు. మూసీ రివర్ బెడ్ లో ఇళ్ళు కోల్పోయిన వారికి ఏదైనా చిన్న తరహా పరిశ్రమలు కోల్పోతే.. వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసుకోవడానికి ఏర్పాటు చేస్తోందని చెప్పారు. ఇక వాస్తవాలు ఈ విధంగా ఉంటే మాజీ మంత్రి హరీష్ రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. అత్యంత వేగాంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరం కొద్దిపాటి వర్షానికే మోకాళ్ల లోతు నీళ్ల వల్ల ట్రాఫిక్ జామ్ జరిగి ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల నుంచి శాశ్వత పరిష్కర దిశ మార్గమే రేవంత్ రెడ్డి ఆలోచనలోంచి వచ్చిన కార్యక్రమే.. హైడ్రా. ఇది ఆయన మానస పుత్రిక కార్యక్రమం. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికి ప్రతిపక్షాలు.. ప్రజలను తప్పుదొవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. హైడ్రా వల్ల ఏ ఒక్కరికి నష్టం జరగకుండా చూసే బాధ్యత మా ప్రభుత్వానిదని తెలియజేస్తున్నాం. ప్రతిపక్ష నాయకుల వలలో చిక్కొద్దని ప్రజలను కోరుతున్నామని సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు. కొంతమంది అదే పనిగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూన్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నమన్నారు. న్యాయ పరమైన చిక్కులను, అడ్డంకులను ఎదుర్కుంటూ ఎలాంటి తరమత భేదం లేకుండా భావితరాలకు సుందరమైన నగరాన్ని అందించాలని రేవంత్ రెడ్డి కలలను నిజం చేస్తూ హైడ్రా ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

## కేవీకే శాస్త్రవేత్తల వరి పైరుల సందర్శన




**విశ్వంభర, త్రిపురారం:** కృషి విజ్ఞాన కేంద్రం కంప సాగర్ నందు గల కెవికె శాస్త్రవేత్తలు వరి పైరులను ఆశించే పలు వ్యాధుల సస్యరక్షణ సమస్యలను నివృత్తి చేసే క్రమంలో భాగంగా సోమవారం నాడు వ్యవసాయ పరిశోధన స్థానం, శాస్త్రవేత్త డా. లింగయ్య, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. చంద్ర శేఖర్, వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్తలు నిలయ గూడెం గ్రామంలోని పలు రైతుల పొలాలని సందర్శించారు. వరి పొలాల్లో ఆకు ముడత తీవ్రతని అధికంగా గుర్తించడం జరిగి ందనీ. నివారణకు లీటర్ నీటికి 2గ్రాల కార్టాప్ హైడ్రో క్లోరైడ్‌ని పిచికారి చేసుకోవాలని సూచించారు. రైతులు కోట సైదులు, శ్రీనివాస్, నాగరాజు, వాసులు పాల్గొన్నారు.

## కొత్తపేట్‌లో చీరల పంపిణీ




**విశ్వంభర, రంగారెడ్డి :** కేశంపేట మండల పరిధిలో కొత్తపేట గ్రామంలో బీజేవైఎం మండల పార్టీ అధ్యక్షులు పాలాది శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలకు దసరా దీపావళి శుభ సందర్భాన్ని పురస్కరించుకొని చీరలను, కిట్లను పండుగ బహుమతులుగా అందించారు. పాలాది శ్రీనివాస్ చేపట్టిన ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, పట్టణ సీనియర్ నాయకులు అందే బాబయ్య వీరితోపాటు దయానంద సరస్వతి యోగేశ్వర్ స్వామి పాల్గొని మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పాలాది శ్రీనివాస్ 12 సంవత్సరాలు అమెరికాలో ఉండి తన స్వగ్రామానికి ఏదైనా సేవ చేయాలనే సంకల్పంతో అదే లక్ష్యంగా పెట్టుకొని షాద్ నగర్ లో నివాసం ఉంటూనే దసరా దీపావళి సందర్భంగా కొత్తపేట గ్రామం మహిళామూర్తులకు తనవంతుగా చీరలను, కిట్లను బహుకరించడం జరిగింది. నల్లి శ్రీ వర్ధన్ రెడ్డి బిజెపి సీనియర్ నాయకులు తోపాటు కేశంపేట మండల బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి



**విశ్వంభర, చివ్వేంల:** ఉపాధ్యా యులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని టిపియూఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు తికుల్ల సాయి రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయు లకు ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కళారాణి, యామ రమేష్, కృష్ణ, మురళీధర్ రెడ్డి, పాండురంగ చారి, భగవాన్ రెడ్డి, వీరయ్య, నాగిరెడ్డి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం రాయిగిరీ–మోత్కుర్ మెయిన్ రోడ్డు తుక్కాపురం గ్రామ బస్ స్టేజీ వద్ద సోమవారం రోజు ప్రజలకు చైన్ స్నాచింగ్, డ్రగ్స్, సైబర్ క్రైమ్ పైన అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో 100కి కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు(ఎం) ఏఎస్సై పి. సైదులు, హెడ్కానిస్టేబుల్ యాకుబ్, పోలీసుకానిస్టేబుళ్లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మాజీ వైస్ ఎంపీపీ దుర్మరణం



**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి :** మహాదేవపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపిపి బండం పుష్ప లత రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కొడుకు అమెరికా పర్యటనకు బయలుదేరుతుండగా వీడుకోలు పలికేందుకు విమానాశ్రయానికి వెళ్లే సమయంలో ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదం చోటు చేసుకుంది. వర్షం కారణంగా రోడ్డు సరిగ్గా కనిపించకపోవడంతో కార్ అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టడముతో ప్రమాదం జరిగింది. కారులో ఉన్న మనుమరాలును యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్‌కు వినతి



**విశ్వంభర, షాద్ నగర్ :** ముదిరాజులను "డి" గ్రూప్ నుంచి "ఏ" గ్రూపులో చేర్చాలని షాద్ నగర్ తాలూకా అధ్యక్షులు అంచే రాములు ముదిరాజ్ కోరారు. తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ముదిరాజుల యొక్క సమస్యల గురించివివరించారు. అదేవిధంగా ముదిరాజ్ డి గ్రూప్ నుంచి ఏ గ్రూపులో చేర్చాలని కోరడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా కార్పొరేషన్ తరపున ముదిరాజులకు తగిన ఉపాధి సమకూర్చాలని కోరడం జరిగింది. అధ్యక్షులు అంచేరాములు ముదిరాజ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, మన్నే రవి ముదిరాజ్, అంగడిపల్లి శంకర్ ముదిరాజ్, మంగ భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో 68 వ కడ్తాల్ జోనల్ స్థాయి ఖో ఖో పోటీలను రావిచేడ్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మహ్మద్ సాబేర్ ఆధ్వర్యంలో కడ్తాల్ మండలం ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ కలిసి ప్రారంభించారు. ఈ పోటీల్లో అమన్‌గల్, మాడుగుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు చెందిన 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 14, 17 సంవత్సరాల బాలుర, బాలికల నాలుగు విభాగాలలో పోటీలు జరగగా తలకొండపల్లి క్రీడాకారులు మొదటి స్థానంలో, కడ్తాల్ క్రీడాకారులు ద్వితీయ స్థానంలో నిలిచారు. మంచి ప్రతిభ కనబరిచి క్రీడకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ విజయ్, జోనల్ సెక్రెటరీ భీముడు, ఛైర్మన్ సువర్ణ , గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతి , మాజీ సర్పంచ్లు విటలయ్య, మహేందర్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ , మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్ రమేష్ గౌడ్, క్రీడాకారులు, పాల్గొన్నారు.

## రైతు బిడ్డకు నాలుగు కొలువులు



**విశ్వంభర, భూపాలపల్లి:** సామాన్య కుటుంబంలో జన్మించిన రైతు బిడ్డ ఉన్నతమైన ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంతాల వనమల–జయపాల్ రెడ్డి దంపతుల కుమారుడైన రాజశేఖర్ రెడ్డి ఏకంగా నాలుగు ఉద్యోగాలకు సెలెక్ట్ అయి చివరకు ఐబి శాఖలో ఏఈఈ గా సోమవారం విధుల్లో చేరాడు. ఏ.ఈ.ఈ ఉద్యోగం సాధించిన రాజశేఖర్ రెడ్డి చిన్నతనం నుండి చదువులో చురుకుగా ఉంటూ ఎంతో కష్టపడి చదువుకున్నాడు. మండలంలోని చెల్పూర్ గ్రామంలో హైస్కూల్ విద్య అభ్యసించి పై చదువుల కోసం హనుమకొండ వెల్లి ఇంటర్ చదివి,గూడెప్పాడు లోని విట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్ చదువు పూర్తి చేశాడు. అనంతరం రైల్వే శాఖలో గ్రూప్–డిలో ఉద్యోగం సాధించి అందులో పని చేస్తూ ఉన్నత ఉద్యోగాల కోసం నాలుగు సంవత్సరాలుగా కష్టపడి పోటీ పరీక్షలు రాయగా పాలిటెక్నిక్ లెక్చరర్, గ్రూప్ –4, ఏ ఈఈ ఉద్యోగాలకు సెలెక్ట్ అయ్యాడు. మొగుళ్ళపల్లి ఏఈఈ గా చిట్యాల ఐబీ డీఈ అమ్రపాలి ఆధ్వర్యంలో విధుల్లో చేరాడు.

## సేవారత్న అవార్డు గ్రహీతకు సన్మానం



**విశ్వంభర, సంగారెడ్డి:** హైదరాబాద్ సరస్వతి ఆడిటోరియంలో స్ఫూర్తి ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను గుర్తించి భారత సేవా రత్న అవార్డు గ్రహీతగా జిన్నారం మండలం రాళ్లకత్త గ్రామానికి చెందిన నీరుడి మహేష్ ముదిరాజ్‌కి పలు సేవా కార్యక్రమాలు, సోషల్ ఆక్టివిటీస్ గుర్తించి స్ఫూర్తి ఎన్జీవో సంస్థ డాక్టర్ ఆకుల రమేష్ సరస్వతి ఆడిటోరియంలో పలు ఆర్గనైజర్స్ జాతీయ నాయకుల చేతులమీదుగా మహేష్‌కి శాలువాతో సత్కరించి మెడల్ వేసి అవార్డును అందించారు. ఈ అవార్డు ఇచ్చినందుకు స్ఫూర్తి ఎన్జీవో సంస్థ ఆర్గనైజర్ డాక్టర్ ఆకుల రమేష్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## సిమెంటు బెంచీల బహూకరణ



**విశ్వంభర, నల్గొండ:** త్రిపురారం మండలంలో మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పిటిసి మారు ధన్సింగ్ నాయక్ వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో తహశీల్దార్, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక సహకార సంఘం పలు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ గ్రామాలలో ప్రజలు కూర్చోవడానికి వీలుగా 35 సిమెంటు బెంచీలను బహుకరించారు. ఇట్టి సందర్భంగా మాజీ ఎంపీపీ మారు దన్ నాయక్ మాట్లాడుతూ ఇట్టి సిమెంట్ బెంజీలను ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ కార్యాలయాల్లో స్థాపించడం సంతోషా న్నిచ్చిందని తెలియజేశారు. ఎక్స్ జెడ్పిటిసి భారతి భాస్కర్ నాయక్ , ఎక్స్ ఎంపిపి ధన్ సింగ్ నాయక్, మాజీ సర్పంచ్ బొల్లా వెంకటేశ్వర్లు, జయరాం నాయక్,సీనియర్ నాయకులు బొసింగ్ నాయక్, మాజీ సర్పంచ్ పాండు నాయక్ మరియు,మహిళా అధ్యక్షురాలు పద్మ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన

**విశ్వంభర, నల్గొండ :** మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో ప్రజావాణిలో భాగంగా సోమవారం మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని అధికారుల అందరితో కలిసి ప్రజవాణి కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో అధికారుల వారీగా 17 దరఖాస్తులు స్వీకరించగా అందులో మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ సబ్ రిజిస్టర్ కార్యాలయం ,మరియు డివిజన్ స్థాయిలోని పలు మండల తహసిల్దార్ అధికారుల వారిగా దరఖాస్తులు స్వీకరణ జరిగిందని అన్నారు. తాహాశీల్దార్ హరిబాబు, గీత, వాణి, డిప్యూటీ డిఎంహెచ్వో, ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## దసరా పండుగ కరపత్రం విడుదల

**విశ్వంభర, ఘట్కేసర్ :** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో సద్దులబతుకమ్మ, దసరా పండుగ, రావణ దహన కాండ నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఘట్కేసర్ మున్సిపాలిటీ గురుకుల కళాశాల మైదానంలో సోమవారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా జనచైతన్య సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశామన్నారు.

## ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా అనిల్

**విశ్వంభర, నల్గొండ :** త్రిపురారం గ్రామానికి చెందిన హనుమంతు కొండయ్య, బాలమ్మ గీత కార్మికుల వృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ దంపతుల ద్వితీయ కుమారుడు అనిల్ ను కూలి పనులు చేస్తూచదివించారు. గత రెండు సంవత్సరాలుగా అవనిగడ్డలో డీఎస్సీ కోసం సన్నద్ధం అవుతూ ఉన్నాడు. 2023లో విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ లో ఇంటర్లో 50% ఉంటేనే డీఎస్సీకి అర్హులు అనే నిబంధన ఉండడంతో దానిని వ్యతిరేకిస్తూ హైకోర్టుకు వెళ్లి హైకోర్టు నుండి తీర్పు తెచ్చుకొని అప్లై చేసుకున్నాడు. జిల్లాలో మొత్తం ఉన్న ఆరు పోస్టులలో రెండవ ర్యాంకు సాధించానని అని తెలిపారు. అనిల్ యొక్క తల్లిదండ్రులు కొండయ్య, బాలమ్మ తన కుమారుడి కష్టానికి ప్రతిఫలం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించండి



**విశ్వంభర, మహబూబాబాద్ :** కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉన్న వాటిని గుర్తించి నిజమైన పేద లబ్ధిదారులకు సహాయం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన పరిష్కారం, మండలాల ప్రత్యేక అధికారులతో విద్యా, వైద్యం, సానిటేషన్, వసతి గృహాలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన గ్రామాలలో షెడ్యూల్ ప్రకారం సానిటేషన్, వైద్యం, విద్య వసతి గృహాల తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జడ్పీ సీఈవో నర్మద, డిఆర్డిఓ మదన్మోహన్ రాజు, డిపిఓ హరిప్రసాద్, డిడబ్ల్యుఓ వరలక్ష్మి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, డిడి గ్రౌండ్ వాటర్ సురేష్, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మోత్యా నాయక్ సేవలు మరువలేనివి



**విశ్వంభర, కడ్తాల్ :** కడ్తాల మండల మాజీ ఎంపీపీ కమ్లీ భర్త, మండల కాంగ్రెస్ నాయకులు మోత్య నాయక్ దశదినకర్మ మైసిగండి గ్రామంలోని ఆయన నివాసంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ఆయన చిత్ర పటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. అనంతరం కల్వకుర్తి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అన్ని మండలాల విద్యుత్ శాఖ అధికారుల సమీక్ష నిర్వహించారు. ఎక్కడెక్కడ ఏయే సమస్యలు ఉన్నాయో వివరాలు తెలుసుకొని హైదరాబాద్ లో సీఎండి ని కలిసి నియోజకవర్గానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యవర్గ సభ్యుడు ఆయిల శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, రాష్ట్ర సేవాలాల్ సేన కార్యదర్శి లక్ పతి నాయక్,భిక్యా నాయక్ కాంగ్రెస్ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మూసీ పరిసరాల్లో ఒక్క గుడిసె కూడా తొలగించలేదు



హైడ్రా టార్గెట్ భూ బకాసురులు మాత్రమే

గత పదేళ్లలో 1,500 చెరువులు కబ్జా చేశారు.

సిరిసిల్ల వీరుడు కేటీఆర్ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు

పదేళ్లలో జరిపిన నియంత పాలనను మర్చిపోయారా?

తండ్రి, కొడుకు, బిడ్డ, అల్లుడు దోచుకున్న దోపిడీకి పార్లమెంట్ లో సున్నా సీట్లు వచ్చాయి

సోషల్ మీడియాని బీఆర్ఎస్, బీజేపీ సోషల్ సెన్స్ లేకుండా వాడుతున్నాయి

టీపీసీసీచీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**విశ్వంభర, హైదరాబాద్:** గత పదేళ్లలో బీఆర్ఎస్ హయాంలో 1,500 చెరువులు కబ్జాకు గురయ్యాయని, ఇందులో ఎక్కువ శాతం బీఆర్ఎస్ నేతలే ఆక్రమించుకున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నాయకుల వైఖరి దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఆయన మండిపడ్డారు. అరగంట వాన పడితే హైదరాబాద్ పరిస్థితి దారుణంగా అవుతోందని మహేశ్‌కుమార్ తెలిపారు. వరదల నివారణకే మూసీ ప్రక్షాళన చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గట్టిగా వర్షం పడితే హైదరాబాద్ ఎక్కడిక్కడ స్తంభిస్తోందన్నారు. హైదరాబాద్ భవిష్యత్ కోసమే తాము ముందుకెళ్తున్నామన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ వయనాడ్ పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దన్నారు.వరదలు వస్తే హైదరాబాద్ పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. గ్లోబల్ వార్మింగ్ గురించి బీఆర్ఎస్ నేతలకు ఆలోచన లేదని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. మూసీ ప్రక్షాళన బీఆర్ఎస్ మేనిఫెస్టోలో లేదా? ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేయాలని చూస్తే హైడ్రా ఉందన్నారు. మూసీలో ఇప్పటివరకు పేదల గుడిసెలు ఒక్కటి కూడా కూల్చలేదని ఆయన పేర్కొన్నారు. అన్ని పార్టీల ఎన్నికల అజెండాలో మూసీ ప్రక్షాళన ఉందని, మూసీ పరీవాహకంలో ఇప్పటివరకు ఒక్క పేదవాడి ఇల్లు కూడా కూల్చలేదని ఆయన తెలిపారు హైడ్రాను ఒక యజ్ఞంలా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఆక్రమణలను తొలగిస్తే తప్ప హైదరాబాద్‌కు రక్షణ లేదని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతి పేదవాడిని అన్ని రకాలుగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతుందని, పేదోడు కష్టాల్లో ఉంటే వారికి అండగా ఉండే పార్టీ కాంగ్రెస్ అని ఆయన అన్నారు. తాము దీర్ఘకాలిక ఆలోచనలతో ముందుకెళ్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ చర్యలకు 90 శాతం మంది మద్దతు ఉందన్నారు. హైదరాబాద్‌కు పూర్వవైభవం తీసుకొస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకుల ఫాంహౌస్‌ల అభివృద్ధి చెందితే హైదరాబాద్ అభివృద్ధి చెందినట్టేనా అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతల పదేళ్ల అరాచక పాలన అందరికీ తెలుసని మహేశ్ కుమార్ తెలిపారు. మల్లన్న సాగర్ నిర్వాసితుల విషయమై ఆయన మాట్లాడారు. 'మల్లన్న సాగర్ నిర్వాసితులను బీఆర్ఎస్ పాలనలో సీఆర్పీఎఫ్ జవాన్లతో నిర్బంధించారని తెలిపారు. సిరిసిల్ల వీరుడు, ధీరుడు కేటీఆర్ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని,పదేండ్లలో జరిపిన నియంత పాలనను మర్చిపోయారా కేటీఆర్? అయ్యా, కొడుకు, బిడ్డ, అల్లుడు దోచుకున్న దోపిడీ కారణంగా పార్లమెంటు ఎన్నికల్లో సున్నా సీట్లు వచ్చాయని తెలిపారు . సోషల్ మీడియాను బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు సోషల్ సెన్స్ లేకుండా ఇష్టానుసారంగా వాడుతు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు . బీఆర్ఎస్ సోషల్ మీడియా దిగజారి వ్యవహరిస్తుందన్నారు . మహిళా మంత్రులపై అంత దారుణంగా ట్రోలింగ్ చేస్తుంటే కేటీఆర్, హరీశ్ రావు లుహెచ్చరించరా అని ఆయన ప్రశ్నించారు. ఆ పోస్టులను చూసి రాష్ట్రంలో ఉన్న పద్మశాలి గుండెలు బాధపడుతున్నాయన్నారు.ఉద్యమాలు చేసి మంత్రిగా ఎదిగిన ఒక పద్మశాలి బిడ్డను ఇంతలా అవమానుపరుస్తారా అని మండిపడ్డారు.ఈ విధంగా పోస్టులు పెడుతున్న బీఆర్ఎస్ కేటీఆర్ స్థానంలో నేను ఉంటే వెంటనే క్షమాపణ చెప్పేవాడినన్నారు . రాజకీయంగా విమర్శ చేయాలి.. తప్పులేదు కానీ, ఒక బీసీ ఆడ బిడ్డను ఈ విధంగా అవమానపరుస్తారా అది ఎంతవరకు కరెక్టు? అని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు.

## హైడ్రా అంటే కూల్చివేతలే కాదు

### పేదల నివాసాల జోలికి వెళ్లదు.. స్పష్టం చేసిన ఏవీ రంగనాథ్

**విశ్వంభర, హైదరాబాద్:** హైడ్రా అంటే కూల్చివేతలే కాదని కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. హైడ్రా పరిధి ఔటర్ రింగు రోడ్డు వరకే అని ఆయన తెలిపారు. నగరంలోనే కాదు.. రాష్ట్రంలో.. ఆఖరకు ఇతర రాష్ట్రాల్లో కూల్చివేతలను కూడా హైడ్రాకు ఆపాదించి సామాజిక మాధ్యమాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని అన్నారు. హైడ్రా పేదల నివాసాల జోలికి వెళ్లదని ఏవీ రంగనాథ్ తెలిపారు. అలాగే నివాసం ఉంటే ఆ ఇళ్లను కూల్చదని చెప్పారు. కూల్చివేతలన్నీ హైడ్రావి కాదని స్పష్టం చేశారు. ప్రజలు, సామాజిక మాధ్యమాలు ఈ విషయాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వనరుల పరిరక్షణ, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటం, వర్షాలు, వరదల సమయంలో రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు.మూసీ నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదని కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అక్కి నివాసితులను హైడ్రా తరలించడం లేదని చెప్పారు. అక్కడ ఎలాంటి కూల్చివేతలను హైడ్రా చేపట్టడం లేదని పేర్కొన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా



మార్కింగ్ చేయడం లేదని స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ ప్రత్యేక ప్రాజెక్టు అని.. దాన్ని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**విశ్వంభర, షాద్ నగర్ :** సాహితీ విద్యాలయం గాంధీనగర్ కాలనీ విద్యార్థులు 10వ తరగతి చదువుకొని 20 సంవత్సరాలు అయిన సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. షాద్ నగర్‌లో మల్లికార్జున హోల్ విద్యార్థులు అందరు కలిసి గురువులని ముఖ్యంగా మాతాజీని శాలువాలు ,పూల మాలతో సన్మానించడం జరిగింది. విద్యార్థులు ఎంతో సంతోషంగా ఉపాధ్యాయుల ప్రేమను పంచుకొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ చిన్ననాటి చదువులు నేర్పిన ఉపాధ్యాయులకు అందరికీ పాదాభివందనాలు చేస్తూ అందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు యువనేత మధు శ్రీ షిరిడి సాయిబాబా చిత్రపటాన్ని అందజేశారు.

## నిర్మించబోయే ఫంక్షన్ హాల్‌కు శ్రీపాదరావు పేరు



**విశ్వంభర :జయశంకర్ భూపాలపల్లి :** మహాదేవపూర్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఛైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి అధ్యక్షతన సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సహకార సంఘం యొక్క అర్ధవార్షిక , నుండి నూతనంగా నిర్మించబోయే ఫంక్షన్ హాల్ కు దుద్దిల్ల శ్రీపాద రావు పేరు , చిత్రపటం సంఘ కార్యాలయంలో శాశ్వతంగా పెట్టుటకు, లావని పట్టాదారులు ఎక్కువగా ఉన్నందున లావని పట్టాదారులకు లోన్ ఇవ్వడం కోసం ఛైర్మన్ జిల్లా సహకార సంఘం బ్యాంక్ వారిని కోరుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం లక్ష యాభైవేల రూపాయల లోపు క్రాఫ్ లోన్ తీసుకునే రైతులకు, మార్టిగేజ్ చేయకుండా లోన్ ఇవ్వడం కోసం సంఘము నుండి పెస్టిసైడ్ షాప్ ఏర్పాటు చేయుటకు, సంఘంలో సోలార్ సిస్టం ఏర్పాటుకు చేయుటకు ఏకగ్రీవంగా నిర్వహించారు. జిల్లా సహకార సీనియర్ అధికారి దిలీప్ రెడ్డి,(కే డి డి సి)బ్యాంక్ సూపర్ వైజర్ రాజిరెడ్డి, వామనరావు, కోట రాజబాపు, అక్బర్‌ఖాన్, ఆకుతోట సుధాకర్, సంఘము యొక్క డైరెక్టర్‌లు ఇబ్రహీం, తోట సుధాకర్, చీర్ల తిరుపతి రెడ్డి, కల్గురి సమ్మక్క, పీర్ల శ్రీనివాస్ , సంఘ కార్యదర్శి:కుమ్మరి రాజబాపు రైతులు కటకం అశోక్, ఆన్ కారి ప్రభాకర్, బుర్రి శివరాజ్, కోట సమ్మయ్య,అడుప లక్ష్మీనారాయణ మరియు రైతులు పాల్గొన్నారు.

## బాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలతో ప్రకాశ్‌రాజ్ ట్వీట్

### సుప్రీం కోర్టు తీర్పు ప్రస్తావన



**విశ్వంభర, హైదరాబాద్:** తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ప్రముఖ సీనియర్? నటుడు ప్రకాశ్? రాజ్? మరోసారి ఎక్స్? వేదికగా పోస్టు చేశారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలను జోడిస్తూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్? కల్యాణ్? ఫొటోలున్న పోస్టును షేర్? చేశారు. ఆ ఫొటో కింద దేవుడిని రాజకీయాల్లోకి లాగకండి అంటూ ప్రకాశ్?రాజ్? వ్యాఖ్యానించారు. దీంతో మరోసారి ప్రకాశ్?రాజ్? వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్?గా మారాయి. ఈ వివాదానికి సంబంధించి ప్రకాశ్? రాజ్? ఇటీవల చేసిన కామెంట్స్?పై జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్? కల్యాణ్?తో పాటు ఆ పార్టీ నాయకులు, మూవీ ఆర్టిస్? అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు అభ్యంతరం వ్యక్తం చేశారు.

## సభ్యత్వ నమోదుకు ఎవరిని భయభ్రాంతులకు గురి చేయలేదు

**విశ్వంభర, భూపాలపల్లి:** కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల అభివృద్ధి చూసి ఈరోజు మహిళలు తామే స్వయంగా సభ్యత్వాలు నమోదు చేయించుకుంటున్నారు. తప్ప ఈ సభ్యత్వ నమోదుకు ఎవరిని భయభ్రాంతులకు గురిచేయడం లేదని భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మహిళ మండల పార్టీ అధ్యక్షురాలు బందెల సత్తమ్మ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మహిళ కార్యకర్తలకే సభ్య త్వాలు చేస్తున్నాం అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అనేక అవినీతికి పాల్పడిందని అన్నారు. కాళేశ్వరం పంప్ హౌస్ పరిధిలోని భూ నిర్వాసితుల వద్ద తక్కువ ధరకే భూములు లాక్కొని కోట్లాది డబ్బులు మీరు దండుకున్నది వాస్తవం కాదా, పూసుకుపల్లిలో హనుమాన్ గుడి కట్టిస్తామని డబ్బులు తీసుకున్నది మీరు కాదా అని ప్రశ్నించారు. కోట్లాది డబ్బులు దోచుకున్నది గత ప్రభుత్వం కాదా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల ఓటమి భయం పట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారు అని అన్నారు. ఒక దళిత మహిళ మండల పార్టీ అధ్యక్షురాలు మండలంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయడం బీఆర్ఎస్ నాయకులు ఓర్చుకోవడం లేదు అని అన్నారు.

## రామిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన పుట్ట మధు

**విశ్వంభర,కాటారం:** కొత్తపల్లి గ్రామంలో కుంభం రామిరెడ్డి ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి, చిత్రపటానికి మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టమధూకర్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జక్కు రాకేష్, కార్యకర్తలు తదితరులు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలోని శుభానందా పార్వతి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈ ఓ మారుతి తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకు పార్వతి దేవి, సరస్వతి దేవి ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాలలో అలంకరించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ ముఖ్య అర్చకులు ఫణీంద్ర శర్మ తెలిపారు.

## మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌ను నియమించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీఓ సంస్థ జాతీయ అధ్యక్షులు అయిలినేని శ్రీనివాసరావు మానవ హక్కులపై అవగాహన కల్పించారు. రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ ఛైర్మెన్, ఆర్టీఐ కమిషనర్ ను వెంటనే నియామకం చేసి సామాన్య ప్రజలకూ తగు న్యాయం జరిపించాలని, వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాలని ఎన్.హె.ఆర్.సీ ఎన్.జీ.వో తరుపున కోరారు. నేడు సమాజంలో జరుగుతున్నటువంటి మహిళలపై అత్యాచారాలు, మైనర్ బాలికలపై లైంగిక వేదింపులు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ లో అసౌకర్యాలపై సమావేశంలో పూర్తిగా చర్చించి, ఎటువంటి వేధింపులు జరుగకుండా ప్రత్యేక అధికారులను నియమించడానికి శ్రద్ధ వహించాలని తెలిపారు. మానవ హక్కుల ఉల్లంఘన రక్షణ చర్యలపై పూర్తి స్థాయిలో సభ్యులకు అవగాహన కల్పించి, ఏక్కడ మానవ హక్కులకు ఆటంకం ఏర్పడిన ఎన్ హెచ్ ఆర్ సి ముందుంటుందని శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలకు చెందిన 30 మంది సభ్యులు పాల్గొన్నారు. త్వరలోనే జిల్లా కమిటీ, మండల కమిటీల నియమించాలని నిర్ణయించారు. రాష్ట్ర సభ్యులు జి.గంగా ప్రసాద్, ఎన్ గంగరామ్, పెద్దపల్లి జిల్లా ఛైర్మెన్ మాచిడి దిలీప్, జిల్లా సెక్రటరీ కృష్ణమూర్తి, భూపాలపల్లి జిల్లా సభ్యులు కొరిపెల్లి ప్రశాంత్ రావు, వెన్నంపల్లి మహేష్, సబావత్ నాగరాజు నాయక్, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు లింగాల రామయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మెరుగు లక్ష్మణ్, కారెంగుల బాపురావు, మోటం వెంకటేశ్వర్లు,మెరుగు నరసింహ స్వామి, చకినారపు తారా చందు పాల్గొన్నారు.

## నేడు డీఎస్సీ అభ్యర్థులకు సర్టిఫికేట్స్ వేరిఫికేషన్

**విశ్వంభర, మహబూబాబాద్ :** జిల్లాలోని 2024 డిస్టిక్ సెలక్షన్ కమిటీ ఉపాధ్యాయుల రిక్రూమెంట్ ద్వారా వివిధ కేటగిరీలకు సంబంధించి 381 పోస్టులకు గాను నియామకము చేయవలసి ఉన్నది. కావున ఈ జిల్లాకు సంబంధించిన డీఎస్ఈ అభ్యర్థులకు తేదీ 01-10-2024 మంగళవారం రోజున ఉదయము10.00 గంటలకు మహబూబాబాద్ లోని స్థానిక ఫాతిమా హైస్కూల్లో 1:3 నిష్పత్తి ప్రకారం సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయబడుచున్నది. 1:3 నిష్పత్తి ప్రకారం వివిధ కేటగిరి సబ్జెక్టులలో స్కూల్ అసిస్టెంట్, ఎస్ జిటి ఎల్పీ హిందీ ఎల్పీ తెలుగు, పీఈటీలు మొదలగు వారికి డిఎస్సి హైద్రాబాద్ వారిచే, అభ్యర్థులకు వ్యక్తిగతంగా తమ చరవాణిలకు మెసేజ్ లు కానీ. మెయిల్స్ కానీ పంపబడుతాయి. ఈ మెసేజ్ గాని, మెయిల్ గాని వచ్చినవారు మాత్రమే సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకొనుటకు ఉదయము 10:00 నుండి సాయంత్రము 5 గంటల వరకు స్థానిక ఫాతిమా స్కూలు యందు కౌంటర్లు సిద్ధము చేయబడినవి, ఇట్టి సమాచారమును ఫోను ద్వారా మెసేజ్ రూపంలో స్వీకరించబడిన అభ్యర్థు లకు మాత్రమే వెరిఫికేషన్ చేయబడును. ఒకవేళ ఐదు గంటల వరకు వెరిఫికేషన్ కాకుండా మిగిలిన వారు మరుసటి రోజు వెరిఫికేషన్ చేయబడును ఈ ప్రక్రియ అక్టోబర్ ఒకటవ తారీఖు నుండి ఐదవ తారీఖు వరకు నిర్వహించబడునని జిల్లా విద్యాశాఖ అధికారి వి రాజేశ్వర్ తెలిపారు.

## రైతులు తలుచుకుంటే ప్రభుత్వాలే కూలిపోతాయి

### బీఆర్ఎస్‌ది అరాచక పాలనైతే..కాంగ్రెస్‌ది రాక్షస పాలన :అందెల శ్రీరాములు



**విశ్వంభర. మహేశ్వరం :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలని వెంటనే అమలు చేయాలి రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా తెలంగాణ భారతీయ జనతా పార్టీ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో చేపట్టిన 24 గంటల రైతు హామీల సాధన దీక్ష కార్యక్రమంలో భాగంగా రైతులకు మద్దతు తెలుపుతూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి రైతన్నలను మోసం చేసిందని అన్నారు ఒకే సంతకంతో 70 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని నాడు రేవంత్ రెడ్డి వరంగల్ రైతు డిక్లరేషన్ లో హామీ ఇచ్చి ఇప్పుడు కేవలం 22 లక్షల మందికి రుణమాఫీ చేసి రైతాంగాన్ని మోసం చేశారని రైతుల ఓట్లతో గద్దెనికి వాళ్లనే మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి, మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, బిజెపి సీనియర్ నాయకులు మంద పాండు, కిసాన్ మోర్చా నాయకులు బిజెపి బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## చింతపల్లిలో ఏసీబీ దాడులు



**విశ్వంభర,చింతపల్లి:** మండల కేంద్రంలో పశువైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న జి.జే.పౌల్ 6000 రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. గేదెలు తీసుకునేందుకు బ్యాంకు నుండి లోన్ పది లక్షల కోసం, హెల్త్ సర్టిఫికెట్ కోసం నసర్లపల్లి గ్రామానికి చెందిన ఒక రైతు వద్ద నుంచి 8 వేల రూపాయల లంచం డిమాండ్ చేయగా, 6000 రూపాయలకు ఒప్పందం కుదుర్చుకొని ఆ లంచం డబ్బులు పశు వైద్యాధికారి జి.జే.పౌల్ తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడుగా పట్టుబడ్డాడు. ఈ రైడ్ లో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎసిబి డిఎస్పీ జగదీశ్ చంద్ర, ఇన్స్పెక్టర్లు వెంకట్రావు, రామారావు పాల్గొన్నారు.

## ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యం

**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించిన ఇనుగాల పాపిరెడ్డి, ఆర్ ఎస్సై , జలాలుద్దిన్ ఏ ఆర్ ఎస్సై , పోరెడ్డి రాజిరెడ్డి, ఏ ఆర్ ఎస్సై, రాయభారపు శ్రీనివాసులు ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ లు సోమవారం పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాలులో ఎస్పీ కిరణ్ ఖరే ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహిం చారు. అనంతరం ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యమన్నారు. ఎన్నో సవాళ్లతో కూడుకుని వున్న పోలీస్ ఉద్యోగం సంపూర్ణంగా పూర్తి చేసి పదవి విరమణ పొందడం గొప్ప విషయమని పేర్కొన్నారు.. పదవీ విరమణ పొందుతున్న అధికారులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని అన్నారు. అనంతరం రిటైర్ అవుతున్న పోలీసు అధికారులను ఎస్పీ పూలమాలలువేసి, శాలువాతో సత్కరించి, బహుమతులు అందజేశారు.

## డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన



**విశ్వంభర, మెట్ పల్లి :** బస్సు డిపో అభివృద్ధి పథంలో నడపాలని ఉద్దేశంతో డిపో మేనేజర్ టి దేవరాజు సోమవారం రోజున సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు డైల్ యువర్ డి. ఎం. ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించారు. మెట్ పల్లి డిపో పరిధిలో గల ప్రయాణికులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తమ యెక్క సమస్యలను తెలపాలని కోరారు. ఇందులో 18 మందికి పైగా కాల్ చేసారు. పలువురు డిపో మేనేజర్ దేవరాజ్ ను ఇది ఒక మంచి కార్యక్రమం అని అభినందించారు.

## అసిస్టెంట్ సిటీ ప్లానర్ పదవి విరమణ



**విశ్వంభర, కూకట్పల్లి:** జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేసి పదవీవిరమణ చేసిన శ్రీధర్ గౌడ్‌ని గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసి యేషన్ సభ్యులు కలసి ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ తర్వాత వారి శేష జీవితాన్ని ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. కే.రాజారెడ్డి, వైస్ చైర్మన్ సమ్మెట ప్రసాద్, జనరల్ సెక్రెటరీ పురాణం విశ్వనాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ హజ్రత్, ప్రసాద్, కె.వి రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సుమ, రమణ, చక్రపాణి, వి.రామ్ కుమార్, కే.శంకర్ ఎసిపి శ్రీధర్ గౌడ్ పదవీవి రమణ ఘనంగా సత్కరించారు.

## మాయమాటలతో మూడు పెళ్లిళ్లు!

### మెదక్ మున్సిపల్ కమిషనర్ పై భార్య ఫిర్యాదు

**విశ్వంభర, హైదరాబాద్:** మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకిరామ్?పై ఆయన భార్య కళ్యాణి ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జానకిరామ్ మరో మహిళను పెళ్లి చేసుకున్నట్లు ఫిర్యాదులో తెలిపింది. భర్త పెళ్లి విషయం తెలుసుకున్న కళ్యాణి సోమవారం అతన్ని నిలదీసింది. దాంతో ఆమెను చంపుతానంటూ బలవంతంగా కారులో తీసుకొని వెళ్లడంతో కుటుంబసభ్యులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. వారిని మధ్యలో అడ్డుకున్న పోలీసులు హబ్సీగూడ వద్ద జానకిరామ్?ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఓయూ పోలీస్ స్టేషన్?లో కళ్యాణి కేసు నమోదు చేసింది.. మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ ఇప్పటి వరకు మూడు పెళ్లిళ్లు చేసుకున్నాడని పోలీసులకు తెలిపింది. దీంతో జానకిరామ్?తో పాటు మరో అమ్మాయిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## పంజాబ్ సీఎం మాన్‌కు అరుదైన వ్యాధి



**ఢిల్లీః** పంజాబ్ సీఎం భగవంత్ మాన్ అత్యంత అరుదైన 'లెప్టోస్పైరోసిస్' అనే బ్యాక్టీరియా వ్యాధి బారినపడ్డారు. కుక్కలు, ఎలుకలు మొదలైన వాటి విసర్జితాల నుంచి ఈ బ్యాక్టీరియా మనుషులకు సోకుతుందని, కలుషిత ఆహారం, నీటితో ఈ బ్యాక్టీరియా సీఎం భగవంత్ మాన్‌కు సోకినట్టు భావిస్తున్నామని న్యూఢిల్లీలోని సర్ గంగారామ్ దవాఖాన వైద్యులు తెలిపారు. ఈ వ్యాధి సోకిన వాళ్లలో అధికజ్వరంతో కూడిన ఒళ్లు నొప్పులు, తలనొప్పి, వాంతులు, డయేరి యా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. రెండు వారాల పాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకోవటంద్వారా ఈవ్యాధి తగ్గుతుందన్నారు.

## తమిళనాడులోని పలు పాఠశాలలకు బాంబు బెదిరింపులు



**చెన్నైః** దేశంలో బాంబు బెదిరింపులు సర్వసాధారణమైపోయాయి. ఇటీవలే కాలంలో పాఠశాలలు, విమానాశ్రయాలు, హోటల్స్‌కు వరుస బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్న విషయం తెలిసిందే. తాజాగా తమిళనాడులోని పలు విద్యాసంస్థలకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. మదురైలోని కేంద్రీయ విద్యాలయ, జీవన స్కూల్, వేలఅమ్మాల్ విద్యాలయాలకు సోమవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఆయా విద్యాసంస్థలకు గుర్తు తెలియని వ్యక్తులు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో అప్రమత్తమైన విద్యాసంస్థల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. రంగంలోకి దిగిన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో ఆయా పాఠశాలల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మెయిల్ ఆధారంగా బెదిరింపులకు పాల్పడిన వారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. బాంబు బెదిరింపుల వార్తతో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు.

## నేపాల్‌లో కొనసాగుతున్న వరద బీభత్సం..



**ఖాట్మాండ్ః** పొరుగు దేశం నేపాల్ లో వరద బీభత్సం కొనసాగుతోంది. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల కారణంగా తూర్పు, మధ్య నేపాల్‌లో ఆకస్మిక వరదలు పోటెత్తాయి. ఈ వరదలకు రాజధాని ఖాట్మండు సహా ఎనిమిది జిల్లాల్లో పెద్ద ఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం.. ఈ జల ప్రళయానికి దాదాపు 200 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 68 మంది గల్లంతవ్వగా.. వంద మందికిపైగా గాయపడ్డారు. ఇక ఈ వరదలకు భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. వెయ్యికిపైగా ఇళ్లు, రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. భాగమతి నది ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తోంది. దీంతో సమీపంలోని గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. దేశవ్యాప్తంగా 44 జిల్లాల్లో వరదలు బీభత్సం సృష్టించాయి. పలు చోట్ల కొండచరియలు విరిగిపడటం లాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ కారణంగా రోడ్లు ధ్వంసమవడంతో.. 39 జిల్లాల్లో రహదారులను అధికారులు పూర్తిగా మూసివేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలుచేపడుతున్నారు. దాదాపు 3 వేల మందికిపైగా భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇప్పటి వరకు వెయ్యి మంది వరకు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.


# మెరైన్ రఫేల్ ఒప్పందంలో ముందడుగు

■ తుది ధర సమర్పించిన ఫ్రాన్స్



**ఢిల్లీః** భారత నేవీ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ కోసం కొనుగోలు చేయతలపెట్టిన మెరైన్ రఫేల్స్ యుద్ధ విమానాల డీల్లో మరో అడుగు ముందుకుపడింది. ఫ్రాన్స్ వీటికి సంబంధించిన తుది ధరను భారత్కు సమర్పించింది. ఈసారి న్యూఢిల్లీ వీటి ధర విషయంలో కొంచెం బలంగా పట్టుబట్టడంతో చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రయోజనం కనిపించిందని ఓ ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొవాల్ పర్యటనకు కొద్దిగా ముందే ఈ వివరాలు వెలువడటం గమనార్హం. గత వారం ఇరు దేశాలకు చెందిన బృందాలు న్యూఢిల్లీలో చర్చలు జరిపాయి. రేపటి నుంచి భారత్-ఫ్రాన్స్ వ్యూహాత్మక చర్చలు పారిస్లో ప్రారంభం కానున్నాయి. వీటిలో ఎన్ఎస్ఏ అజిత్ డొవాల్ పాల్గొనున్నారు. భారత నౌకాదళం సరికొత్త విమాన వాహక నౌకనుపూర్తిస్థాయిలో వినియోగించుకొనేందుకు ఈ డీల్ చాలా ముఖ్యం. దీంతో తాజాగా గవర్నమెంట్ టు గవర్నమెంట్ విధానంలో యుద్ధ విమానాల కొనుగోళ్లకు చర్చలు జరుగుతున్నాయి. ఈ సరికొత్త విమానా ల్లో భారత్ అభివృద్ధి చేసిన ఉత్తమ్ రాడారు కూడా అనుసంధానించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు సుమారు 8 ఏళ్ల సమయం పడుతుందని.. అదే సమయంలో ఫ్రాన్స్కు చెల్లింపులు కూడా చేయాల్సివస్తుంది. దీంతో పాటు, దేశీయంగా తయారుచేసిన అస్త్ర, రుద్రం క్షిపణులను కూడా ఈ విమానాలకు ఇంటిగ్రేడ్ చేయాలని న్యూఢిల్లీ కోరుతోంది. దీంతోపాటు వాయుసేనకు అవసరమైన 40 డ్రాప్ ట్యాంక్ కొనుగోలు, స్వల్ప సంఖ్యలో వర్క్ స్టేషన్ల ఏర్పాటు వంటి అంశాలు కూడా ఈ ఒప్పంద చర్చల్లో ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

# జమ్ముకశ్మీర్‌లో కాంగ్రెస్ కూటమిదే గెలుపు : జైరామ్ రమేశ్



**ఢిల్లీః** జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ , కాంగ్రెస్ పార్టీ లతో కూడిన కూటమి ఘన విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి,సీనియర్ నాయకుడు జైరామ్ రమేశ్ ధీమా వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర తర్వాత జమ్ముకశ్మీర్‌లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు పెరిగిందన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత జమ్ముకశ్మీంర్‌కు ప్రత్యేక హోదా కోసం తాము కేంద్ర ప్రభుత్వంతో పోరాటం చేస్తామ న్నారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా నే తమప్రధాన డిమాండ్అని చెప్పారు. ఈ ఎన్నికల్లో పీడీపీతో ఎందుకు పొత్తు పెట్టుకోలేదన్న ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ.. పీడీపీ ఒడియా కూటమిలో భాగంగానే ఉందని, కానీ ఎన్నికల్లో పొత్తు కుదరలేదని తెలిపారు.దాంతో నేషనల్ కాన్ఫరెన్స్, తాము జట్టుగా పోటీచేశామని, ఎన్నికల తర్వాత ఏం జరుగుతుందో వేచిచూద్దామని జైరామ్ రమేశ్ అన్నారు. అవసరమైతే పీడీపీతో కూడా కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# ఒలింపిక్స్, పారాలింపిక్స్ స్టార్స్‌కు నీతా అంబానీ ప్రత్యేక విందు



**ముంబయిః** ఇటీవలే పారిస్ వేదికగా జరిగిన ఒలింపిక్స్ ?, పారాలింపిక్స్ లో భారత క్రీడాకారులు సత్తా చాటిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ సభ్యురాలు, రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్ పర్సన్ నీతా అంబానీ వారందరినీ ప్రత్యేకంగా సత్కరించారు. ముంబైలోని తన నివాసం ఆంటీలియా లో వారందరికీ ప్రత్యేక విందు ఇచ్చారు.'యునైటెడ్ ఇన్ ట్రయంఫ్' పేరుతో ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రత్యేక వేడుకలో ఒలింపిక్స్, పారాలింపిక్స్‌లో పాల్గొన్న 140 మంది క్రీడాకారులు, అథ్లెట్లు పాల్గొన్నారు. ఒలింపిక్స్‌లో డబుల్ మెడలిస్ట్ మను బాకర్, నీరజ్ చోప్రా, హాకీ స్టార్ గోల్‌కీపర్ శ్రీజేశ్ సహా పారాలింపిక్ విజేతలు సింగ్, మోనా అగర్వాల్ తదితరులు అంబానీ ఇచ్చిన ప్రత్యేక ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా భారత్ కీ షాన్ అంటూ ఛాంపియన్లను నీతా అంబానీ పరిచయం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను రిలయన్స్ ఫౌండేషన్ అధికారిక ఇన్‌స్టా పేజీలో పోస్టు చేశారు. ఈ వేడుకకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారాయి.

## ఘోర ప్రమాదం

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు

నలుగురు దుర్మరణం



నోయిడా ఉత్తరప్రదేశ్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లోడుతో వెళ్తున్న ఓ ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. నోయిడాలోని 10-11 సెక్టార్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం. దాంతో హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటన జరిగిన తీరును గమనించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

# కేబినెట్లో మాజీ ప్రత్యర్థికి చోటిచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు



**జెరూసలెం:** హెజ్బుల్లాతో యుద్ధం తీవ్రస్థాయిలో ఉన్న సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్లో తన మాజీ ప్రత్యర్థి గిడియాన్ సార్ కు చోటిచ్చారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని విస్తరిస్తూ ఆయనను మంత్రివర్గంలో చేర్చుకున్నారు. ఎలాంటి పోర్ట్‌ఫోలియో లేకపోయినా గిడియాన్ను సెక్యూరిటీ కేబినెట్లో కొనసాగేలా నెతన్యాహుతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దేశ హితం కోసమే ప్రత్యర్థులైన తాము తమ విభేదాలను పక్కన పెట్టినట్లు వారు పేర్కొన్నారు. అయితే హమాస్ హజ్ బొల్లా యుద్ధంలో ఈ సెక్యూరిటీ కేబినెట్ కీలక పాత్ర పోషిస్తుంది.

నెతన్యాహుకు మరో ప్రత్యర్థి అయిన రక్షణ మంత్రి యోవ్ గాలంట్ను సైతం ఇందులో భర్తీ చేయాలని గిడియాన్ కోరారు. కాగా దీనిపై ప్రధాని ఇంకా ఓ నిర్ణయం తీసుకోలేదు. గతంలో నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీలో గిడియాన్ కీలక పదవుల్లో పని చేశారు. ఆయనపై అవినీతి ఆరోపణలు రావడం, ప్రధాని వాటిని సమర్థించడంతో.. కోపంతో నాలుగేళ్లక్రితం పార్టీని విడిచిపెట్టారు. అనంతరం ఆయన ఓ పార్టీని స్థాపించి, ప్రజల మద్దతు కూడగట్టుకున్నారు.

నెతన్యాహు, గాడియాన్ ప్రత్యర్థులే అయినా.. వీరిరువురూ పాలస్తీనా రాజ్య స్థాపనను తీవ్రంగా వ్యతిరేకిస్తారు. అంతేకాకుండా ఇజ్రాయెల్ శత్రువులను ఎలాగైనా అంతం చేయాలనే భావజాలంతో ఉంటారు. ఇటీవల గిడియాన్ మాట్లాడుతూ హమాస్ను పూర్తిగా నాశనం చేసేవరకు ఇజ్రాయెల్ పోరాటం ఆపకూడదన్నారు. హెజాబొల్లాకు మద్దతిస్తున్న ఇరాన్ పైన కూడా కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం హెజ్బొల్లాతో యుద్ధం జరుగుతున్న సమయంలో అనేక కీలక రాజకీయ ప్రక్రియలు చేపట్టడం, సైన్యంలోకి అల్ట్రా-ఆర్థోడాక్స్ వ్యక్తులను తీసుకోవడం, బడ్జెట్ను రూపొందించడం వంటి విషయాల్లో గిడియాన్ నెతన్యాహుకు సహాయం చేస్తారని అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. యుద్ధం నేపథ్యంలో పలు విపక్ష పార్టీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడుతుండటంతో పార్టీని బలోపేతం చేసుకోవడానికి ప్రధాని ఈ నిర్ణయం తీసుకున్నారు.అయితే ఈ ఒప్పందంలో భాగంగా 120 సీట్లున్న పార్లమెంట్లో నెతన్యాహు మెజారిటీ కూటమిని 68 సీట్లకు విస్తరించారు. దీంతో ఎప్పటికైనా ప్రధాని కావాలని ఎదురుచూస్తున్న గిడియాన్కు తన రాజకీయ జీవితాన్ని పునరుద్ధరించుకునే అవకాశాన్ని కల్పించినట్లైంది.

# మ్యాన్ ఈటర్ పాంథర్ వరుస దాడులు

■11 రోజుల్లో ఏడుగురు మృతి



ఉదయపూర్: రాజస్థాన్ ఉదయ్‌పూర్ లో మ్యాన్ ఈటర్ పాంథర్ వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. దీని దాడిలో ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోగా.. తాజాగా ఓ ఆలయ పూజారి ఈ పాంథర్ దాడిలో మృతి చెందాడు.వివరాల్లోకి వెళితే.. గోంగుడా గ్రామంలో గత కొంత కాలంగా మ్యాన్ ఈటర్ పాంథర్ వరుస దాడులకు పాల్పడుతోంది. ఆదివారం రాత్రి కూడా ఓ ఆలయ పూజారిపై దాడి చేసింది. పూజారి మహరాజ్ విష్ణు గిరి ఆదివారం రాత్రి ఆలయంలో నిద్రిస్తున్న సమయంలో దాడి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. తాజా దాడితో గత 11 రోజుల్లో ఇది ఏడో మరణం అని వెల్లడించారు.మరోవైపు పాంథర్ వరుస దాడులతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన అటవీ శాఖ అధికారులు స్థానిక పోలీసుల సాయంతో ఆ ప్రాంతంలో ఉచ్చులు బిగించారు. మరోవైపు పాంథర్ వరుస దాడుల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా అనేక పాఠశాలలను అధికారులు మూసివేయాలని ఆదేశించారు. ప్రజలు సైతం సాయంత్రం వేళల్లో తమ ఇళ్లను వదిలి వెళ్లొద్దని, గుంపులుగా మాత్రమే బయటకు వెళ్లాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే.. తమ వెంట ఆయుధాలుగా కర్రలు లేదా ఇతర వస్తువులను తీసుకెళ్లాలని సూచించారు.

ఇదిలా ఉండగా.. ఇప్పటి వరకూ జరిగిన అన్ని ఘటనల్లో ఒకే పాంథర్ దాడి చేసిందా లేక గుంపుగా ఉన్నాయా అన్నదానిపై స్పష్టత లేదు. అయితే, అన్ని సందర్భాల్లో జంతువు కదలికలు, దాడి స్వభావం ఒకే విధంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ మ్యాన్ ఈటర్ పాంథర్‌ను బంధించేందుకు అటవీ అధికారులు చర్యలు చేపట్టారు.

# బ్లాక్ టికెట్ల వ్యవహారంలో బుక్ మై షో సీఈవోకు మరోసారి సమన్లు

**ముంబయిః** బుక్ మై షో సీఈవో, సహ వ్యవస్థాపకుడుఅశీష్ హేమరాజని చిక్కుల్లో పడ్డారు. బ్రిటిష్ రాక్ బ్యాండ్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి బ్లాక్ టికెట్లు విక్రయించినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ఆయకు ముంబై పోలీసులు తాజాగా మరోసారి సమన్లు జారీ చేశారు.టికెట్ల వ్యవహారంపై వివరణ కోరుతూ ముంబై పోలీసు ఎనకామిక్ అఫెన్సెస్ వింగ్ శనివారం అశీష్‌తో పాటు కంపెనీ టెక్నికల్ హెడ్‌కు సమన్లు పంపిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అయితే, తాజాగా మరోసారి సమన్లు పంపారు. విచారణ అధికారి ఎదుటహాజరు కావాలనిఅందులో పేర్కొన్నారు. అయితే వీరిద్దరూ పోలీసులతో టచ్‌లో లేరని సమాచారం.కాగా, వచ్చే ఏడాది జనవరి 19 నుంచి 21 వరకు నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో కోల్డ్ ప్లే కార్యక్రమం జరగనుంది. బ్రిటిష్ రాక్‌బ్యాండ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కన్సర్ట్‌కు అనూహ్య స్పందన వస్తోంది. దీంతో బ్లాక్‌లో ఈ ప్రోగ్రామ్ టికెట్ల విక్రయం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. న్యాయవాది అమిత్ వ్యాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.2,500 ఉండే కోల్డ్‌ప్లే టికెట్ ధరను థర్డ్‌పార్టీ ద్వారా ఏకంగా రూ.3 లక్షలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అభిమానులను మోసం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేయాలని కోరారు. న్యాయవాది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. ఇందులో భాగంగానే బుక్‌మైషో కంపెనీ సీఈవోతోపాటు కంపెనీ టెక్నికల్ హెడ్‌కు సమన్లు పంపారు. మరోవైపు ఈ ఆరోపణలపై బుక్‌మై షో వివరణ ఇచ్చింది. అనధికారికంగా టికెట్లు విక్రయించిన వారితో తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. కోల్డ్ ప్లే కన్సర్ట్ కోసం సెప్టెంబర్ 22న బుక్‌మైషోలో టికెట్ విక్రయాలు ప్రారంభమైనట్లు తెలిపింది. ఈ సంగీత కచేరీకి అనూహ్య స్పందన వచ్చినట్లు పేర్కొంది. బుకింగ్స్ ప్రారంభమైన రోజే ఏకంగా 1.2



మిలియన్ల మంది టికెట్ బుకింగ్ కోసం లాగిన్ అయినట్లు వివరించింది. దీంతో ప్రతి అభిమానికీ టికెట్లు అందాలనే ఉద్దేశంతో ఒక్కో వినియోగదారుడు 4 టికెట్లు మాత్రమే కొనుగోలు చేసేందుకు పరిమితి విధించినట్లు వివరణ ఇచ్చింది.

# ఇళ్ల కూల్చివేతలపై అస్సాం ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

**ఢిల్లీ:** సుప్రీంకోర్టు ఆదేశాలను అస్సాం ప్రభుత్వం ఉల్లంఘించిందంటూ దాఖలైన పిటిషన్పై ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ అయ్యాయి. అక్కడి కామరూప్ మెట్రో డిస్ట్రిక్ట్ పరిధిలోని సోనపుర్ మువాజ ప్రాంతా నికి చెందిన 47 మంది పౌరులు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బీఆర్ గవయ్,జస్టిస్ కేవీ విశ్వనాథన్ బెంచ్ పరిశీలించింది. దీనిపై మూడు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని సూచించింది. ప్రస్తుతా నికి అక్కడ కూల్చివేతలను ఆపేయాలంటూ స్టేటస్ కో కొనసాగించాలని పేర్కొంది.సుప్రీం ఆదేశాలు లేకుండా దేశంలో ఎక్కడా కూల్చివేతలు చేపట్టొద్దనిసెప్టెంబర్ 17న న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను అస్సాం ప్రభుత్వం ఉల్లంఘించిందని న్యాయవాది హౌజెఫా అహ్మది పేర్కొన్నారు. సోనపుర్లో అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా మార్కింగ్ చేసి కూల్చివేతలు మొదలు పెట్టినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఇదే అంశంపై గువహటి హైకోర్టులో అడ్వొకేట్ జనరల్ ఇచ్చిన ప్రమాణ పత్రాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. దీనిలో సదరు పిటిషన్లపై విచారణ పూర్తయ్యేవరకు కూల్చబోమని పేర్కొన్నారని, అయినా కూల్చివేతలు జరుగుతున్నట్లు వెల్లడించారు. సోనపుర్ లోని కచుతొలి పథార్ గ్రామానికి చెందిన 47 కుటుంబాలకు చెందిన ఇళ్లను కూల్చివేయాలని నిశ్చయించారు. ఇక్కడి వారు అసలైన భూ యజమానుల నుంచి కొనుగో లు చేసి..పవర్ ఆఫ్ అటార్నీలు పొంది అక్కడ జీవిస్తున్నట్లు అధి కారులకు చెప్పారు. మరోవైపు ప్రభుత్వ అధికారులు మాత్రం ఇక్కడ ఎటువంటి నోటీ సులు ఇవ్వకుండానే కూల్చివేతలకు దిగారననేది



బాధితుల ప్రధాన ఆరోపణ.రోడ్లు, ఫుట్పాత్లు, రైల్వే లైన్లు, వాటర్బాడీస్లో ఉన్న నిర్మాణాలను తప్పితే.. మిగిలిన వాటిని కూల్చే ముందు న్యాయస్థానాల అనుమతి తప్పనిసరి అంటూ సెప్టెంబర్ 17న కోర్టు చెప్పింది.అయినా తమఇళ్లను కూల్చడంపై బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# లింగ మార్పిడికి మానసిక ఆరోగ్య ధృవీకరణ తప్పనిసరి

▪ కేంద్రం కొత్త నిబంధనలు

**న్యూఢిల్లీ:** ఇకపై ఇష్టారీతిన లింగమార్పిడి చేయించుకోవడం కుదరదు. లింగమార్పిడి, ప్రీ-హార్మోనల్ థెరపీకి ముందు మానసిక ఆరోగ్య నిపుణుల నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పొందాల్సి ఉంటుంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ) విడుదల చేసింది. ఎవరైనా ట్రాన్స్‌జెండర్ 18 ఏండ్ల లోపు లింగ నిర్ధారిత సర్జరీ చేయించు కోవాల్సి ఉంటుంది. అంతకుముందు ఏడాదిపాటు ఎండ్రోక్రైన్ చికిత్సపై స్థిరంగా ఉన్నట్టు సర్టిఫికెట్ తీసుకోవాలి.ఈ మేరకు గైనకాలజిస్టులు, సైకాలజీ/సైకియాట్రిస్టులకు కూడా కొన్ని సూచలను చేసింది. సర్జరీ తర్వాత ఆ వ్యక్తి ఎలా ఉండాలని కోరుకుంటున్నాడు, పేషెంట్ పేరు, సర్వనామం పరంగా ఎలా సంబోధించాలనుకుంటున్నాడు వంటివి అర్థం చేసుకోవాల్సి ఉంటుం దని గైనకాలజిస్టులకు సూచించింది. అలాగే, ఎండోక్రినాలజీ పరీక్షకు ముందు సైకియాట్రిస్ట్ నుంచి ఒక సర్టిఫికెట్, లింగ నిర్ధారణ సర్జరీకి ముందు క్లినికల్ సైకాలజిస్ట్/సైకియాట్రిస్ట్ నుంచి మరో సర్టిఫికెట్‌ను ట్రాన్స్‌జెండర్లు సమర్పించాల్సి ఉంటుంది. వీరు పేషెంట్ మానసిక ఆరోగ్యాన్ని పరీక్షించి సర్టిఫికెట్ అందజేస్తారు.

# దేవుడినైనా రాజకీయాలకు దూరంగా ఉంచాలి

- తిరుమల లడ్డూ ప్రసాదంపై సుప్రీం కీలక వ్యాఖ్యలు..
- అక్టోబర్ 3కు విచారణ వాయిదా
- మూడోరోజు కొనసాగిన సిట్ విచారణ
- తిరుమలలో లడ్డూ గోదాములను పరిశీలించిన సిట్ బృందం
- లడ్డూ కల్తీఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: విశ్వ హిందూ పరిషత్



**దిల్లీ:** తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తిరుమల లడ్డూ కల్తీ ఘటనపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఇది కోట్ల మంది భక్తుల మనోభావాలతో కూడిన వ్యవహారమని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. జూన్, జులైలో ఎన్ని నెయ్యి ట్యాంకర్లు వాడారనే వివరాలను టీటీడీ తరపు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. విచారణ జరగకముందే కల్తీ జరిగిందని ప్రకటన చేయడం భక్తుల మనోభావాలు దెబ్బతీస్తుందని పేర్కొంది. ఈ సందర్భంగా ఇరువాదనలు విన్న కోర్టు కనీసం దేవుడినైనా రాజకీయాల నుంచి దూరం పెట్టాలని సూచించింది. లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారనేదానికి ఆధారాలేంటి? రెండో అభిప్రాయం తీసుకోకుండా సీఎం మీడియాతో మాట్లాడారు" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దాదాపు గంటపాటు సాగిన వాదనలు విన్న కోర్టు తదుపరి విచారణను అక్టోబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని ఏపీ ప్రభుత్వం చేసిన ఆరోపణల మేరకు వైసీపీ రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి , బీజేపీ నాయకుడు , న్యాయవాది సుబ్రహ్మణ్య స్వామితో సహ పలువురు న్యాయవాదులు సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్ పై సోమవారం విచారణ జరిగింది. ఏపీ ప్రభుత్వం తరఫున సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. లడ్డూలో నాణ్యత లోపం ఉందని భక్తులు ఫిర్యాదు చేయడంతో టీటీడీ అధికారులు తనిఖీలు నిర్వహించి నెయ్యిని సరఫరా చేస్తున్న ఏఆర్ ఫుడ్స్ ట్యాంకర్లను పరిశీలించి టెస్టింగ్‌కు పంపించారని వివరించారు. అక్కడి నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా కల్తీ జరిగిందని గుర్తించారని తెలిపారు. స్పందించిన ధర్మాసనం ఏదైనా అనుమానం ఉన్నప్పుడు సెకండ్ ఒపీనియన్ ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. నెయ్యి కల్తీ జరిగినట్లు గుర్తించిన తర్వాత , తయారైన లడ్డూలను టెస్టింగుకు పంపారా, లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారించారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. కల్తీ నెయ్యితో లడ్డూలు తయారు చేసినట్లు ఆధారాలు లేవని స్పష్టం చేశారు. మైసూర్, గజియాబాద్ ల్యాబ్‌ల నుంచి ఎందుకు సెకండ్ ఒపీనియన్ తీసుకోలేదుని, నెయ్యి కల్తీ జరిగినట్లు సాక్ష్యం చూపించాలని ఆదేశించారు.

## తిరుమలలో లడ్డూ గోదాములను పరిశీలించిన సిట్ బృందం



**తిరుమల :** తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది. మూడో రోజు దర్యాప్తులో భాగంగా తిరుమల లోని గోదాములు, పరిశోధనశాలలో పర్యటించారు. గోదాములకు వచ్చిన ట్యాంకర్ల నుంచి నెయ్యి నమూనాలు సేకరించారు. ల్యాబ్‌లో నాణ్యత పరీక్షల యంత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటిని ప్రయోగశాలకు తరలించి.. నెయ్యిని ఏ విధంగా పరీక్షస్తారన్న దానిపై లోతుగా దర్యాప్తు చేయనున్నారు. అక్కడి అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించనున్నారు. లడ్డూ తయారీలో పాల్గొం టున్న ఉద్యోగులను కూడా సిట్ అధికారులు విచారించనున్నారు. ఈ సందర్భంగా గోదాముల్లో ముడిసరుకుల నాణ్యతను పరిశీలించారు. పిండి మర ప్రయోగశాలను సిట్ సభ్యులు పరిశీలించారు. శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి అంశంపై లోతైన విచారణ చేస్తామని సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు . తిరుపతి తూర్పు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు సిట్‌కు బదిలీ అయ్యిందని వెల్లడించారు. నెయ్యి సరఫరా చేసిన ఏఆర్ డెయిరీపై విచారణ జరుపుతామని పేర్కొన్నారు. కల్తీ నెయ్యికి బాధ్యులైన అందరినీ విచారిస్తామని చెప్పారు. నివేదిక సమర్పించడానికి ఎలాంటి కాలపరిమితి లేదని అన్నారు. సిట్ బృందంలో డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అద నపు ఎస్పీ వెంకటరావు నేతృత్వంలో దర్యాప్తును కొన సాగిస్తున్నారు. శనివారం తిరుమలకు చేరుకున్న సిట్ సభ్యులు శ్రీవారిని దర్శించుకున్న అనంతరం లడ్డూలను తయారి చేసే పోటును సందర్శించారు. అనంతరం టీటీడీ ఈవో శ్యామలరావు భేటీ అయి వివరాలు తీసుకున్నారు.

## లడ్డూ కల్తీ ఘటనలో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి





**గుంటూరు:** తిరుమల లడ్డూ అపవిత్రతకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో విశ్వ హిందూ పరిషత్ సభ్యులు ఫిర్యాదు చేశారు. తితిదే, ఇతర పుణ్యక్షేత్రాల్లో విధుల్లో ఉన్న అన్య మతస్థులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలోని అనేక దేవాలయాలపై దాడులు జరిగాయని తెలిపారు. దేవాలయాల ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలన్నారు. కోట్లాది మంది భక్తులు, హిందువుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. దేవాలయాల నిర్వహణ బాధ్యతను తమకు అప్పగించాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు డిమాండ్ చేశారు.

## సచ్చిదానంద మూర్తి భారతీయ తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**విశ్వంభర, గుంటూరు :** భారతీయతత్వ శాస్త్రంలో లౌకిక, అలౌకిక అంశాలతో పాటు... కాస్మాలజీ, మెటా ఫిజిక్స్ వంటి ఆధునిక శాస్త్రాలు కూడా ఉన్నాయని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. గుంటూరు జిల్లా నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సచ్చిదానంద మూర్తి శత జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోస్టల్ శాఖ విడుదల చేసిన పోస్టల్ కవర్ను ఆవిష్కరించారు. అనంతరం మాటాడుతూ.. చైతన్యం, జ్ఞాన సముపార్జన అంశాల్లో భారత్ ప్రపంచంలోని చాలా దేశాల కంటే ముందంజలో ఉందన్నారు. ఆచార్య నాగార్జునుడు, ఆది శంకరాచార్యులు, బుద్ధుడు, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, వేమన వంటి వారిని భారతీయతత్వానికి మూలపురుషులుగా అభివర్ణించారు. తర్వాత కాలంలో జిడ్డు కృష్ణమూర్తి, సర్వేపల్లి రాధాకృష్ణన్తోపాటు కొత్త సచ్చిదానంద మూర్తి భారత తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. మన ఉపనిషత్తుల్లో ఎన్నో మంచి అంశాలు ఉన్నాయన్నారు. భారతీయ మూలాల్లోకి వెళ్లి మన తత్వశాస్త్రాన్ని నేటి తరానికి అందించిన మహనీయుడు సచ్చిదానంద మూర్తి అని, ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, యూనివర్శిటి ఉపకులపతి గంగాధరరావుతోపాటు అధికారులు పాల్గొన్నారు.

## మరోమారు ప్రభుత్వానికి లేఖ రాయాలని 'అప్సా' నిర్ణయం

**విశ్వంభర, అమరావతి :** సచివాలయ ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు వ్యవహారంపై మరోమారు ప్రభుత్వానికి లేఖ రాయాలని అప్సా నిర్ణయించింది. అప్సా జనరల్ బాడీ సమావేశం తర్వాత రద్దు నిర్ణయాన్ని పునః పరిశీలించాల్సిందిగా కోరాలని నిర్ణయించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దుపై ఇటీవల సాధారణ పరిపాలన శాఖ షోకాజ్ నోటీసు జారీ చేసింది. సీఎస్ నుం= సీఎం వద్దకు చేరిన సచివాలయ ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు ఫైల్, అప్సా రద్దు అంశంపై రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సచివాలయ ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు కాకుండా చూసేందుకు అప్సా ప్రతినిధులు నానా అవస్థలు పడుతున్నారు. దీనిపై ఇటీవలే సంఘం నేతలు ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. రద్దు నుంచి తప్పించుకోవాలంటే ప్రస్తుతం ఉన్న వాళ్లు రాజీనామా చేయాలనే అంశంపై ఈసీ సమావేశంలో చర్చించారు. అప్సా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి సహా ఒకరిద్దరు. రాజీనామా చేయడానికి అంగీకరించారు. ఉపాధ్యక్షులు ఎవరైనా ముందుకు వస్తే అప్సా అధ్యక్ష పదవి నుంచి తప్పుకోడానికి సిద్ధమని వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. కార్యవర్గంలో సభ్యుల రాజీనామాకు వెంకట్రామిరెడ్డి ససేమిరా అంటున్నారు

## దర్యాప్తు, విచారణ సంస్థలతో సీఎం చంద్రబాబు భేటీ



**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్లోని దర్యాప్తు, విచారణ సంస్థలతో సచివాలయం లో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పలు కేసు ల విచారణ, వాటి దర్యాప్తునకు సంబంధిం చిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఫైబర్ నెట్, మదనపల్లెలో ఫైళ్ల దగ్ధం, ఇసుక దోపిడీకి సంబంధించిన కేసులపై ఆరా తీశారు. మదనపల్లె ఫైల్స్ దగ్ధం కేసు పై సీఐడీ విచారణ జరుపుతోంది. దీనికి సంబంధించి రాష్ట్రంలో చేపట్టిన చర్యలతో పాటు కేసు పురోగతిపై చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గతంలో జరిగిన ఇసుక దోపిడీపైనా విచారణ జరు గుతోంది. దీనిపైనా సీఎం వాకబు చేశారు. మద్యం కుంభకోణంపైనా సంబంధిత అధికారులను చంద్రబాబు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ భేటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, విజిలెన్స్ డీజీ, సీఐడీ చీఫ్ హాజరయ్యారు.

## పవన్ కల్యాణ్ మాటలను సమర్థిస్తున్నా



**విశ్వంభర,అమరావతి:** హిందూ ధర్మం ప్రమాదంలో ఉందనడానికి లడ్డూ అంశం క్లైమాక్స్ లాంటిదని జనసేన జాతీయ కార్యదర్శి నాగబాబు అన్నారు. సనాతన ధర్మం బతకడం నేర్పించిందని, దానికి అన్యాయం జరుగుతోందనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడారని తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " పవన్ కల్యాణ్ మాటలను పూర్తిగా సమర్థిస్తున్నా. హిందూ దేవాలయాలు, ధార్మిక మండళ్లు హిందువులే నిర్వహించాలి. ప్రభుత్వాల నిర్ణయాలు కోట్లాది మంది హిందువులపై ప్రభావం చూపుతున్నాయనేదే పవన్ కల్యాణ్ బాధ. అన్ని మతాలతో కలిసి ఉండే వ్యక్తి పవన్ కల్యాణ్. హిందూ ధర్మ రక్షణ మండలి ఏర్పాటు చేయాల్సిన అవసరముంది." అని అన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, దోషులెవరున్నా బయటకు వస్తారని తెలిపారు. వైకాపా నాయకులు చేస్తున్న విమర్శలకు సమాధానాలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు.

## కాదంబరి జెత్వానీ వ్యవహారంలో కొత్త ట్విస్ట్..

**విశ్వంభర, విజయవాడ:** ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. జెత్వానీ ఐఫోన్లను తెరిపించేందుకు ఆమె సన్నిహితుడిపై మరో తప్పుడు కేసు పెట్టినట్లుగా తెలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన కాదంబరి జత్వానీ, ఆమె తల్లిదండ్రులను ముంబై నుంచి తీసుచ్చిన తర్వాత 4వ తేదీన విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. దీంతో 10 నుంచి 14వ తేదీ వరకు పోలీసు కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. కాదంబరి జెత్వానీని అరెస్టు చేసిన సమయంలో ఆమెకు సంబంధించిన ఐదు ఐఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఉన్న ఆధారాలను తుడిచివేయడానికి పాస్ వర్డ్ లు చెప్పాలని ఆమెపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చారు. అయితే ఆమె ఆ వివరాలు వెల్లడించలేదు. ఎంత ఒత్తిడి చేసినా ఆమె పాస్‌వర్డ్‌లు చెప్పడం లేదన్న విషయాన్ని కుక్కల విద్యాసాగర్‌కు చేరవేశారు. అప్పుడు కాదంబరి జెత్వానీకి ఢిల్లీకి చెందిన అమిత్ సింగ్ అనే వ్యక్తితో మంచి పరిచయాలు ఉన్నాయని.. ఆయన్ను తీసుకొస్తే ఆటోమేటిగ్గా అన్ని వివరాలు చెబుతుందని పోలీసులకు కుక్కల విద్యాసాగర్ సలహా ఇచ్చాడు. దీంతో ఎలాంటి ఆధారం లేకుండా అమిత్ సింగ్‌ను ఢిల్లీ నుంచి తీసుకొస్తే వివాదం రేగుతుందని భావించి పోలీసులు మరో స్కెచ్ వేశారు. ఇందులో భాగంగా ఈ నెల 11న బెజవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలో ఉన్న ఒక స్పా కేంద్రంలో సోదాలు చేశారు. అక్కడ వ్యభిచారం జరుగుతోందంటూ మణిపూర్‌కు చెందిన కొందరుయువతులపై కేసు నమోదు చేశారు. అందులో స్పా సెంటర్ నిర్వాహకురాలు తమాంగ్(మణిపూర్)ను ఏ 1గా చేర్చారు. విటుడిగా పేర్కొంటూ ఏ 2గా అమిత్ సింగ్‌ను ఇరికించారు. అతను ఢిల్లీ నుంచి ఇక్కడకు మహిళలను సరఫరా చేస్తున్నారని అభియోగాలు నమోదు చేశారు. ఈ తప్పుడు కేసును అడ్డుపెట్టుకుని అమిత్‌ను అరెస్టు చేసేందుకు ఆఘమేఘాలపై నలుగురు సభ్యు లతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశారు. వారు ఢిల్లీ వెళ్లేందుకు సీపీ కార్యాలయం నుంచే టికెట్లను బుక్ చేశారు. కానీ ఢిల్లీ వెళ్లిన తర్వాత అమిత్ సింగ్ ఆచూకీ దొరక్కపోవడంతో వెనక్కి తిరిగొచ్చారు. ఈలోగా కాదంబరీ జెత్వానీ, ఆమె తల్లిదండ్రుల పోలీసు కస్టడీ ముగిసింది. దీంతో ఆమె ఫోన్లను తెరిపించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

## అక్టోబర్ 15 నుంచి ఇసుక రీచ్‌లు ప్రారంభం: మంత్రి కొల్లు

**విశ్వంభర, విజయవాడ :** అక్టోబర్ 15 నుంచి పూర్తి స్థాయిలో ఇసుక అందుబాటులో ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. వైకాపా అధినేత జగన్ నిర్వాకంతోనే ఇసుక తవ్వకాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. పేదలందరికీ ఉచితంగా ఇసుక అందించి తీరతామని, త్వరలోనే ఇసుక సమస్యలు పరిష్కారమవుతాయని మంత్రి తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో జరిగిన అరాచకాల్లో దెబ్బతిన్న వ్యవస్థలన్నింటినీ చక్కదిద్దుతున్నామన్నారు. జగన్ ఇసుకను ఆదాయ వనరుగా భావిస్తే.. తాము మాత్రం ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

వర్షాకాలంలో వరదల దృష్ట్యా ఇసుక తవ్వకూడదనే ఎన్జీటీ ఆదేశాల మేరకు రీచుల్ని నిలిపివేశామన్నారు. అక్టోబర్ 15 నుంచి ఇసుక రీచుల్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. బోట్ మెన్ సొసైటీలు, పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలను కూడా చేపడతా మన్నారు. దూర ప్రాంతాలకు రవాణా ఛార్జీలు అధికం అవుతున్నాయనే సమస్యనూ పరిష్కరిస్తామన్నారు.



## జగన్‌మతం మానవత్వం కాదు.. కర్కషత్వం: ఏపీ మంత్రి అనగాని



**విశ్వంభర, అమరావతి:** దేశాన్ని, మతాన్ని కించపరిచేలా మాజీ సీఎం వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో 100 రోజుల పాలన, అభివృద్ధి సంక్షేమాలు పేరిట ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి వీక్షించారు. అనంతరం మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ.. భక్తుల మనోభావాలు గౌరవించి జగన్‌ను డిక్లరేషన్ ఇవ్వమంటే, హిందూయిజంపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. తన మతం మానవత్వం అని చెప్పుకుంటున్న జగన్‌ది కరత్వమని అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. కల్తీ లడ్డూ వ్యవహారంలో జరిగిన తప్పు ఒప్పుకోలేక, క్షమాపణ చెప్పలేక వంకర మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. త్వరలోనే రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తామని అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రీసర్వే సమస్యల పరిష్కారంపై మళ్లీ దృష్టి సారిస్తున్నామని చెప్పారు. రెవెన్యూ సిబ్బంది వరద నష్టంలో నిమగ్నమైనందున రీసర్వే సమస్యల పరిష్కారానికి కొంత గ్యాప్ వచ్చిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనపై సర్వత్రా చర్చ జరుగుతోందని అన్నారు.

## పట్టభద్రుల ఓటర్ల నమోదుకు ఈసీ నోటిఫికేషన్



**విశ్వంభర, అమరావతి:** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజవర్గ పరిధిలో ఓటర్ల నమోదుకుఎన్నికల సంఘం (ఈసీ) నోటిఫికేషన్ జారీ చేసింది. అక్టోబరు 1 నుంచి నవంబరు 6 వరకు ఈ జిల్లాల పరిధిలో పట్టభద్రులైన ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఫాం-18 ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఈసీ సూచించింది. నవంబర్ 23న ఓటర్ల జాబితా ముసాయిదాను ప్రకటించనున్నారు. డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరించి.. అదే నెల 30న తుది జాబితాను వెల్లడించనున్నారు. ఇప్పటికేఉమ్మడి తూర్పు. పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదుకే ఈసీ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.



# అక్కడ టెస్టులు నిలిపివేయాలి

**బీసీసీఐ కొత్త కార్యదర్శికి పాక్ మాజీ ఆటగాడు బసిత్ అలీ సూచన**

**కాన్పూర్ :** భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండో టెస్టు మ్యాచ్ జరుగుతున్న కాన్పూర్ స్టేడియం నిర్వహణపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వర్షం కారణంగా ఒక్క బంతి పడకుండా రెండు రోజుల ఆట రద్దయిన విషయం తెలిసిందే. ఈ స్టేడియంపై తాజాగా పాక్ మాజీ ఆటగాడు బసిత్ అలీ స్పందించాడు. భవిష్యత్లో ఇక్కడ టెస్టులు నిర్వహించవద్దని సూచించారు.భారత్, బంగ్లా మ్యాచ్ డ్రాగా ముగిస్తే.. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ లో ఆతిథ్య జట్టు స్టాండింగ్స్పై ఇది పెద్ద ప్రభావం చూపిస్తుందని బసిత్ అలీ పేర్కొన్నాడు. వర్షం తర్వాత పరిస్థితులు మెరుగుపడ్డా మైదానాన్ని ఆటకు సిద్ధం చేయడంలో స్టేడియం నిర్వహకులు విఫలమయ్యారని విమర్శించాడు. 'వర్షం ఆగిపోయిన తర్వాత మైదానాన్ని ఆటకు సిద్ధం చేయడంలో సిబ్బంది విఫలమయ్యారు. ఔట్ఫీల్డ్ ఇంకా తడిగా ఉందంటే.. కవర్ల సరిగ్గా లేవని అర్థం. జైషా తర్వాత బీసీసీఐ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టే వారు కాన్పూర్లో టెస్టు మ్యాచ్లను నిలిపివేయాలి" అని పాక్ మాజీ క్రికెటర్ కోరాడు.భారత్ బంగ్లాదేశ్ రెండో టెస్టు తొలిరోజు 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం కాగా.. రెండు, మూడు రోజుల ఆట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. రెండోరోజు వర్షం కారణంగా రద్దైంది. మూడో రోజు వర్షం లేకపోయినా మైదానం చిత్తడిగా ఉండటంతో ఒక్క బంతి కూడా పడకుండా రద్దవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ప్రస్తుతం నాలుగో రోజు ఆట కొనసాగుతోంది.

# విరాట్ కోహ్లి@27,000 పరుగులు

**సచిన్ తర్వాత రెండో ఆటగాడిగా రికార్డు**



**దిల్లీ:** టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి మరో అరుదైన రికార్డు సాధించాడు. బంగ్లాదేశ్తో జరుగుతున్న రెండో టెస్టులో 47 పరుగులు చేసిన కోహ్లి అంతర్జాతీయ క్రికెట్లో 27,000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. సచిన్ తెందూల్కర్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారత క్రికెటర్గా నిలిచాడు. ఓవరాల్గా ఈ ఫీట్ సాధించిన నాలుగో బ్యాటర్ కోహ్లి. అతని కంటే ముందు సచిన్ (34, 357), కుమార సంగక్కర (28,016), రికీ పాంటింగ్ (27,483) ఉన్నారు. కోహ్లి ప్రస్తుతం (27,012) పరుగులతో ఉన్నాడు. అతడు ఇప్పటివరకు టెస్టుల్లో 8918, వన్డేల్లో 13906,టీ20ల్లో 4188 రన్స్ చేశాడు. అయితే, వేగంగా 27,000 పరుగులు మైలురాయిని అందుకున్న వారి జాబితాలో కోహ్లి ముందున్నాడు. సచిన్ 623 ఇన్నింగ్స్ ల్లో ఈ ఫీట్ సాధించగా.. కోహ్లి 594 ఇన్నింగ్స్ ల్లోనే 27 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు.

# డబ్ల్యూటీసీలో జైస్వాల్ రికార్డు..



**కాన్పూర్:** బంగ్లాదేశ్తో జరుగుతున్న రెండో టెస్టులో యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ 72 పరుగులు చేశాడు. ఈ క్రమంలోనే భారత్ తరపున ఓ ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా జైస్వాల్ రికార్డు సృష్టించాడు. 201921 డబ్ల్యూటీసీలో అజింక్య రహానె (1159) రన్స్ చేశాడు. తాజాగా రహానె రికార్డును జైస్వాల్ అధిగమించాడు. ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్లో జైస్వాల్ 19 ఇన్నింగ్స్ ల్లో (1156) పరుగులు సాధించాడు.

# టెస్టుల్లో 300వ వికెట్.. రవీంద్ర జడేజా కొత్త రికార్డు

**కాన్పూర్ :** టీమిండియా లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్.. రవీంద్ర జడేజా టెస్టు కెరీర్లో కొత్త రికార్డును నెలకొల్పాడు. టెస్టుల్లో 300వ వికెట్ తీసి కొత్త మైలురాయిని అందుకున్నాడు. బంగ్లాదేశ్తో కాన్పూర్లో జరుగుతున్న టెస్టు మ్యాచ్లో అతను ఈ ఘనతను సాధించాడు. బంగ్లా ఫస్ట్ ఇన్నింగ్స్లో బ్యాటర్ ఖదీల్ అహ్మద్ను ఔట్ చేసి ఆ రికార్డును అందుకున్నాడు. టెస్టుల్లో 300 వికెట్లతో పాటు మూడు వేల పరుగులు చేసిన క్రికెటర్గా కూడా రికార్డు క్రియేట్ చేశాడు. అత్యంత వేగంగా ఆ ఘనతను అందుకున్న రెండవ క్రికెటర్గా నిలిచాడు. టెస్టుల్లో 300వ వికెట్ తీసిన ఏడవ భారత బౌలర్గా జడేజా రికార్డు నెలకొల్పాడు. టెస్టు కెరీర్లో మైలురాయిగా నిలిచిన ఆ వికెట్ వీడియోను బీసీసీఐ తన ఎక్స్ అకౌంట్ లో పోస్టు చేసింది.

# నాలుగో రోజు రసవత్తర పోరు

- ఒక్క రోజే 18 వికెట్లు..
- ఆసక్తికరంగా మారిన భారత్, బంగ్లా రెండో టెస్టు
- గెలుపు దిశగా టీమిండియా




**కాన్పూర్:** చెపాక్లో బంగ్లాదేశ్ను భారీ తేడాతో ఓడించిన భారత జట్టుపై కాన్పూర్లో వరుణుడు నీళ్లు చల్లాడు. మూడు రోజుల విరామం తర్వాత ఆట మొదలైంది. అయినా సరే గెలుపే లక్ష్యంగా రోహిత్ సేన దూకుడు చూపించింది. భారత్, బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న రెండో టెస్టు ఆసక్తికరంగా మారింది. డ్రా ఖాయం అనుకున్న కాన్పూర్ టెస్టు అనూహ్యంగా భారత్ వైపు తిరుగుతోంది. మైదానం తడిగా ఉండటం వల్ల రెండు, మూడు రోజుల్లో ఆట సాధ్యం కాలేదు. రెండు రోజులు ఆట సాగకపోవడంతో ఫలితం కోసం టీమిండియా గట్టిగా ప్రయత్నిస్తోంది. ఎట్టకేలకు నాలుగో రోజు మ్యాచ్ సజావుగా సాగగా.. మొత్తం 18 వికెట్లు నేలకూలాయి.తొలి ఇన్నింగ్స్లో బంగ్లాదేశ్ను 233 పరుగులకే ఆలౌట్ చేసిన రోహిత్ సేన ఆ తర్వాత సుడిగాలి ఇన్నింగ్స్ ఆడింది. సోమవారం ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ లో 26/2 స్కోరుతో నిలిచి 26 పరుగుల వెనుకంజలో ఉంది. అశ్విన్ రెండు వికెట్లు పడగొట్టాడు. జకీర్ అలీ హసన్(10)ను ఎల్బీగా వెనక్కి పంపి తొలి వికెట్ అందించాడు. ఆ తర్వాత నైట్ వాష్మన్ హసన్ మహమూద్(4)ను సైతం బౌల్డ్ చేసి బంగ్లాను ఒత్తిడిలోకి నెట్టాడు. మరో ఓపెనర్ షద్మాన్ ఇస్లాం(7 నాటౌట్), మొమినుల్ హక్(0 నాటౌట్)లు ఆచితూచి ఆడి మరో వికెట్ పడనీయలేదు. దాంతో, నాలుగో రోజు ఆటముగిసే సరికి బంగ్లా 26 రన్స్ చేసింది.

నాలుగో రోజు 107/3తో తొలి ఇన్నింగ్స్ ను ఆరంభించిన బంగ్లాదేశ్ లంచ్ బ్రేక్ సమయానికి 205/6తో నిలిచిన బంగ్లా.. రెండో సెషన్లో మరో 28 పరుగులు జోడించి 233 పరుగులకు ఆలౌటైంది. మిగతా నాలుగు వికెట్లు కోల్పోయింది. మోమినుల్ హక్ (107) శతకం బాదగా.. నజ్ముల్ హొస్సేన్ శాంటో (31), మెహిదీ హసన్ మిరాజ్ (20) పరుగులు చేశాడు. భారత బౌలర్లలో బుమ్రా 3, సిరాజ్, అశ్విన్, ఆకాశ్ దీప్ రెండేసి వికెట్లు పడగొట్టారు. జడేజాకు ఒక వికెట్ దక్కింది.

### భారత బ్యాటర్ల ధనాధన్...

అనంతరం బ్యాటింగ్ కు దిగిన టీమిండియా 285/9 వద్ద డిక్లేర్ చేసింది. ఆరంభం నుంచే భారత ఆటగాళ్లు దూకుడు ప్రదర్శించారు. టీ20 మ్యాచ్ తరహాలో ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్(72), కేఎల్ రాహుల్(56)లు విధ్వంసక హాఫ్ సెంచరీలో పర్యాటక బౌలర్లను హడలెత్తించారు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (72; 51 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సులు), రోహిత్ (23; 11 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్ లు) దంచికొట్టడంతో భారత్ 18 బంతుల్లోనే 50 పరుగులు చేసింది. శుభ్మన్ గిల్ (39, 36 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించగా.. రిషబ్ పంత్ (9) నిరాశపర్చాడు. తర్వాత వచ్చిన విరాట్ కోహ్లి (47; 35 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), కేఎల్ రాహుల్ (68; 43 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు) ధనాధన్ ఇన్నింగ్స్లతో అలరించారు. బంగ్లా బౌలర్లలో మెహిదీ హసన్ మిరాజ్ (4/41), షకిబ్ అల్ హసన్ (4/78) సత్తాచాటారు.


**టీమ్ ఇండియా ఐదు ప్రపంచ రికార్డులు**

ఈ మ్యాచ్లో టీన్ఇండియా ఐదు ప్రపంచ రికార్డులు నమోదు చేసింది. టెస్టు క్రికెట్లో వేగంగా 50, 100, 150, 200, 250 పరుగులు చేసిన టీమ్గా రికార్డుల్లోకెక్కింది. ఐదో రోజు తొలి సెషన్లో భారత పేసర్లు చెలరేగితే విజయం ఎవరిదో తెలిపోవడం ఖాయం అనిపిస్తోంది.

తొలి ఇన్నింగ్స్ను యశస్వీ(72), రాహుల్(56) మెరుపులతో 2859 వద్ద డిక్లేర్ చేసిన భారత్.. వికెట్ల వేటను మొదలెట్టేసింది.

# మా చేతుల్లో ఏమీ లేదు..

- ప్రభుత్వం అనుమతిస్తేనే భారత జట్టును పాకిస్థాన్కు పంపుతాం
- బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా




**ముంబయి:** వచ్చే ఏడాది చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు ఆడుతుందా? లేదా? అనే విషయమై ఉత్కంఠ కొనసాగుతోంది. పాకిస్థాన్ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీకి జట్టును పంపడానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి సిద్ధంగా లేదు. భద్రతా కారణాల రీత్యా దాయాది దేశానికి జట్టును పంపడం తమకు సుతారము ఇష్టంలేదని బీసీసీఐ సెక్రటరీ జై షా ఇప్పటికే స్పష్టం చేశాడు. తాజాగా వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా సైతం అదే అభిప్రాయం వెలిబుచ్చాడు. ప్రభత్వం అనుమతిస్తేనే చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఆడుతుందని ఆయన చెప్పాడు. భారత్, బంగ్లాదేశ్ల మధ్య కాన్పూర్లో రెండో టెస్టు జరుగుతుండగా.. రాజీవ్ శుక్లా మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఆడుతుందా? అనే ప్రశ్న ఎదురైంది. అందుకు.. చాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టును పాకిస్థాన్కు పంపాలా? వద్దా? అనే విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.అయితే.. మా నియమాల ప్రకారం అంతర్జాతీయ పర్యటనల కోసం ప్రభుత్వ అనుమతి తీసుకోవడం తప్పనిసరి. భారత జట్టు ఏ దేశానికైనా వెళ్లాలా? వద్దా? అనేది ప్రభుత్వ ఇష్టం. ఈ విషయంలో మేమే చేయగిలిగేది ఏమీ ఉండదు. ప్రభుత్వ ఆదేశాలను పాటించడమే మా విధి అని శుక్లా తెలిపాడు.

### ద్వైపాక్షిక సిరీస్ జరిగి

**దాదాపు 11 ఏండ్లు కావొస్తోంది...**

భారత్, పాకిస్థాన్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరిగి దాదాపు 11 ఏండ్లు కావొస్తోంది. ఆ తర్వాత ఇరు జట్లు అంతర్జాతీయ వేదికల మీదనే తలపడనున్నాయి. దాంతో.. ఐసీసీ నిర్వహించే వరల్డ్ కప్, టీ20 ప్రపంచ కప్లలో మాత్రమే చిరకాల ప్రత్యర్థుల మ్యాచ్లు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే.. నిరుడు ఆసియా కప్ హక్కులు దక్కించుకున్న పాకిస్థాన్కు బీసీసీఐ ఝలక్ ఇచ్చింది. హైబ్రిడ్ మోడల్లో నిర్వహిస్తే తప్ప టీమిండియా ఆడదని సెక్రటరీ జై షా తేల్చి చెప్పాడు. దెబ్బకు దిగొచ్చిన ఐసీసీ.. చివరకు భారత జట్టు మ్యాచ్లను శ్రీలంకకు మార్చింది.కానీ.. వన్డే వరల్డ్ కప్ టోర్నీకి పీసీబీ భారత్కు తమ జట్టును పంపింది. దాంతో.. ఈసారి చాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా వెళ్లక తప్పని పరిస్థితి. అయినా సరే.. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తేనే భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీలో ఆడుతుందని పీసీబీకి షా స్పష్టం చేశాడు. ఈ విషయమై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ, షాల మధ్య పరోక్షంగా మాటల యుద్ధం నడిచింది. టీమిండియాను పాక్కు పంపడాన్ని నిరాకరిస్తూ భారత ప్రభుత్వం ఇచ్చిన లేఖ చూపాలని బీసీసీఐని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

# టెస్టు క్రికెట్ సిక్సర్లలో ఇంగ్లాండ్ రికార్డును బద్దలుకొట్టిన టీమ్ ఇండియా

**కాన్పూర్:** టెస్టు క్రికెట్లో టీమ్ ఇండియా మరో రికార్డు సాధించింది. ఒకక్యాలెండర్ ఇయర్ లో అత్యధిక సిక్సర్లు బాదిన జట్టుగా ఘనత సాధించింది. 2022లో ఇంగ్లాండ్ 29ఇన్నింగ్స్ ల్లో 89 సిక్సులు బాదింది. ఇప్పుడు ఆ రికార్డు భారత జట్టు బ్రేక్ చేసింది. టీమ్ ఇండియాకేవలం 14 ఇన్నింగ్స్ ల్లో 90 సిక్సులు నమోదు చేసింది. ప్రస్తుతం బంగ్లాదేశ్తో జరుగుతున్న రెండోటెస్టులో భారత్ ఈ ఘనత అందుకుంది. ఈ మ్యాచ్లో టీమ్ ఇండియా ఆటగాళ్లు మరిన్ని సిక్సర్లుబాదే ఛాన్స్ ఉంది. దీంతో త్వరలోనే భారత జట్టు సునాయసంగా 100కు పైగా సిక్సులు నమోదు చేయడం ఖాయం. బాజ్బాల్ ఆటతో టెస్టు క్రికెట్లో సంచలనం సృష్టిస్తున్న ఇంగ్లాండ్ ఈ ఏడాదిటెస్టు క్రికెట్లో సిక్సర్లు బాదడంలో భారత్ కంటే చాలా వెనుకబడి ఉంది. ఇప్పటివరకు ఇంగ్లాండ్ 60 సిక్సులతో ఈ జాబితాలో రెండో స్థానంలో ఉంది. న్యూజిలాండ్ (51) మూడో స్థానంలో నిలిచింది.




# బాబర్ అజామ్ను విరాట్తో పోల్చొద్దు

**పాక్ మాజీ దిగ్గజం జహీర్ అబ్బాస్**

**దిల్లీ :** ప్రపంచ క్రికెట్లో భారత స్టార్ విరాట్ కోహ్లి ఎన్నో రికార్డులు సృష్టిస్తూ ఈ తరం మేటి ఆటగాడిగా గుర్తింపు పొందాడు. ఇటీవల కాలంలో పాక్ ఆటగాడు బాబర్ అజామ్ ని కొంతమంది విరాట్ కోహ్లితో పోలుస్తున్నారు. దీన్ని పాకిస్థాన్ దిగ్గజ ఆటగాడు జహీర్ అబ్బాస్ తప్పుబట్టాడు. విరాట్తో అజామ్ని పోల్చడం సరికాదని స్పష్టం చేశాడు. 'ఆ పోలికలన్నీ అర్థరహితమైనవి. విరాట్ కోహ్లి ప్రతి మ్యాచ్లో స్కోర్ చేస్తాడు. బాబర్ అజామ్ మాత్రం అలా కాదు. ఆడిన మ్యాచ్లో స్కోర్ కూడా సరిగ్గా చేయలేదు. విరాట్తో అతడిని ఎలా పోలుస్తారు? ఎవరు బాగా ఆడితే వారే కదా గొప్ప ప్లేయర్. కోహ్లి అంతర్జాతీయ క్రికెట్లో అన్ని ఫార్మాట్లలో కలిపి 80 శతకాలు చేశాడు. బాబర్ అజామ్ ఇప్పటి వరకు 31 సెంచరీలను నమోదు చేశాడు. ఒకప్పుడు విరాట్, స్టీవ్ స్మిత్, జో రూట్, కేన్ విలియమ్సన్తో కలిసి ఫ్యాబ్ 5లో ఉన్న బాబర్ ఇప్పుడు పేలవమైన ప్రదర్శనలు చేస్తూ తన స్థానాన్నే ప్రశ్నార్థకంగా మార్చుకున్నాడు" అని జహీర్ అబ్బాస్ పేర్కొన్నాడు. మరోవైపు, రోహిత్ శర్మ నాయకత్వంలో భారత జట్టు అద్భుతంగా ఆడుతోందని జహీర్ అబ్బాస్ ప్రశంసలు కురిపించాడు. 'టీమ్ ఇండియా అన్ని విభాగాల్లో పటిష్టంగా ఉంది. బ్యాటర్లు మంచి ఫామ్లో ఉన్నారు.. బౌలర్లు రాణిస్తున్నారు. టీమ్ చాలా బ్యాలెన్స్డ్గా ఉంది. ప్రతిదీ అనుకూలంగా జరుగుతున్నప్పుడు అన్నీ సజావుగా సాగుతాయి. ప్రస్తుతం టీమ్ ఇండియా విషయంలో అదే జరుగుతుంది. రానున్న ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా భారత్ మంచి ప్రదర్శన చేస్తుందని ఆశిస్తున్నా. ఎన్ని ఫార్మాట్లో ఆడినా టెస్ట్ క్రికెట్ ఆడినప్పుడే ఒక ఆటగాడి నైపుణ్యం, టెక్నిక్, ఫిట్నెస్ తెలుస్తాయి. ఎన్ని టీ20లు ఆడినా, ఎన్ని వన్డేలు ఆడినా, ఆఖరికి తిరిగి రావాల్సింది టెస్ట్ క్రికెట్కే. ఇక్కడే ఆట ఎక్కువ సేపు ఉంటుంది' అని అబ్బాస్ అభిప్రాయపడ్డాడు.

# టెస్టుల్లో టీమిండియా కొత్త రికార్డు

**10 ఓవర్లలో 100 పరుగులు..**

**కాన్పూర్:** బంగ్లాదేశ్తో జరుగుతున్న రెండో టెస్టులో.. రోహిత్ సేన రెండు రికార్డులు క్రియేట్ చేసింది. కాన్పూర్ టెస్టులో ఇవాళ టీమిండియా కేవలం 10.1 ఓవర్లలో వంద పరుగులు చేసింది. టెస్టుల్లో అత్యంత వేగంగా వంద రన్స్ స్కోర్ చేసిన జట్టుగా టీమిండియా రికార్డును అందుకున్నది.


# 200 బిలియన్ డాలర్ల క్లబ్లో మెటా సీఈఓ మార్క్ జుకర్ బర్గ్..!



**విశ్వంభర (బిజినెస్) :** మెటా సీఈఓ మార్క్ జుకర్ బర్గ్ నికర వ్యక్తిగత సంపద 200 బిలియన్ డాలర్లు దాటింది. తద్వారా గ్లోబల్ బిలియనీర్ల జాబితాలో ఆయన నాలుగో స్థానంలో ఉన్నారు. ఇప్పటి వరకూ ఈ జాబితాలో అమెజాన్ ఫౌండర్ జెఫ్ బెజోస్, ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా సీఈఓ ఎలన్ మస్క్, ఎల్వీఎంహెచ్ చైర్మన్ బెర్నార్డ్ అర్నాల్ట్ ఉన్నారని బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తెలిపింది. ప్రపంచంలోకెల్లా అతిపెద్ద కుబేరుడిగా ఎలన్ మస్క్ నిలిచారు. ఎలన్ మస్క్ వ్యక్తిగత నికర సంపద 265 బిలియన్లు, జెఫ్ బెజోస్ సంపద 216 బిలియన్ల డాలర్లు. మెటా సీఈఓ మార్క్ జుకర్ బర్గ్ కు కంపెనీలో వాటా 13 శాతం పెరగడం వల్లే ఆయన వ్యక్తిగత సంపద పెరిగింది. గత జూలై లో మెటా ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం 2023 నుంచి కంపెనీ 134.9 బిలియన్ల డాలర్ల రెవెన్యూ పెంచుకుంది.ప్రపంచ వ్యాప్తంగా మెటాకు నెలవారీగా 400 కోట్ల యూజర్లు ఉన్నారు. మెటా కనెక్ట్ 2024 ఈవెంట్ లో మార్క్ జుకర్ బర్గ్ స్పందిస్తూ మెటా ఏఐ సెక్సెస్ వల్లే ఆదాయం పెరిగిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ అసిస్టెంట్ వాడకం విస్తృతంగా పెరిగిందన్నారు. ప్రస్తుతం 500 మిలియన్ల నెలవారీ యూజర్లు పెరిగారని, యూరోపియన్ యూనియన్ వంటి ప్రధాన మార్కెట్లలో మెటా ఏఐ సేవలు ఇంకా ప్రారంభించలేదని చెప్పారు.

# భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు..

- ₹3.5 లక్షల కోట్లు ఆవిరి
- లాభాల స్వీకరణకు ఇన్వెస్టర్లు దిగడంతో ఈ పరిస్థితి




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, విదేశీ మదుపర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం వంటి కారణాలతో సూచీలు భారీగా పతనమయ్యాయి. అన్ని సెక్టార్ల పరిధిలో ఇన్వెస్టర్లు భారీగా లాభాల స్వీకరణకు దిగడంతో ఇటు బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్, అటు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ ఒకశాతానికి పైగా నష్టపోయాయి.

ముఖ్యంగా రిలయన్స్, ఐసీఐసీఐ, హెచ్ఎఫ్సీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేశాయి. సెన్సెక్స్ 1200 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 26 వేల మార్కును కోల్పోయి 25,800 స్థాయికి చేరింది. మదుపర్ల సంపద దాదాపు రూ.3.5 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.474.4 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 85,208.76 పాయింట్ల (క్రితం ముగింపు 85,571.85) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,257.14 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరిన సూచీ.. చివరికి 1272.07 పాయింట్ల నష్టంతో 84,299.78 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 368 పాయింట్లు నష్టపోయి 25,810.85 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 10 పైసలు క్షీణించి 83.80కి చేరింది.

నిఫ్టీ50లో 41 స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. హీరో మోటో కార్ప్, రిలయన్స్, యాక్సిస్ బ్యాంక్, భారత్ ఎలక్ట్రానిక్స్ తదితర స్టాక్స్ 4.03 శాతం నష్టపోయాయి. జేఎస్డబ్ల్యూ స్టీల్, ఎన్టీపీసీ, బ్రిటానియా ఇండస్ట్రీస్, హిండాల్కో ఇండస్ట్రీస్,ఏషియన్ పెయింట్స్, టాటా స్టీల్ తదితర తొమ్మిది స్టాక్స్ లాభాలతో స్థిరపడ్డాయి. అలాగే బీఎస్ఈ30లో 25 స్టాక్స్ నష్టాలతో స్థిర పడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, నెస్లే ఇండియా, టెక్ మహీంద్ర స్టాక్స్ 3.15 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు జేఎస్ డబ్ల్యూ స్టీల్, ఎన్టీపీసీ, టాటా స్టీల్, టైటాన్ కంపెనీ, ఏషియన్ పెయింట్స్ మాత్రమే లాభ పడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.64 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2669 డాలర్ల వద్ద కొనసాగుతోంది.నిఫ్టీ50లో 41 స్టాక్స్ నష్టాలతో ముగిశాయి.

### కారణాలు ఇవే..

* వృద్ధికి ఊతం ఇచ్చేలా చైనా ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కొన్ని చర్యలు విదేశీ మదుపర్లు అటుగా దృష్టి సారించినట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు సోమవారం రాణించాయి. ఇది మన మార్కెట్లకు నెగిటివ్గా మారింది.

* పశ్చిమసియాలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్త పరిస్థితులు కూడా మదుపర్లను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. లెబనాన్పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతుండడం ఇందుక్కారణం.

* ఫెడ్ వడ్డీ రేట్ల కోత ప్రకటన తర్వాత దూసుకెళ్లిన మార్కెట్లకు గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం కూడా మరో కారణంగా మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారు.

'చిన్న మొత్తాలపై'

# పాత వడ్డీ రేట్లే..

**యథాతథంగా కొనసాగించిన కేంద్రం**




**దిల్లీ:** చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను కేంద్రం మరోసారి యథాతథంగా ఉంచింది. అక్టోబర్ డిసెంబర్ త్రైమాసికానికి పాత వడ్డీ రేట్లే కొనసాగనున్నాయి. పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ వంటి పథకాలపై వడ్డీ రేట్లను సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి. జులై సెప్టెంబర్ త్రైమాసికంలో కొనసాగిన వడ్డీ రేట్లే మూడో త్రైమాసికంలోనూ కొనసాగుతాయని ఆర్థిక మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.నోటిఫికేషన్ ప్రకారం.. సుకన్య సమృద్ధి యోజన పథకంపై ఎప్పటిలానే 8.2 శాతం వడ్డీ లభించనుంది. మూడేళ్ల టర్మ్ డిపాజిట్పై 7.1 శాతం వడ్డీ లభిస్తుంది. పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ పథకానికి (PPF) 7.1 శాతం, పోస్టాఫీస్ సేవింగ్స్ స్కీమ్పై 4 శాతం వడ్డీ లభిస్తుంది. కిసాన్ వికాస్ పత్ర పథకంపై 7.5 శాతం లభిస్తుంది. 115 నెలల్లో గడువు తీరుతుంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్పై 7.7 శాతం, మంత్లీ ఇన్కమ్ స్కీమ్ 7.4 శాతం చొప్పున వడ్డీ లభిస్తుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

# నటనా చక్రవర్తికి అత్యున్నత పురస్కారం

- బెంగాల్ టైగర్‌గా గుర్తింపు పొందిన విలక్షణ నటుడు మిథున్
- ఉద్యమబాట నుంచి సినీరంగంలోకి ప్రవేశించి రాణించారు..
- సినీ నటుడిగా, నిర్మాతగా, వ్యాపారవేత్తగా రాజకీయ నాయకుడిగా రాణించిన బహుముఖ ప్రజ్ఞశాలి..

సినీరంగానికి సంబంధించి అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డ్‌గా భావించే 'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డ్ బాలీవుడ్ విలక్షణ నటుడు, లెజండరీ యాక్టర్ మిథున్ చక్రవర్తి ని వరించిన విషయం తెలిసిందే. ఆయన ఈ అవార్డుకు ఎంపికైనట్లుగా అధికారికంగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది. అక్టోబర్ 8న జరగనున్న జాతీయ అవార్డుల ప్రధానోత్సవ వేడుకలో ఈ పురస్కారాన్ని మిథున్ చక్రవర్తి అందుకోనున్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో పోరుబాటలోకి అడుగుపెట్టి.. ఉద్యమకారుడిగా ఎంతోమందిని ప్రభావితం చేసిన వ్యక్తే గౌరవంగా చక్రవర్తి అలియాస్ మిథున్ చక్రవర్తి. సోదరుడి మరణంతో తన ఆలోచనలు మార్చుకుని.. 'డిస్కో డ్యాన్సర్‌గా అవతారమెత్తిన ఆయన.. బాలీవుడ్‌లో 'బెంగాల్ టైగర్' అనే కీర్తి గడించారు. ఏడు పదుల వయసులోనూ నటుడిగా అలరిస్తున్నారు. సినీ రంగానికి ఆయన అందించిన సేవలను గుర్తించిన కేంద్రం తాజాగా ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆయనకు సంబంధించిన పలు ఆసక్తికర విశేషాలు.

బసంత కుమార్ చక్రవర్తి, శాంతి రాణి దంపతులకు 1950 జూన్ 16న మిథున్ చక్రవర్తి జన్మించారు. ఆయన అసలు పేరు గౌరంగా చక్రవర్తి. బి.ఎస్సీ కెమిస్ట్రీలో డిగ్రీ పూర్తి చేశారు. సమాజంలో పెత్తందారివ్యవస్థతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి ఆయన రగిలిపోయారు. స్వేచ్ఛ అందించేందుకు ఉద్యమబాట పట్టారు. ఉద్యమకారుడిగా ఒక వెలుగు వెలిగారు. అదే సమయంలో సోదరుడు మరణించడంతో ఆయన మనసు చలించిపోయింది. ఏం చేయాలో పాలుపోక ఉద్యమ బాటను వీడి జన జీవనంలోకి అడుగుపెట్టారు. ముంబయికు పారిపోయి కొత్త నైట్ క్లబ్ డ్యాన్సర్ టు హీరో..!

ముంబయికు వెళ్లిన సమయంలో ఉద్యోగం కోసం మిథున్ ఎన్నో ప్రయత్నాలు చేశారు. చివరకు ఒక నైట్ క్లబ్లో డ్యాన్సర్గా చేరారు. అక్కడికి విచ్చేసిన సినీ ప్రముఖులు ఆయన డ్యాన్స్ చూసి మెచ్చుకున్నారు. అలాంటి సమయంలో బెంగాలీ దర్శకుడు మృణాల్ సేన్.. 'మృగయా' (1976)లో నటుడిగా తొలి అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలోనే యాక్టింగ్లో శిక్షణ తీసుకున్నారు. 'మృగయా'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మిథున్.. తొలి ప్రయత్నంలోనే ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు. ముంబయి రోజులను గుర్తు చేసుకుంటూ ఆయన గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "ఫుట్పాత్ నుంచి ఈ స్థాయికి వచ్చా. ముంబయి వచ్చినప్పుడు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా. పబ్లిక్ పార్కులు, హాస్టల్స్ ఆవరణల్లో పడుకునేవాడిని. కష్టాలు తట్టుకోలేక చనిపోవాలనిపించింది. కాకపోతే ధైర్యంగా నిలబడ్డా. అన్నింటినీ ఎదుర్కొన్నా" అని మిథున్ తెలిపారు.

### ఒకే ఏడాదిలో 19 చిత్రాలు..!

కెరీర్ ఆరంభంలో ఎన్నో చిత్రాల్లో నటించినప్పటికీ అనుకున్న స్థాయి గుర్తింపు పొందలేకపోయారు. 1982లో విడుదలైన 'షౌకిన్', 'అశాంతి' వంటి చిత్రాలు ఆయనకు స్టార్ స్టేటస్ అందించాయి. అదే ఏడాదిలో విడుదలైన 'డిస్కో డ్యాన్సర్' ఆయనకు ప్రపంచదేశాల్లో గుర్తింపు తెచ్చి పెట్టింది. 'ఐ యామ్ ఏ డిస్కో డ్యాన్సర్' అంటూ ఆయన స్టెప్పులకు సినీ ప్రియులు ఉర్రూతలూగారు. ఆ తర్వాత ఆయన వెనక్కి తిరిగి చూసుకోలేదు. హీరోగా వరుస సినిమాల్లో యాక్ట్ చేశారు. హీరో అనే మాటకు ఆయన అర్థం మార్చేశారు. బలిష్టమైన శరీరం.. బ్రేక్ డ్యాన్సులు.. ఆశ్చర్యపరిచే ఫైట్లతో ప్రేక్షకులతో ఔరా అనిపించుకున్నారు. అప్పట్లోనే ఆయనకు సిక్స్ ప్యాక్ బాడీ ఉండేది. 1989లో.. ఒకే ఏడాదిలో అత్యధిక సినిమాలు (19 మూవీస్) విడుదలైన హీరోగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు సొంతం చేసుకున్నారు. బాలీవుడ్లో 'బెంగాల్ టైగర్' అని కీర్తి పొందారు.



### విలన్ గా, సహాయనటుడిగా ప్రత్యేక గుర్తింపు..

ఇండస్ట్రీలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న తర్వాత ఆయన హీరోగానే కాకుండా విలన్, సహాయ నటుడు పాత్రలు పోషించారు. అమితాబ్ బచ్చన్ నటించిన 'అగ్నిపథ్ లో కీలక పాత్రలో కనిపించారు. ఈ చిత్రానికి ఉత్తమ సహాయ నటుడిగా ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు. హిందీలోనే కాకుండా బెంగాలీ, ఒరియా, భోజ్పురి చిత్రాల్లో నటించిన ఆయన.. మూడు జాతీయ అవార్డులు.. నాలుగు ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు. తన కెరీర్ని ఉద్దేశించి గతంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "దాదాపు 370కు పైగా చిత్రాల్లో నటించా. రోజుకు నాలుగు షిఫ్టుల్లో పనిచేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. వివిధ సినిమాల కోసం ఒకే సమయంలోనే పనిచేసేవాడిని. డైలాగ్స్, సీన్స్ అన్ని ఒకేలా ఉన్నట్లు అనిపించేవి. ఫ్యాన్స్ నా నుంచి డ్యాన్సు, ఫైట్స్ కోరుకునేవారు. నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన అభిమానులకు నా ధన్యవాదాలు" అని చెప్పారు. సినీ రంగానికి ఆయన అందించిన సేవలను గుర్తించిన కేంద్రం ఇటీవల 'పద్మభూషణ్ తో గౌరవించింది.

సినీరంగంలో ఫెయిల్యూర్స్ ఏ నటుడికైనా ఉంటాయి. అదే విధంగా మిథున్ కూడా వరుస పరాజయాలు అందుకున్నారు. అవకాశాలు రావడం పూర్తిగా ఆగిపోక ముందే.. ఆయనే సినిమాలకు దూరంగా వెళ్లారు. ఊటీకి వెళ్లి.. ప్రకృతి ఒడిలో ప్రశాంత జీవనం గడిపేందుకు ఆసక్తి చూపించారు. ఈ క్రమంలోనే మోనార్క్ గ్రూప్ పేరుతో హోటల్ బిజినెస్లోకి అడుగుపెట్టారు. "ఎన్నో చిత్రాల్లో యాక్ట్ చేసినప్పటికీ కొన్ని మాత్రమే నాకు నచ్చినవి కొన్నే. మిగిలిన వాటిని డబ్బు కోసమే నటించా. ఇండస్ట్రీలో మెరిసేదంతా బంగారం కాదు. మిత్రుల రూపంలో శత్రువులు మన పక్కనే ఉంటారనే విషయాన్ని గ్రహించలేకపోయా. 'మోనార్క్' హోటల్ ప్రారంభించినప్పుడు బ్యాంకుల నుంచి లోన్లు తీసుకున్నా. వాటిని తీర్చడానికి బిగ్రేడ్ చిత్రాల్లోనూ యాక్ట్ చేశా. ఒకప్పుడు దేశంలోనే అత్యధిక పారితోషికం పొందిన నటుడిగా గుర్తింపు పొందిన నేను, లోన్లు తీసుకోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. అత్యధిక పన్ను చెల్లించిన వ్యక్తిగా నాకు పేరు ఉంది. అంత మాత్రాన అత్యధిక సంపన్నుడిని కానవసరం లేదు కదా" అని ఆయన తెలిపారు.



### రాజకీయాల్లోకి అడుగుపెట్టిన మిథున్..

నటుడు, వ్యాపారవేత్త, నిర్మాతగా బిజీగా ఉన్నప్పటికీ.. ప్రజల కోసం పాటుపడాలని మిథున్ భావించారు. రాజకీయాలు అందుకు ఉపయోగపడతాయని నమ్మారు. తృణమూల్ కాంగ్రెస్‌లో చేరిన ఆయన 2014లో రాజ్యసభ సభ్యుడిగా వర్క్ చేశారు. 2016లో ఆ పదవికి రాజీనామా చేశారు. 2021లో బీజేపీచేరారు.

# అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే కొత్త సీజన్ వచ్చేస్తుంది

టాలీవుడ్ హీరో బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరించిన టాక్ షో అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే . ఇప్పటికే సీజన్ 1, సీజన్ 2 సూపర్ క్రేజ్ సంపాదించుకున్నాయి. తాజాగా రెట్టించిన ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు కొత్త సీజన్ (సీజన్ 3)తో రెడీ అవుతున్నాడు బాలకృష్ణ.సీజన్ 1, 2లో పవన్ కల్యాణ్, మహేశ్ బాబు, ప్రభాస్ లాంటి స్టార్ హీరోలతో సందడి చేసిన బాలయ్య మూడో సీజన్‌తో కూడా స్టార్ సెలబ్రిటీలతో వినోదాన్ని అందించేందుకు సిద్ధమవుతున్నాడన్న వార్త ఇప్పుడు నెట్టింట రౌండప్ చేస్తోంది. నయా సీజన్ 3 తొలి అతిథిగా మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్ రాబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్.లక్కీ భాస్కర్ దీపావళికి విడుదలవుతున్న నేపథ్యంలో ఈ మూవీ ప్రమోషన్స్ భాగంగా దుల్కర్ సల్మాన్, డైరెక్టర్ వెంకీ అట్లూరి, నిర్మాత సూర్య దేవర నాగవంశి కూడా షోలో జాయిన్ కాబోతున్నారట. బాలకృష్ణ అండ్ టీంపై వచ్చే ఈ ఎపిసోడ్‌ను నేడు హైదరాబాద్‌లో షూట్ చేశారని సమాచారం. దసరా కానుకగా స్పెషల్ ట్రీట్ అందిస్తూ.. ఎపిసోడ్‌ను విడుదల చేయబోతున్నారని సమాచారం.




## పొంగల్ కానుకగా థియేటర్లలోకి

# విక్రమ్ వీర ధీర సూరన్

ఇటీవలే తంగలాన్ సినిమాతో మంచి హిట్టందుకున్నాడు కోలీవుడ్ స్టార్ యాక్టర్ చియాన్ విక్రమ్. ఈ స్టార్ యాక్టర్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మరో చిత్రం వీరధీరసూరన్ . చిత్త (చిన్నా) ఫేం ఎస్‌యూ అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఛియాన్ 62గా వస్తోన్న ఈ మూవీ టైటిల్ టీజర్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తూ.. సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది. విక్రమ్ ఈ సారి పక్కా యాక్షన్ ప్యాక్డ్ కమర్షియల్ సినిమాతో వినోదాన్ని అందించబోతున్నాడని టీజర్ క్లారిటీ ఇచ్చేస్తుంది.

తాజాగా వీరధీర సూరన్ విడుదలకు సంబంధించిన వార్త ఒకటి తెరపైకి వచ్చింది. ఈ చిత్రాన్ని 2025 పొంగళ్ కానుకగా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్టు కోలీవుడ్ సర్కిల్ టాక్.

మరి దీనిపై విక్రమ్ టీం నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలంటున్నారు సినీ జనాలు. ఈ చిత్రంలో కోలీవుడ్ భామ దుషారా విజయన్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇప్పటికే దుషారా విజయన్ లుక్ కూడా రిలీజ్ చేశారు.ఈ మూవీలో పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఎస్‌జే సూర్య, పాపులర్ మలయాళ నటుడు సూరజ్ వెంజరమూడు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీ రెండు పార్టులుగా రాబోతుండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన క్లారిటీ రావాల్సి ఉంది. ఇప్పటికే విక్రమ్, ఎస్‌యూ అరుణ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ స్పెషల్ వీడియోను విడుదల చేయగా.. నెట్టింట చక్కర్లు కొడుతోంది.




విక్రమ్ మరోవైపు గౌతమ్ వాసు దేవ్ మీనన్ డైరెక్షన్‌లో ధ్రువ నక్షత్రం: యుద్ధ కాండం లో నటిస్తున్నాడు. పెళ్లి చూపులు ఫేం రీతూవర్మ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుంది. చాలా కాలం క్రితమే మొదలైన ఈ సినిమాకు సంబంధించిన కొత్త అప్‌డేట్ రావాల్సి ఉంది.

## నేడు వరుణ్ తేజ్ మట్కా తేదీ ప్రకటన



టాలీవుడ్ హీరో వరుణ్ తేజ్ నటిస్తోన్న తాజా చిత్రం మట్కా. పలాస 1978 ఫేం కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. మట్కాలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీరియాడిక్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర అప్‌డేట్ అందించారు మేకర్స్. రీసెంట్‌గా రామోజీఫిలిం సిటీలో మట్కా ఫైనల్ షెడ్యూల్ కొనసాగుతుంది. ఎక్జయిటింగ్ అప్‌డేట్స్ వచ్చేస్తున్నాయి.. అంటూ మేకర్స్ ఓ వార్తను షేర్ చేశారు.

తాజాగా విడుదల తేదీపై క్లారిటీ ఇవ్వబోతున్నట్టు తెలిపారు. పేక ముక్కలు ఆటకు రెడీ చేస్తున్న లుక్ షేర్ చేస్తూ.. విడుదల తేదీని మంగళవారం లాంచ్ చేయబోతున్నట్టు ప్రకటించారు. ఇక ఇప్పటికే విడుదల చేసిన మట్కా టైటిల్ టీజర్ సినిమాపై క్యూరియాసిటీతోపాటు అంచనాలు పెంచేస్తుంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ కథానుగుణంగా నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. మట్కాను వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. మట్కా ఆడియో రైట్స్ ఆడియో రైట్స్‌ను పాపులర్ మ్యూజిక్ లేబుల్ ఆదిత్య మ్యూజిక్ రూ.3.6 కోట్ల భారీ మొత్తానికి కొనుగోలు చేసిందని సమాచారం. ఈ సినిమా కోసం మేకర్స్ ఇప్పటికే 1980 బ్యాక్‌డ్రాప్ వైజాగ్ లొకేషన్స్ డిజైన్ చేయగా.. ఇందుకు సంబంధించిన స్పెషల్ గ్లింప్స్ నెట్టింట రౌండప్ చేస్తోంది.

## రూ.500 నోటుపై అనుపమ్ ఖేర్ ఫోటో..




దేశవ్యాప్తంగా ప్రస్తుతం నకిలీ కరెన్సీలు కలకలం రేపుతున్న విషయం తెలిసిందే. కొందరు నేరగాళ్లు నకిలీ నోట్లను ముద్రించి మార్కెట్‌లో చలామణీ చేస్తున్నారు. అయితే వీరిని పట్టుకోవడం పోలీసులకు కత్తి మీదా సాములా మారింది. దీనిపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎన్ని చర్యలు తీసుకున్న పూర్తి స్థాయిలో నియంత్రించలేకపోతున్నాయి. అయితే నకిలీ నోట్లకు సంబంధించిన ఒక ముఠాను తాజాగా అహ్మదాబాద్ పోలీసులు రెండ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే పోలీసులకు పట్టుకున్న ఆ ముఠా దగ్గరున్న నోట్లను చూసి అధికారులు షాక్ అయ్యారు. వారి వద్ద రూ.500 నోట్లలో నోట్లలో మహాత్మ గాంధీకి బదులుగా బాలీవుడ్ నటుడి బొమ్మ ఉంది. అవును రూ.500 నోట్లలో బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ చిత్రం ఉంది. అలాగే ఈ నోట్లపై 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'కు బదులుగా 'రిసోల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' అని ముద్రించారు. ఈ నోట్లను ఉపయోగించి బంగారం కోనడానికి ప్రయత్నం చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంలో పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రూ.1.60 కోట్ల విలువైన ఫేక్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు.

అయితే రూ.500 నోటుపై అనుపమ్ ఖేర్ ఫోటో ఉండడంతో దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్‌గా మారాయి. ఇక ఈ విషయం అనుపమ్ ఖేర్ దగ్గరికి కూడా వెళ్లగా.. అతడు స్పందిస్తూ.. రూ.500 నోట్లపై గాంధీజీ ఫోటోకు బదులుగా నా ఫోటోనా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఈ కాలంలో ఏదైనా జరగవచ్చు అంటూ రాసుకోచ్చాడు.

## అక్టోబర్ 2న రజినీకాంత్ వెట్టైయాన్ ట్రైలర్ విడుదల



తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. తలైవా కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం వెట్టైయాన్ . జై భీమ్ ఫేం టీజే జ్ఞానవేళ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంఅక్టోబర్ 10న థియేటర్లలో గ్రాండ్‌గా సందడి చేయనుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో మేకర్స్ ట్రైలర్ లాంచ్ అప్‌డేట్ అందించారు.వెట్టైయాన్ ట్రైలర్‌ను అక్టోబర్ 2న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు. రజినీకాంత్ బ్లాక్ షర్ట్ విత్ స్టైలిష్ గాగుల్స్‌తో కనిపిస్తుండగా.. మరోవైపు బుల్లెట్లు చూడొచ్చు. టార్గెట్ సెట్ అయింది.. అంటూ లైకా ప్రొడక్షన్స్ రిలీజ్ చేసిన తాజా లుక్ నెట్టింటిని షేక్ చేస్తోంది. మేకర్స్ ఇటీవలే బ్లాక్ గాగుల్స్ పెట్టుకున్న రజినీకాంత్ ఆయుధాన్ని పట్టుకుని గూండాల భరతం పట్టి.. మరోవైపు జేబులో చేయి పెట్టుకొని సూపర్ స్టైలిష్‌గా నడుచుకుంటూ వస్తున్న లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఈ చిత్రంలో దుషారా విజయన్, రితికా సింగ్ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. రానా దగ్గుబాటి, ఫహద్ ఫాసిల్ , మంజు వారియర్, రావు రమేశ్, రోహిణి మొల్లేటి కీ రోల్స్ పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుబాస్కరన్ తెరకెక్కిస్తున్నారు.ఈ మూవీకి మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com